Vol. I No. 3

# AKASHVANI PRASARIKA

(TELUGU)

January 1958 Price: 50 nP.

విజయవాడ, హైదరాబాదు,
మదరాసు కేంద్రములనుంచి
ప్రసారమైనవి.

విజయ ప్రెస్, విజయవాడ.

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | గ్రీష్మము-౧ | — శ్రీ బొడ్డు బాపిరాజు | 5 |
| 2. | తెలుగు సాహిత్యోద్యమాలు - ప్రబంధోద్యమం | — శ్రీ పోలూరి హనుమజ్జానకీరామ శర్మ | 7 |
| 3. | 'పసిగుండె' (కథానిక) | — శ్రీ మెట్టా వెంకటేశ్వరరావు | 11 |
| 4. | కామేశ్వరి కొలుపు పాట | — (ప్రాచీన రచన) | 16 |
| 5. | విమర్శ కళ | — శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు | 17 |
| 6. | గ్రీష్మము-౨ | — శ్రీ వావిలాల సోమయాజులు | 22 |
| 7. | శ్రీహర్ష శ్రీనాథుల స్వర్గసమావేశము | — డాక్టర్. కె. వి. ఆర్. నరసింహం, శ్రీ కె. జోగయ్యశర్మ | 25 |
| 8. | శ్రవ్య దృశ్య కావ్యముల తారతమ్య పరిశీలన | — శ్రీ ఎం. శివకామయ్య | 30 |
| 9. | రెండు కళ్లు (నాటిక) | — శ్రీ ఏడిద కామేశ్వరరావు | 35 |
| 10. | ఆంధ్రదేశమునందు ఆయుర్వేదమును అభివృద్ధిపరచు పథకములు | — శ్రీ ఎ. లక్ష్మీపతి | 48 |
| 11. | మొక్కుబడులూ, ముడుపులూ | — శ్రీ పాలంకి వెంకట రామచంద్రమూర్తి | 51 |
| 12. | ఇలవేల్పు (కథానిక) | — శ్రీ త్రిపురనేని గోపీచంద్ | 55 |
| 13. | సారస్వత ఐతిహ్యములలో తాంబూల సేవన ప్రశంస | — శ్రీ గూడూరి నమశ్శివాయ | 61 |
| 14. | గ్రీష్మము-3 | — శ్రీ కందుకూరి రామభద్రరావు | 66 |
| 15. | తెలుగు సాహిత్యోద్యమాలు - భావకవిత్వోద్యమము | — శ్రీ నెలికిచర్ల వెంకటరత్నం | 68 |
| 16. | కృష్ణవేణి మణిమేఖల | — శ్రీ వింజమూరి శివరామారావు | 73 |
| 17. | ఆంధ్రరచయితలు — కొంపెల్ల జనార్దనరావు | — శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు | 74 |



# గ్రీష్మము-౧

శ్రీ బొడ్డు బాపిరాజుగారు.

పగడపు పలుకుల్లాంటి ఎఱ్ఱని చివుళ్లూ నవ్వుతూ పలకరించే పువ్వులూ చల్లని పిల్లగాలులూ గున్నమామిడి కొలువుకూటాల్లో కోకిలస్వామి పాటకచేరీలూ వీటితో వసంతుడంటే అందరికీ అభిమానమే. అతని తమ్ముడు గ్రీష్మం అనగానే నిప్పులు చెరిగే ఎండలూ సుడిగాలులూ వడగాల్పులూ వట్టిపోయిన చెరువులూ దొరువులూ గృహదహనాలూ గుర్తుకువస్తాయి. ఈ నిదాఘం బాహ్య జగత్తునే గాక అంతరంగాల్ని సైతం ఆర్చివేస్తోందో ఏమో మనస్స్రవంతిలో మధురభావ తరంగమే మొలిచిరాదు.

కెందలిరాకు జొంపములు, చెల్వపు క్రొవ్విరి
మల్లెతావులన్
మందమరుత్ కిశోరముల, మంజుల
బాలరసాల కోకిలా
నందరవమ్ములన్ జనమనః ప్రియుడైన
వసంతు డేగ, రా
చందుగ వచ్చె వాని యనుజన్ముడు
గ్రీష్ముడహంకృతోష్ముడై....

ప్రొద్దుననే సెగల్ పొగలార్చుచును పృధ్వి
యుడికించె కుంపటి నుంచినట్లు,
పదపదమ్మన సన్నపడి జలదేవతల్
కనరారు వలసపోయిన విధాన,

నడిమింటి త్రోవ తేరడుగు వెట్టకయె భా
స్కరు డూది నిప్పులు చెరిగిపోసి,
సుడిగాలి బిట్టార్చి వడగొట్టె వెడగాడ్పు
సత్రకాయగ వీతి హోత్రునకును

పగలు పగలెల్ల తపియించు ప్రాణికోటి
వ్రేల్చెరాత్రి నభమ్ము కాలినపెనమ్ము
దుస్సహ నిదాఘ విభుని యంతస్సు తెలిసి
పంచభూతమ్ములును తలవంచినడిచె.

చటులనిదాఘ తాపమిది సర్వబహిర్జగ
మన్నమాటె కా
దెటువలె నేర్చునో పొటమరింపదుపో,
మధురార్ద్రభావ
మొక్కటియు హృదంతరాళమున కమ్మని
విల్లునుపువ్వుటమ్ములె
చ్చట దిగజార్చెనో స్మరుడు,
సాగదుపైదలిపై సరాగమున్....



ఇంతచేసినా గ్రీష్మాన్ని కాదనలేం మరి, మల్లె పువ్వులూ మంచి గంధాలూ మామిడిపళ్లూ, చెరుకుపానకం వట్టి వేళ్లూ, చలివేంద్రలూ అక్కడి తేటమజ్జిగ అందించే ఆ కన్నె పడుచునూ ఎల్లా మరచిపోగలం, చల్లని పెళ్లిపందిళ్లలో ఏరువాకతో ఎదురువచ్చి, వేగిన పొలాలలో చక్కగా తొలకరించివెళ్లే యీ ఋతురాజు కన్నా ఇష్టు డెవరు?

ఎంత వేచిన నీ కన్న ఇష్టు డెవడు
చందనహిమాంబు చర్చలు, కుందకుసుమ
తల్పము లిమాంపసందులు, ద్రాక్షరసము
తాటితోపుల మలుసంజ గోటి పదను
ముంజెలును, లేత కొబ్బరి బొండములును
ఊరి యూరని క్రొత్తావయూరగాయ,
లిక్షుఖండమ్ము లెవరిత్తు, రీవు గాక
సఖుడ నీ రాక శుభలేఖ జగతి కెల్ల

తొలకరితో నెదురై మా
తెలుగురయితు లేరువాక తెరలింపగ మేల్
వల్లనైన వాడ వేగిన
పొలముల బంగారుపంట పొలిరాల్చుదొరా.

# తెలుగు సాహిత్యోద్యమాలు - ప్రబంధోద్యమం

శ్రీ పోలూరి హనుమజ్జానకీరామ శర్మ.

ఏదైనా ఒక గొప్ప ఫలాన్ని సాధించటానికి మనం చేసే ప్రయత్నాన్ని ఉద్యమమని చెపుతుంటాం. ఇలాగే సాహిత్యంలోకూడా ఒక విశేషమైన ప్రయోజనాన్ని సాధించడం కోసం నూతన ప్రయత్నం ఆరంభమైతే దానిని సాహిత్యోద్యమ మంటాం. రాజకీయంగాగాని సాంఘికంగాగాని ఒక కొత్త ఉద్యమం బయలుదేరేటప్పుడు దాన్ని ప్రతిబింబించే సాహిత్యోద్యమం కూడా సాధారణంగా బయలుదేరుతుంటుంది. తెలుగు సాహిత్యంలో ఇటువంటి ఉద్యమాలు నాల్గు బయలుదేరినాయని చెప్పవచ్చు.

పదకొండో శతాబ్దంలో తెలుగు దేశంలో బౌద్ధ జైనాది మతముల ప్రాబల్యం పోయి వైదిక మత పునరుద్ధరణం ఆరంభమైంది. దానికి తగినట్లుగా దేశభాషలలో సారస్వతాన్ని సృష్టించాలనే తలంపుకూడా ప్రబలమైంది. అప్పుడు వైదికధర్మ సర్వస్వమని చెప్పదగిన మహా భారతాన్ని ఆంధ్రులకు అందించటంకోసం రాజరాజు నన్నపార్యుడు ఆరంభించిన అనువాదోద్యమం తెలుగుసాహిత్యోద్యమాల్లో మొదటిది. దీనికి ఫలంగానే భారతము, భాగవతము మొదలైన ఉద్గ్రంథాలనేకం మనకు లభించినవి. నన్నపార్యుని మహాభారత రచన ప్రజానీకమునకై ఉద్దేశింపబడి ప్రసన్నంగానే ఉన్నప్పటికీ దానిలో కొంత సంస్కృత పదబాహుళ్య ముంది. అందువల్ల ఆ రచనా విధానం విద్యావంతులకు మాత్రమే పనికివచ్చేదని, తమ భావాలను ప్రజానీకానికి సులభంగా అందించాలని, దానిమీద తిరుగుబాటుగా శివకవుల దేశి సాహిత్యోద్యమం బయలుదేరింది. ఇది రెండవది. అప్పటికి బసవేశ్వరుని వీరశైవోద్యమం వైదిక మతానికి వ్యతిరేకంగా ప్రబలుతూ ప్రజాసామాన్యాన్ని ఆకర్షిస్తున్నది. ఆ వీర శైవోద్యమాన్ని ప్రతిబింబిస్తూనే తెలుగులో పాల్కురికి సోమనాథుడు మొదలైనవారు దేశి సాహిత్యోద్యమాన్ని పైకితెచ్చారు. దీనికి ఫలంగానే బసవపురాణం, పలనాటివీరచరిత్ర మొదలైన అనేక ద్విపద కావ్యాలే కాకుండా యక్షగానాలు మొదలైనవికూడా ప్రబలినవని చెప్పవచ్చు. ఈ ఉద్యమం ఈనాటికీ గేయ కావ్యరూపంగా, బుఱ్ఱకథల పద్ధతిలో బహుముఖాల వర్ధిల్లుతూనే ఉంది.

సంస్కృత సాహిత్యంలో కన్పించే మహాకావ్య సౌందర్యాన్ని తెలుగులో సృష్టించుకోవాలి అనే తలంపుతో బయలుదేరిన మహోద్యమమే ప్రబంధోద్యమం. ఇది మూడవది. రెడ్డిరాజుల వైభవాన్ని విజయనగర సామ్రాజ్య ప్రాభవాన్ని ఈ ఉద్యమం ప్రతిబింబించిందని చెప్పవచ్చు. ఇక పాశ్చాత్య సంపర్కంవల్ల కలిగిన భావసంచలనాన్ని ప్రతిబింబిస్తూ బయలుదేరిన నవ్య సాహిత్యోద్యమం నాల్గోది. ఈవిధంగా ఈ సాహిత్యోద్యమాలకు అప్పటి రాజకీయ సాంఘిక పరిణామాలు విప్లవాలు హేతువులుగా ఉండి వానికి విశిష్టతను కలిగిస్తున్నాయని చెప్పవచ్చు.

ప్రబంధ శబ్దం సంస్కృతిలో ప్రసిద్ధమైనదే. సాధారణంగా నియమబద్ధంగా ఉండే ప్రతి సాహిత్య రచనమును ప్రబంధంగానే చెప్పవచ్చు. ప్రథితయశసాం అని మాళవికాగ్ని మిత్రంలో

మొదలుగాగల ఆంధ్ర ప్రబంధ ప్రక్రియ సమగ్రంగా కన్పిస్తుంది. వీటిలో షష్ఠ్యంతములుతప్ప తక్కిన కృత్యాది విధానము, ఆశ్వాసాద్యంతరచన నన్నపార్యుని భారతారంభమునందే వుంది. కాని యిట్టి కృత్యాది ప్రక్రియ శ్రీహర్ష నైషధంలో లేదు. అసలు సంస్కృత మహాకావ్యాలలోనే యిది అంతగా కన్పించదు. కుమార సంభవాది కావ్యాలు సాధారణంగా కథతోనే ఆరంభింపబడ్డవి. తెలుగు కవులు మాత్రం నన్నయాదుల పద్ధతిని విడిచిపెట్టకుండా ప్రబంధ రచనలో కూడా దానినే అవలంబిస్తూ వచ్చారు. అలాగే నిర్వచన కావ్యాలకు మారుగా చంపూకావ్యాలనే రచించారు. తిక్కన్న ఒక్కడు సంస్కృత కావ్యపద్ధతిలోనే ఉత్తర రామాయణాన్ని నిర్వచన కావ్యంగా తయారుచేసినప్పటికి ఆయన కూడా తరువాత భారత రచనలో చంపూ మార్గాన్నే అవలంబించాడు. అందువల్ల తక్కిన కవులంతా ఆ మార్గాన్నే అవలంబించారు. మరల ప్రబంధ కర్తలలో ఎవరూ నిర్వచన కావ్య రచనకై చెప్పదగిన ప్రయత్నం చెయ్యలేదు. అందువల్ల విశేషమైన కృత్యాది ప్రస్తావనలతో చంపూ కావ్యాత్మకమైన తెలుగువారి ప్రబంధం సంస్కృత మహాకావ్యాలకన్నా ఒక విశిష్టమైన నిర్మాణంగా కన్పిస్తుంది.

ఇంతవరకు వచ్చిన ఉత్తర రామాయణం నృసింహపురాణం ఉత్తర హరివంశం నైషధం మొదలైనవన్నీ చాలావరకు అనువాదాలుగానే ఉన్నవి. వీటిలో స్వతంత్ర కథాకల్పనము లంతగా కన్పించవు. పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు శృంగార శాకుంతలంలో స్వతంత్ర కల్పనలు చేయడానికి ప్రయత్నించాడు. ప్రసిద్ధంగా కాళిదాసుని శాకుంతల నాటక మున్నప్పటికీ దాన్ని అనువదించ బూనుకోలేదు. భారత కథను, నాటక కథను యథేచ్ఛగా వాడుకుంటూ స్వతంత్రకల్పనలతో శృంగార శాకుంతలాన్ని ఒక విశిష్టమైన మహాకావ్యంగా నిర్మించడానికి ప్రయత్నించాడు. ఇట్టి ప్రయత్నానికి ఇతడే ఆద్యుడని చెప్పటానికి వీల్లేదు. ఇట్టి ప్రయత్నం నన్నెచోడుని కుమార సంభవంలోకూడా కన్పిస్తుంది. అదికూడా అనువాదంకాదు. ఇక బసవపురాణం పండితారాధ్య చరిత్ర మొనరైనవి స్వతంత్ర గ్రంథాలైనప్పటికి వానియందు పురాణత్వ మున్నంతగా మహాకావ్యత్వం కన్పించటంలేదు. అందువల్లనే అవి ప్రబంధ వాఙ్మయంలో పేర్కొనబడటంలేదు. ఏమైనప్పటికీ పినవీరభద్రుని తరువాతనే స్వతంత్ర కల్పనాత్మకమైన ప్రబంధ పద్ధతి ప్రాబల్యాన్ని పొందింది.

శ్రీకృష్ణదేవరాయల కాలంలో పైన పేర్కొన్న స్వాతంత్ర్యం బహుముఖాల విలసిల్లింది. మార్కండేయ పురాణంలో ఉపాఖ్యాన మాత్రంగా ఉన్న స్వారోచిషమనుసంభవకథను పెద్దనార్యుడు స్వీకరించి స్వతంత్ర కల్పనలతో వర్ణనలతో పెంచి మహాకావ్యంగా నిర్మించాడు. దీనిలో అనువాద పద్ధతి పూర్తిగా లోపించటం గమనింపదగిన విశేషం. అంటే ఇప్పటికి ప్రబంధ రచనా విధానం పరిణమించి సమగ్రస్థితికి వచ్చిందన్నమాట. అందువల్లనే తరువాతవారందరు మనుచరిత్రనే మహాప్రబంధ రచనకు ఒరవడిగా స్వీకరిస్తూ వచ్చినట్లు కన్పడుతుంది. ఆకాలంలో పుట్టిన ఆముక్తమాల్యద పారిజాతాపహరణం మొదలైన ప్రబంధా లన్నింటిలోను ఈ స్వాతంత్ర్యం విస్పష్టంగా కన్పిస్తుంది. కాని యీ స్వాతంత్ర్యం విస్పష్టంగా అంతటితో ఆగలేదు. ఉపాఖ్యానమాత్రంగానైనా మూలము లేకుండా కథనంతా సృష్టించటం కళాపూర్ణోదయంలో పింగళి సూరనార్యుడు సాధించాడు. కాని ప్రబంధాలలో ప్రసిద్ధములైన కథలు రుచించినట్లుగా కల్పిత కథలు మనస్సుకు పట్టవు. అందువల్లనే తరువాత కవులు సాధారణంగా

మొదలుగాగల ఆంధ్ర ప్రబంధ ప్రక్రియ సమగ్రంగా కన్పిస్తుంది. వీటిలో షష్ఠ్యంతములుతప్ప తక్కిన కృత్యాది విధానము, ఆశ్వాసాద్యంతరచన నన్నపార్యుని భారతారంభమునందే వుంది. కాని యిట్టి కృత్యాది ప్రక్రియ శ్రీహర్ష నైషధంలో లేదు. అసలు సంస్కృత మహాకావ్యాలలోనే యిది అంతగా కన్పించదు. కుమార సంభవాది కావ్యాలు సాధారణంగా కథతోనే ఆరంభింపబడ్డవి. తెలుగు కవులు మాత్రం నన్నయాదుల పద్ధతిని విడిచిపెట్టకుండా ప్రబంధ రచనలో కూడా దానినే అవలంబిస్తూ వచ్చారు. అలాగే నిర్వచన కావ్యాలకు మారుగా చంపూకావ్యాలనే రచించారు. తిక్కన్న ఒక్కడు సంస్కృత కావ్యపద్ధతిలోనే ఉత్తర రామాయణాన్ని నిర్వచన కావ్యంగా తయారుచేసినప్పటికి ఆయన కూడా తరువాత భారత రచనలో చంపూ మార్గాన్నే అవలంబించాడు. అందువల్ల తక్కిన కవులంతా ఆ మార్గాన్నే అవలంబించారు. మరల ప్రబంధ కర్తలలో ఎవరూ నిర్వచన కావ్య రచనకై చెప్పదగిన ప్రయత్నం చెయ్యలేదు. అందువల్ల విశేషమైన కృత్యాది ప్రస్తావనలతో చంపూ కావ్యాత్మకమైన తెలుగువారి ప్రబంధం సంస్కృత మహాకావ్యాలకన్నా ఒక విశిష్టమైన నిర్మాణంగా కన్పిస్తుంది.

ఇంతవరకు వచ్చిన ఉత్తర రామాయణం నృసింహపురాణం ఉత్తర హరివంశం నైషధం మొదలైనవన్నీ చాలావరకు అనువాదాలుగానే ఉన్నవి. వీటిలో స్వతంత్ర కథాకల్పనము లంతగా కన్పించవు. పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు శృంగార శాకుంతలంలో స్వతంత్ర కల్పనలు చేయడానికి ప్రయత్నించాడు. ప్రసిద్ధంగా కాళిదాసుని శాకుంతల నాటక మున్నప్పటికీ దాన్ని అనువదించ బూనుకోలేదు. భారత కథను, నాటక కథను యథేచ్ఛగా వాడుకుంటూ స్వతంత్రకల్పనలతో శృంగార శాకుంతలాన్ని ఒక విశిష్టమైన మహాకావ్యంగా నిర్మించడానికి ప్రయత్నించాడు. ఇట్టి ప్రయత్నానికి ఇతడే ఆద్యుడని చెప్పటానికి వీల్లేదు. ఇట్టి ప్రయత్నం నన్నెచోడుని కుమార సంభవంలోకూడా కన్పిస్తుంది. అదికూడా అనువాదంకాదు. ఇక బసవపురాణం పండితారాధ్య చరిత్ర మొదలైనవి స్వతంత్ర గ్రంథాలైనప్పటికి వానియందు పురాణత్వ మున్నంతగా మహాకావ్యత్వం కన్పించటంలేదు. అందువల్లనే అవి ప్రబంధ వాఙ్మయంలో పేర్కొనబడటంలేదు. ఏమైనప్పటికీ పినవీరభద్రుని తరువాతనే స్వతంత్ర కల్పనాత్మకమైన ప్రబంధ పద్ధతి ప్రాబల్యాన్ని పొందింది.

శ్రీకృష్ణదేవరాయల కాలంలో పైన పేర్కొన్న స్వాతంత్ర్యం బహుముఖాల విలసిల్లింది. మార్కండేయ పురాణంలో ఉపాఖ్యాన మాత్రంగా ఉన్న స్వారోచిషమనుసంభవకథను పెద్దనార్యుడు స్వీకరించి స్వతంత్ర కల్పనలతో వర్ణనలతో పెంచి మహాకావ్యంగా నిర్మించాడు. దీనిలో అనువాద పద్ధతి పూర్తిగా లోపించటం గమనింపదగిన విశేషం. అంటే ఇప్పటికి ప్రబంధ రచనా విధానం పరిణమించి సమగ్రస్థితికి వచ్చిందన్నమాట. అందువల్లనే తరువాతవారందరు మనుచరిత్రనే మహాప్రబంధ రచనకు ఒరవడిగా స్వీకరిస్తూ వచ్చినట్లు కన్పడుతుంది. ఆకాలంలో పుట్టిన ఆముక్తమాల్యద పారిజాతాపహరణం మొదలైన ప్రబంధా లన్నింటిలోను ఈ స్వాతంత్ర్యం విస్పష్టంగా కన్పిస్తుంది. కాని యీ స్వాతంత్ర్యం విస్పష్టంగా అంతటితో ఆగలేదు. ఉపాఖ్యానమాత్రంగానైనా మూలము లేకుండా కథనంతా సృష్టించటం కళాపూర్ణోదయంలో పింగళి సూరనార్యుడు సాధించాడు. కాని ప్రబంధాలలో ప్రసిద్ధములైన కథలు రుచించినట్లుగా కల్పిత కథలు మనస్సుకు పట్టవు. అందువల్లనే తరువాత కవులు సాధారణంగా

# ‘పసిగుండె’

శ్రీ మెట్టా వెంకటేశ్వర రావు.

శ్రీరామ్మూర్తీ జగ్గయ్యా చిన్నప్పట్నుంచీ స్నేహితులు. గోలీకాయ లాడుకునే రోజుల్లో కూడా తాము గెల్చుకున్నవి ఒక సంచీలో పోసుకుని వాటిని కొనీలకు అర్థణాలకీ అమ్మి వచ్చిన డబ్బులతో ఏమైనా కొనుక్కొని చెరి కాస్తా తినేవాళ్లు. జగ్గయ్య తండ్రి రెండెకరాల ఆసామి. ఏదో వెళ్ళదోస్తున్నాడు కాలాన్ని. మూర్తి తండ్రి నిత్య భోగి. పిత్రార్జితమైన నూరెకరాల పొలమూ సెంటు మిగలకుండా అనుభవించి గతించాడు. పాపం మూర్తి ఇప్పుడు ఊళ్ళో వాళ్ళ ఔదార్యంతో చదువుతున్నాడు.

జగ్గయ్యా మూర్తీ కలిసి ఫోర్తుఫారందాకా పొరుగూరి హైస్కూల్లో చదివేరు. పుస్తకాలకి కావాలని తండ్రి నడిగీ, తల్లిని బ్రతిమాలీ లేక పోతే తిరుగమూత పెట్టెల్లోవి సంగ్రహించీ, అదీ చాలకపోతే చాటుగా కోమటింటికి బియ్యంపోసీ మొత్తాని కెలాగో సంపాదించి మూర్తికొక్కవల సిన పుస్తకాలూ జగ్గయ్యే కొనేవాడు. నోట్సులు మూర్తే వ్రాసేవాడు. ఇద్దరూ కలిసే చదువు కునేవాళ్ళు రాత్రిళ్లు మూర్తి ఇంట్లో. మూర్తి చదువుతూంటే తాను పడుకుని వింటూండే వాడు. మధ్యలో తెలియకుండా నిద్రపోయే వాడు. ఎలాగో థర్డ్‌ఫారందాకా నెట్టేశాడు మూర్తి ధర్మమా అంటూ. ఆపై చేతకాలేదు. ఫోర్తుఫారం తప్పితే తండ్రి చావగొట్టేడు. ఇక చెప్పించనన్నాడు. అసలు చదవనే చదవ నన్నాడు తాను. పొలం పనుల్లో ప్రవేశించాడు. అయితే యీ మార్పువల్ల వాళ్ళ స్నేహం వీస పాలుకూడా తగ్గలేదు. కాకపోతే కలిసివుండే కాలం తగ్గింది. ఆవార స్నేహం వెనుకటికంటే దృఢతరమైంది.

రేపే ఆఖరు రోజు మూర్తి ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్షు ఫీజు కట్టడానికి. మూర్తి తల్లి యెన్ని చోట్లనో ప్రయత్నించింది. ఎంత ప్రయత్నించినా పదికన్నా దొరకలేదు. సాయంత్రం బడి నుంచి రాగానే తల్లి యీ సంగతి చెప్పింది. పాపం మూర్తి దిగాలు పడ్డాడు. ఈ గండం గట్టెక్కి యీ క్లాసుకాస్తా పూర్తయితే ఎక్క డైనా పదిరూపాయలు తెచ్చుకోవచ్చు. యీ ఆలోచనలతో మునిగి తేల్తూండగానే మామూలు ప్రకారం జగ్గయ్య వచ్చాడు. ఎందుకంత దిగు లుగావున్నావన్నాడు...అబ్బే ఏమీ లేదన్నాడు. వ్యవహారం ఒట్లదాకా వచ్చేటప్పటికి చెప్పక తప్పలేదు. ఓస్ ఇంతేగదా నేను చూస్తాలే నువ్వు మెదలకుండా చదువుకోమని చెప్పి వెళ్ళి పోయాడు. అయిదు రూపాయలు...ఒకటీ అరా గాదు. అమ్మని పీడిస్తే మహాయిస్తే అర్థ రూపాయి దొరికేను, అసలు మూర్తి పొరపాటు చేశాడు. ఒక నెల ముందుగా చెప్పినట్లయితే యీపాటికి కూడబెట్టేపని. సరే గతంనాస్తి. ఎలా ఇప్పుడుమరి...ఆలోచించగా ఆలోచించగా మెఱుపుతీగలాగా ఒక ఉపాయం తట్టింది. చకా చకా గొడ్లదగ్గర పని ముగించుకుని పెందరాడే భోజనం కానిచ్చాడు. రాత్రి ఎనిమిదైంది. తల్లి వంటింట్లో తండ్రికి వడ్డిస్తున్నది. మిగతా పిల్ల

అంతా నిద్రపోతున్నారు. మెల్లిగా గుడ్డలపెట్టె దగ్గర కెళ్ళాడు. చప్పుడుగాకుండా తెరిచేడు. తల్లి ఒక్కగాను ఒక్కసారే కట్టుకుని మళ్ళీ చెక్కు చెదరకుండా పెట్టిన చీర తీసి చొక్కా లోపలగా చంకలో పెట్టుకుని పైన తుండుగుడ్డ కప్పుకుని యెకా యెకి యానాది భాగోతందగ్గర కెళ్లాడు. భాగోతం అయిందాకా కూర్చుని అందర్నీ పోనిచ్చి ఎవ్వరూలేకుండా చూసి మెల్లిగా భాగవతుల్లో నాయకురాలి దగ్గరకువెళ్లి సాయంకాలం చీరెలబేరం చేస్తుంటివే ఇదిగో కొత్తచీర కొంటావా...అని చేతి కందించాడు చీరని. అది తీసుకుంటూనే నువ్వెవరివి అన్నది నాయకురాలు. గుండెలు గుబుక్కుమన్నాయ్ తటపటాయించుకుని మా దీ వూరు కాదులే అన్నాడు. ఇక భయమెందుకు ఎంత కిస్తావంది. ఒక్కటేమాట అయిదు రూపాయిలు. రెండు రూపాయలిస్తా. దమ్మిడీ తక్కువయినా ఇవ్వను. లాభంలేదు కొత్తచీరే పదిహేను రూపాయలైనా అవుతుంది. సరే అని చెంగు ముడి విప్పి ఐదురూపాయలనోటు అతని చేతిలో పెట్టింది. నాలుగైదుసార్లు వెన్నెట్లో నోటు పరామర్శించుకొని జాగ్రత్తగా లాగూజేబులో పెట్టుకుని యింటికి చేరాడు. ఆ రాత్రి ఎలా గడిచిందో ఆ భగవంతుడికే తెలియాలి. జాగరణ చేశాడన్నా అతిశయోక్తి లేదు. అంతా నిద్ర పోతున్నారు. మంచాల మీద ఖాళీలేదు. న్యాయమైతే వుండాలి. అయిదేళ్ళ చెల్లెలు నాన్నదగ్గర పడుకుంటుంది. తనూ, ఏడేళ్ళ తమ్ముడూ ఒక మంచంమీద. కాని ఇవాళ నాన్న ఒక్కడూ ఒక మంచంమీద పండుకోగా చెల్లెలు తమ్ముడుదగ్గర చేరింది. నాన్నపక్కలో పడుకుంటే అమ్మో...పోనీ చెల్లిని నాన్నదగ్గరికి చేరిస్తే...ఒద్దులే...ఇవాల్టికి ఒంటరిగా పడుకోవటమే మంచిది. స్వంత తమ్ముడైతే మాత్రమేం? డబ్బు విషయంలో నమ్మరాదు. చాప పరచుకుని తుండుగుడ్డ కప్పుకొన్నాడు. ఎందుకనో ఎన్నడూ లేంది ఇవాళ దొంగలొస్తారేమోనని భయంగా వుంది. తన దగ్గర పైకముందాయె మరి. అయినా అసలు యీ దొంగతన మేమిటి? ఒకడి డబ్బు ఇంకొకడు కాజెయ్యటం ఎంత తప్పుపని. అసలు దొంగతనం చేసినవాడికి ఉరిశిక్ష వేయాలి. ఒక్కడికివేస్తే మళ్ళీ రెండోవాడు చేస్తాడా. నిద్ర పట్టటంలేదు. అయినా ఇంకా తెల్లవారిచావదేం? ఈ ఆలోచనలతో మెళుకువా నిద్రాగానిస్థితిలో వుండగానే తల్లివచ్చి తనను లేపి గొడ్లకి కుడితి పొయ్యమని చెప్పి వంటింట్లోకి వెళ్ళిపోయింది అంట్లపని చూసుకోవటానికి. లాగుజేబులో వున్న కుడిచేతి గుప్పెట్లో వున్న నోటును ఎందుకైనా మంచిదని ఎడంచేత్తో కూడా ఒక్కసారి చూసుకున్నాడు. వుంది. లేచాడు. రెండు నిమిషాల్లో గొడ్లకు కుడితిపోసి పాలు తీసేసి సరాసరి మూర్తి ఇంటికి వెళ్లాడు. ఇంత పెందరాడి వచ్చావేంరోయ్ అన్నాడతను పుస్తకంమూసి లాంతరార్పుతూ. అయితే ఇప్పుడు తనకంత చిన్న ప్రశ్నలకి సమాధానం చెప్పే అవకాశంలేదు. కట్టకివెల్దాం తొందరగా కానిమ్మన్నాడు. బయల్దేరి వెళ్లేరు. మామూలు దూరం వెళ్లినా ఇంకా జగ్గయ్య ఆగకపోతే ఇంకా పైకెందుకురా...అన్నాడు మూర్తి, కాదులే రమ్మన్నాడు. అరమైలు దూరం వెళ్లినతర్వాత ఆగేడు. నాలుగువైపులా పారజూసాడు. మనిషన్నవాడు తగల్లేదు. జేబులో నోటుతీసి పది దొరికినయ్యన్నావుగా దీంతో కలిపి ఫీజుకట్టెయ్. మరోమాట నేనిచ్చానని మీ అమ్మకికూడా చెప్పొద్దు. స్కూల్లో మేష్టరుదగ్గర అప్పుతీసుకుని కట్టేస్తాననిచెప్పు. స్కూలుకి కొంచెం పెందరాడే బయలుదేరి వెళ్ళు. అని హెచ్చరికలుచేసి మూర్తిని ముందు వెళ్ళమని తర్వాత తాను బయలు

రాలేదుగదా అని. అందరితో పాటు తాను కూడా నాయకురాలి రాకకు సంతోషాన్ని ప్రకటిస్తూ యీలలూ చప్పట్లూ చరిచాడు. ఆ రంగంలో అద్భుతంగా నటించింది. నాయకురాలు. ఆ నటనకు ముగ్ధుడైపోయి చేరెడు మల్లిపూలు చల్లేడొక రసికుడు. ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ తెరలోపలికి వెళ్ళి పోయింది. రెండో రంగం పావురాలాట. జగ్గయ్య ఒన్స్ మోర్‌లతో అదీ బాగానే నడిచింది. అసలురంగం మూడోది. చిత్రాంగి సారంగధరులది. అసలు నాటకానికి ఆయువుపట్టు ఇదే. ఎప్పుడువస్తారా రంగంమీదకని అందరూ అత్యాసక్తితో ఎగురు చూస్తున్నారు. కొందరు యీలలూ చప్పట్లూ మ్రోగిస్తున్నారు. జగ్గయ్య వుండబట్టలేక తొందరగా రావాలి అని కేకపెడుతున్నాడు.

మామూలుగా అయితే ఏనాది నాటకాలలో రంగం వెంటనే రంగం ఆరంభిస్తారు. ఇప్పుడీ ఆలస్యానికి కారణం ఇందాకటి మల్లెపూల రసికుడు. ఈ రంగంలో అతన్నింకొస్త రెచ్చగొడితే ఒక నాటకం ఆడిస్తాడు. అందుకని పూర్తిగా ముస్తాబు చేసుకుంటున్నది నాయకురాలు. అద్భుతంగా తయారయి అతి వయ్యారంగా ప్రవేశించింది. ఇంకేముంది? జగ్గయ్య గుండె ఝల్లుమంది. కట్టనే కట్టింది తా నమ్మిన చీర. దీని మొహం తగలెయ్య దీని కింతలో చీర మార్చాల్సిన అవసర మేమొచ్చింది, దీని అవతారానికితోడు కోర్టు కోర్టుకీ చీర మార్చి రావాలాయేం? మొన్న సావిత్రి నాటకంఅంతా ఒకచీరతోనే ఆడిచచ్చిందిగా...కొంపతీసిందే. అయినా ఆ చీర ఈడుళ్ళో కట్టద్దని చెప్పాల్సింది. అట్లా చెప్పితే అసలు కొనదని చెప్పలేదు. అంతమాత్రం ఆలోచన తట్టక కాదు... పైగా అమ్మకూడా వచ్చిందిగదా...అని ఆడవాళ్ల వైపుకు తిరగ్గానే తమ్ముణ్ణి పిన్ని చేతికిచ్చి అమ్మ ఇంటికెళ్తున్నది. ఇంకేమున్నది. కాళ్లు చల్లబడుతున్నయ్. అమ్మ వెళ్లేవైపు చూట్టానికి లేస్తుంటే కూర్చో కూర్చో అని వెనకవాళ్లు కేకలేస్తున్నారు. ఇప్పుడేం చెయ్యాలి...అమ్మ వెళ్ళి నాన్నతో తప్పకుండా చెబుతుంది. నాన్న చావబాదుతాడు. ఏమీ ఆలోచన పోవటంలేదు. ఒళ్ళు ముచ్చెమటలు పోస్తున్నయ్. ఇప్పుడేమిటి గతి? ఒక్కటే... వెంటనే ఇక్కణ్ణుంచి పారిపోవటం. లేకపోతే తండ్రి కొట్టటం సంగతి అలా వుంచి అసలు ప్రమాదం సంభవిస్తుంది. తన్ను ఎదుటపెట్టుకుని నాయకురాల్ని అడక్కమానడు. అమ్మిన సంగతి తేలిపోతుంది. అప్పుడు డబ్బేంజేశావన్న ప్రశ్న వస్తుంది. ఏం జెప్పాలి? మూర్తి కిచ్చిన సంగతి ఏమాత్రం బైటపడ్డా అతనెంత బాధకి గురికావాల్సొస్తుందో. అసలే పరీక్షలకని ఎంతో జాగ్రత్తగా చదువుతున్నాడు. ఇది ఇలా జరిగిందో అతను బాధతో సరిగా చదవలేడు. ఎవర్నిగురించి తా నీ అపరాధం లాంటిది చేశాడో అతన్నిగురించే యిప్పుడు పారిపోవాలి. ఆలోచన తట్టటమేమిటి బయలుదేరటమేమిటి ఎంత దూరం నడిచాడో ఆరాత్రి.

సరిగ్గా నెలరోజులకి తిరిగి వచ్చాడు. తా నమ్మిన చీరలాంటి చీరే తీసుకునిరావటం రావటమే అమ్మ కాళ్లమీద పడ్డాడు. కడుపుచిచ్చు అనుభవిస్తూన్న ఆ తల్లి ఒక్కసారిగా ఆతన్ని చూడంగానే ఆనందంతో అవశురాలై అస్పష్టంగా ఏదో అనబోతుండగా ... ఒక్కసారి మూర్తిని చూశొస్తానుండమ్మా అని ధ్వనించింది ఆ పసిగుండె.

అంతలో పోబోయే జగ్గయ్యకు తండ్రి ఎదురై రెక్క పట్టుకున్నాడు. జగ్గయ్యకు పైప్రాణాలు పైనే పోయినై. కొడుకు చేసిన దౌర్భాగ్యపు పనీ భార్య తనమీద వేసిన అపవాదు రెండూ ఏకంకాగా ఒక్కటే దెబ్బ కొట్టేడు చెంపమీద.

'అమ్మా'అని గింగిరాలు తిరుగుతూ పదిగజాల దూరాన పడ్డాడు పోయి. అమ్మో నా బిడ్డ అని పరుగెత్తుకుంటూ వెళ్ళి లేవదీసి అక్కున అదుముకుంది తల్లి. వేలెడు లేదు వీడి జన్మ తగలెయ్యా ఇట్టాంటిబుద్ధులు పుడుతున్నయ్యా అని చేతుల్లో వాణ్ణి ఇవతలకి లాగి పెడీపెడీ గుద్దుతున్నాడు తండ్రి. అయ్యో చచ్చిపోతాడండీ అని అడ్డంపోతున్నది తల్లి. అసలు చెప్పినందుకు తన్ను తానే నిందించుకుంటూ. ఛస్తే యేం ఇట్టాంటి వాడు అట్టాంటివాడు గకరకాల తిట్లూ తిడుతూ అలుపొచ్చినదాకా బాదేడు.

దెబ్బలు తగిలినచోట్లు మంచానికి ఒత్తుకుని నొప్పి పుడుతున్నది. పరీక్షఫీజు కడుతూ మూర్తి కళ్ళల్లో మెదిలాడు. శరీరం బాధపడుతున్నా ఆ పసిగుండె మాత్రం అమృత తుల్యమైన ఆనందాన్ని పొందుతూనేవుంది. తల్లీ దండ్రీ తనమీద అపోహ పడ్డారు. ఇదీ ఒక మేలుగానేవుంది. దెబ్బల మైకాన ఒళ్లు తెలియక నిద్రపోయింది ఆ పసిగుండె.



# కామేశ్వరి కొలుపు పాట

## (ప్రాచీన రచన)

శివ శివా దేవరా శివ నంది నెక్కి
తెలియంగా దేవరా శివనంది నెక్కి
పార్వతితో పాలకొలనికి చేరి
వాల వాల వాల వాల లాడంగ
॥ మన మాడు పాలకొలను ॥

ముత్యంపు కొలనాయె ఆ పాలకొలను
ముత్యంపు చాయలదె కొలని వుదకమ్మ
వజ్రంపు కొలనాయె నా పాలకొలను
వజ్రంపు ఛాయలదె, కొలని ఉదకమ్మ
॥ మన ॥

కస్తూరి కొలనాయె నా పాలకొలను
కస్తూరి ఛాయలదె కొలని వుదకమ్మ
నీలంపు కొలనాయె నా పాలకొలను
నీలాల ఛాయలదె కొలని వుదకమ్మ ॥మన॥

గంధంపు కొలనాయె నా పాలకొలను
గంధంపు ఛాయలదె కొలని వుదకమ్మ .
॥ మన మాడు పాలకొలను ॥

వాల వాల వాల వాల లాడంగ
అంతలో దేవికీ దాహంబులాయె
ముంచి ఆరగించె మూడు దోసిళ్లు ॥ మన ॥

ఎంచి ఆరగించె ఏడు దోసిళ్లు
ఏడవ దోసిలి నీటితో కలసి
గౌరి గర్భామందు శ్రీలక్ష్మి చేరె ..
॥ మన మాడు పాలకొలను ॥

పొడవైన మెరుగులప్రోవు చందమున
చిరుతొడల బుట్టిందె చిరువేణియనగ
పెందొడల బుట్టిందె పేర్వేణి యనగ
శిరమున జనియించె శివరాణి యనగ ॥మన॥

కొప్పున జనియించె కొండవాణనగ
మొగమున జనియించె ముద్దరాలనగ
స్తనముల జనియించె జక్కులమ్మనగ ॥మన॥

కన్నెలార్గురకును కడపట బొడమి
చిన్నారి పొన్నారి చెలియలై యపుడు
అన్నిటకనలేని యాకార రేఖ
కన్నుల నుదయించె కామవల్లనగ
ఇటువలె శ్రీలక్ష్మి ఏడ్గురై పుట్టె ॥ మన ॥

శర్వాణి వెరగంది సప్తకన్యకల....

మన మాడు పాలకొలను .



# కామేశ్వరి కొలుపు పాట

## (ప్రాచీన రచన)

శివ శివా దేవరా శివ నంది నెక్కి
తెలియంగా దేవరా శివనంది నెక్కి
పార్వతితో పాలకొలనికి చేరి
వాల వాల వాల వాల లాడంగ
॥ మన మాడు పాలకొలను ॥

ముత్యంపు కొలనాయె ఆ పాలకొలను
ముత్యంపు చాయలదె కొలని వుదకమ్ము
వజ్రంపు కొలనాయె నా పాలకొలను
వజ్రంపు ఛాయలదె, కొలని ఉదకమ్ము
॥ మన ॥

కస్తూరి కొలనాయె నా పాలకొలను
కస్తూరి ఛాయలదె కొలని వుదకమ్ము
నీలంపు కొలనాయె నా పాలకొలను
నీలాల ఛాయలదె కొలని వుదకమ్ము ॥మన॥
గంధంపు కొలనాయె నా పాలకొలను
గంధంపు ఛాయలదె కొలని వుదకమ్ము .
॥ మన మాడు పాలకొలను ॥

వాల వాల వాల వాల లాడంగ
అంతలో దేవికి దాహంబులాయె
ముంచి ఆరగించె మూడు దోసిళ్లు ॥ మన ॥

ఎంచి ఆరగించె ఏఱు దోసిళ్లు
ఏడవ దోసిలి నీటితో కలసి
గౌరి గర్భామందు శ్రీలక్ష్మిచేరె ..
॥ మన మాడు పాలకొలను ॥

పొడవైన మెరుగులప్రోవు చందమున
చిరుతొడల బుట్టిందె చిరువేణియనగ
పెందొడల బుట్టిందె పేర్వేణి యనగ
శిరమున జనియించె శివరాణి యనగ ॥మన॥

కొప్పున జనియించె కొండవాణనగ
మొగమున జనియించె ముద్దరాలనగ
స్తనముల జనియించె జక్కులమ్మనగ ॥మన॥

కన్నెలార్గురకును కడపట బొడమి
చిన్నారి పొన్నారి చెలియలై యపుడు
అన్నిటకనలేని యాకార రేఖ
కన్నుల నుదయించె కామవల్లనగ
ఇటువలె శ్రీలక్ష్మి ఏడ్గురై పుట్టె ॥ మన

శర్వాణి వెరగంది సప్తకన్యకల. ..

మన మాడు పాలకొలను. .



# విస్తరికళ

శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు.

తెల్లవారి లేచింది మొదలు మన మెన్నో పనులు చేస్తూ ఉంటాము. ప్రతి పనీ ఏదో ప్రయోజనం కోరి చేస్తామేకాని అకారణంగా చేయము. కొందరీ పనులను శ్రద్ధాభక్తులతో చేస్తారు. కొందర రరగారగా మొక్కుబడి తీర్చుకొన్నట్లు చేసిపారవేస్తారు. ఎలా చేసినా అది పనియే అనిపించుకొనేమాట నిజమేకాని, కౌశలంతో చేసేపని యోగ మనిపించుకొంటుంది. దానినే కర్మయోగ మంటారు.

చేసే పనిని శ్రద్ధాభక్తులతో కౌశలంతో ఫలపర్యంతము చేయుట అలావుండగా, దానిని అందంగాకూడా చేస్తే అది కళ అనిపించుకొంటుంది. వంట చేయటం, వస్త్రములు నేయడం, ఒళ్లు పట్టడం దగ్గరనుంచి దొంగతనం వరకు ఏ పనినైనా అందంగా చూడముచ్చటగా చేయవచ్చు. ఇటువంటివి 64 కళలు పేర్కొన్నారు పూర్వులు.

మనం చేసే భోజనానికి, నేలకు మధ్య తామరపాకో, అరటాకో పరచుకొని దాంట్లో భోజనం చేస్తాము. ఈ పని తీరగానే ఆ యాకును మడచి పెంటపోగులో పారేస్తాము. ఈమాత్రపు పని కుపయోగించే ఈ విస్తరిని కుట్టడంలోకూడా కొందరు కళాకౌశలం చూపెట్టుతారు. బాదమాకులో మోదుగాకులో మంచివిగా ఏరి తెచ్చి వాటిని ఎగుడు దిగుడు కాకుండా గుండ్రంగా అమర్చి ఈనకర్ర బద్దలను సన్నగా చీల్చుకొని వాటితో ఆ యాకులను అతి సుతారంగా అంటగుట్టుతారు. సూదికుట్టు కంటెకూడా సున్నితంగా ఉండి ముద్దులొలికే ఆ సన్నకుట్టు విస్తరిని చూస్తేనే ప్రాణం లేచివస్తుంది. దానిలో భోజనం చేయడమొక భోగం.

అటువంటి విస్తరి భోజనానికి భాజనంగానూ ఉపయోగిస్తుంది, దానిలో కళా కౌశలమూ ఉంది. ఆ కళలో పనివాని చేతితీరూ, మనసు పొంకమూ గూడ వ్యక్తమవుతవి. మేలిమై మెడతిరగాలి అన్నట్లు ఉపయోగానికి ఉపయోగం అందానికి అందమూ ఉట్టిపడుతుంది కళలందు. ఆ కళావంతుని సంస్కారమూ సౌందర్య బోధము అందు కనిపిస్తవి.

మృచ్ఛకటిక నాటకంలో శర్విలకుడనే దొంగ చారుదత్తుని యింటికి కన్నంవేసి జొరబడి నగలెత్తుకపోతాడు. నగలు పోయినందుకు దుఃఖించవలసిన చారుదత్తుడు ఆ సొరంగపు అందచందాలు చూచి దొంగవాని పనితనాన్ని మెచ్చుకుంటాడు. ఇలా చౌర్యానికి ఉపయోగించుటేకాక, ఇంటివారి మెప్పులకు పాత్రమైన శర్విలకుని సొరంగం కళయై ఊరకుంది. అంటే మన కష్ట నష్టాలను మరపించే ధర్మమేదో కళలో ఉంటుందన్న మాట. తొందర తొందరగా కన్నం ఎలాగో త్రవ్వి లోన జొరబడి ఇంటివారు మేలుకొనక ముందే పని చక్కబెట్టుకుని బయటపడవలసిన దొంగలందరు కళావంతులు కారు. శర్విలకుని వంటి వాళ్ళు తాము చేసేది దొంగతనాని కక్కరకు వచ్చే సొరంగపు త్రవ్వకమే కదా అనుకోక దానిని తీరికగా తీర్చి దిద్దుతారు. దొంగలలో

శర్విలకునివంటి కళావంతు లున్నట్లే సొమ్ము పోగొట్టుకున్న వారిలోగూడా పోయిన సొమ్ము మాట మరచిపోయి దొంగవాని పనితనాన్ని మెచ్చుకొనే చారుదత్తు లుంటారు. శర్విలకుడు కళావంతుడు - చారుదత్తుడు సహృదయుడైన విమర్శకుడూను.

ఇలా సుందరంగా చేసే పనులన్నీ కళలే అయినా వీనిలో సంగీత సాహిత్యముల వంటి కొన్నిటిని లలిత కళలు అంటారు. బాహ్యోపయోగం కంటె అంతర సంస్కారమే వీటి ప్రయోజనం. వీటి పరికరాలుకూడా బహు సున్నితంగా ఉంటాయి. కుండలు చేయటానికి మన్నూ, వస్త్రాల నేతకు నూలూ మొదలైన పరికరాలు స్థూలంగా కనిపిస్తవి. సాహిత్యాని కుపయోగించే శబ్దార్థాలు చెవికి వినబడతవేకాని కంటికి కనిపించవు. ఈ శబ్దాలకు అర్థమైనా ఉంటుంది. సంగీతాని కుపయోగించే స్వరాలకా అర్థంకూడా ఉండదు. రూపాన్ని చూసే కంటికి ఈ కళలలో ప్రసక్తి లేకపోయినా కంటి కగపడే రూపాల కంటె శాశ్వతమైన రూపాలనేకాక సూక్ష్మమైన భావాలనుకూడా యీ కళలు మనస్సులో కల్పిస్తవి. చెవులను కన్నులుగా మార్చే విచిత్ర సృష్టి యిది.

సంజవేళ పోతుపక్షి నెడబాసి విలపించే పెంటి రూపాన్ని ఈ క్రింది మాట లెలా కల్పిస్తున్నవో చూడండి.

ఏ విహంగముగన్న ఎలు గించుచు సారె
కును సైకతమ్ములగూడ దారు
తారి కన్గొని అది తన జోడుగాకున్న
మెడ యెత్తి కలయంగ మింటనరయు
అరసి కన్నీటితో మరలి తామర యెక్కు
... ... ... ... ...
సంజప్రియుబాసి వగ నొక్క చక్రవాకి.

చక్రవాకి రూపాన్ని, చేష్టలనేకాక దాని మనసులో బాధనుకూడా మన కనుల యెదుట నిలబెట్టుతున్నాడు కవీశ్వరుడు. ఇలా భావాలకు గూడా రూపకల్పన చేసే శక్తి యితర కళలలో అంతగా కన్పించదు కాబట్టి యీ కళలు మన మెరిగిన రూపాలకు రసభావాలచే రూపాంతరాలను కల్పిస్తవి.

ఈ విచిత్ర సృష్టిని పరిశీలించి ఆనందించేశక్తి అందరికీ ఉండదు. దీనికిగూడా చారుదత్తునివంటి విమర్శకులు యీ కళా మర్మాన్ని విప్పి చెప్పవలసి వచ్చింది. కళ లన్నింటికి కొన్ని ధర్మాలు వేర్వేరు పరికరాలు ఉంటవి. అలాగే సాహిత్యాని కుండే ధర్మాలను దాని కుపయోగించే పరికరాలను అవి సాధించే ప్రయోజనాలను గూర్చి అలంకార శాస్త్రమనే గ్రంథం పుట్టింది. ఆ శాస్త్ర లక్షణాలనుబట్టి కావ్యములందు అలంకారికులు గుణదోష విచారణచేస్తూ వ్యాఖ్యానిస్తారు. ఆ వ్యాఖ్యాతలనే మన మిప్పుడు విమర్శకులు అంటున్నాం.

కావ్యం శబ్దమయం గనుక శబ్దమే దాని శరీరం. ఆ శబ్దముల అర్థమే కావ్యానికి ప్రాణం. ముందుగా శబ్దాలను విభాగముచేసి ఆమీద వాటికి అర్థం చెప్పి పిమ్మట ఆ శబ్దార్థాల పరస్పర సంబంధాన్ని వివరిస్తారు వ్యాఖ్యాతలు. శబ్దమునందు అర్థమందు దోషము లుంటే తెలియజెప్పుతారు. పిమ్మట తాత్పర్యం చెప్పి కావ్యంలో ఉన్న ముఖ్య భావాన్ని వివరిస్తారు. కావ్యంలో శబ్దములు ఛందోమయంగా ఉంటవిగనుక ఆ ఛందస్స్వరూపాన్ని చెప్పి శబ్దాలకు అర్థాలకు సొంపు గూర్చిన అలంకారాన్ని కూడా తెలుపుతారు.

ఇటీవలి వ్యాఖ్యాతలు కవులు మొదలగు శిల్పుల కాలమును, అప్పటి సంఘస్థితిని రాచరికాన్ని తెలియజెప్పుతూ ఆ దేశ కాలప్రభావము ఆయా కవుల గ్రంథములలో, శిల్పుల శిల్పము

లలో ఎలా ప్రతిఫలిస్తున్నదీకూడా వ్యాఖ్యానిస్తున్నారు. కావ్య వస్తువును, అందలి పాత్రల శీలాదికాన్ని ఔచితినికూడా పరామర్శించుతారు. ఇదీ స్థూలంగా వ్యాఖ్యాన పద్ధతి.

అలాగే గాయకుడొకపాట పాడుతాడు. ఆ పాట ఫలాన రాగంలో, ఫలాన తాళంలో పాడేదనీ, ఆ రాగ తాళ లక్షణా లిటువంటివనీ వివరిస్తే ఆ పాటను వ్యాఖ్యానించి నట్లవుతుంది.

అయితే ఇంతమాత్రంచేత వ్యాఖ్యానంగాని, విమర్శగాని ముగిసినట్లుకాదు. సైంటిస్టు పదార్థములను పరిచ్ఛేదంచేసి తత్వ నిరూపణంచేసినట్లు కావ్యముల అంగ ప్రత్యంగ పరిశీలనచే గుణదోష విచారణ చేసే యీ విమర్శనను కళ అనడానికి వల్లగాదు. కళలు కల్పించిన రసభావ రూపములను పరిచ్ఛిన్నంచేసి చూపేది కళ యెలాగవుతుంది? కళ అనేది సృష్టి కాకపోయినా ప్రతిసృష్టి. ఈ విమర్శ అనేదానిలో సృష్టి లేకపోగా ఉన్నదానిని విడదీసి చూపడం జరుగుతుంది. అయితే యీ విమర్శ వట్టి పనికిమాలినదాఅంటే, కాదు. కావ్యార్థాన్ని గ్రహించుకోవటాని కిది అక్కరకు వచ్చేమాట నిజమే కాని ఇందు రూపకల్పన లేదు గనుక ఇది కళ మాత్రం కాదు. కావ్య హృదయమును చేరే దారి ఇది. మరి యీ విమర్శ కళ ఎప్పుడవుతుందీ అంటారా, మనవి చేస్తాను.

అజంతా గుహా చిత్రాలలో ఒకానొక చిత్రంలో ఆరేండ్ల బాలుడు నిలిచిఉన్నాడు. వాని వెనుక ఒక స్త్రీ నిలిచిఉంది. ఆ బాలుని భుజములపై తన కరతలములుంచి యించుక వంగి ఉన్నదా స్త్రీ మూర్తి. బాలుడు మోడ్పుచేతులతో ముందుకు దూరపుచూపులు చూస్తున్నాడు. వాని చూపులవెంటనే ఆ తల్లి చూపులు గూడా ప్రసరిస్తున్నవి. దీనిని వ్యాఖ్యానించేటప్పుడు బాలుని వయస్సు, ఆ స్త్రీ వయస్సూ చెప్పి వారి శరీర వర్ణమును, సౌకుమార్యమును సూచించే రేఖలనూ వివరించి వారు ధరించిన వస్త్రములను ఆభరణములను వర్ణించి, వారు ఏ భంగిమలో నిలిచి ఉన్నారో తెలిపి వారి నేత్రములు ఆకర్ణాంతములనీ, వారు తల్లీ కొడుకు లనీ వాకిళ్లో నిలుచున్నారని తెలియజెప్పుతాడు. ఆ చిత్రంలో ఉపయోగించిన వర్ణములు, వాని సమ్మేళనమూ కూడా వివరించుతాడనుకోండి. ఈ వ్యాఖ్యానం వల్ల మన యెదుటనున్న రూపమునకు వాచ్యార్థం చెప్పినట్లయింది. అంతేకాని వా రిరువురు అచట ఎందుకు నిలుచున్నారు? వారి చూపులు దేనిని చూస్తున్నవి? అనే ప్రశ్నల కిందులో సమాధానంలేదు. ఈ తల్లి బిడ్డల రూపములచే చిత్రకారుడు మనకేమి చెప్పదలచుకొన్నాడు? వారి చూపులు, వినమ్రమైన వారి శరీర భంగిమ ఏమి ధ్వనింపజేస్తున్నవో మనకు తెలియజెప్పినపుడే విమర్శ కళ అనిపించుకుంటుంది. కేవలం తల్లిని, బిడ్డను మనకు చూపించటంకాదు చిత్రకారుని ఉద్దేశం. ఆ మూర్తులు రెండును భక్తిని వినయమును మనకు పట్టి యిస్తున్నవి. అవి బౌద్ధగాథా చిత్రములు కావటంవల్ల భక్తి మయమైన వారి చూపులలో వినమ్ర శరీరములలో మోడ్పు చేతులలో దవ్వులనుండి భిక్షార్థియై వస్తున్న బుద్ధ భగవానుడు మనకు ప్రత్యక్ష మవుతున్నాడు. అంతట ఆ తల్లి బిడ్డలతో యశోధరా రాహులులు కూడా మనకు దర్శన మిస్తారు. అపుడు వారి మూర్తులు భక్తిభావమునకు కల్పించిన రూపాంతరములై మనకు దర్శన మిస్తవి. ఇలా శిల్పి చేసిన రూపమందు, రూపాంతరాన్ని దర్శించే విమర్శన కళా గౌరవము నందుకొంటుంది.

మరొక ఉదాహరణం మనవిచేస్తాను. ఒక సినీమా చిత్రంలో నాయికా నాయకులు చిర విరహానంతరం, నదీతీరంలో అర్థరాత్రివేళ పండు వెన్నెలలో రహస్యంగా సంకేత స్థలాన కలుసుకొన్నారు. తిరుగా ఇన్నాళ్ళకు కలసికొన్న

నాయికా నాయకు లా సంతోషంలో తమ కష్టాలన్నీ మరచిపోయి ఒకరిపై నొకరు ఒరగి హృదయభారం తీరేటట్లుగా ఏవో ముచ్చట లాడుకొంటున్నారు. నాయికవెంట వచ్చిన చెలికత్తె దూరంగా నిలుచుండి వుంది. అలా సుఖపారవశ్యంతో సల్లాపా లాడుకొంటున్న పడుచు జంటల చిత్రం మరుగైపోయి పిమ్మట చెలికత్తె చిత్రం మనకు కన్పిస్తుంది. ఆ చెలిమికత్తె తటాలున సిగ్గుతో నవ్వుతో మొగ మావలకు త్రిప్పుకొన్నది. అప్పుడా చెలికత్తె రూపమందు చిత్రకారుడు మనకు దేనిని ధ్వనింపచేస్తున్నాడో తెలియజెప్పితే ఆ విమర్శనము కళ యనిపించుకొంటుంది. మన యెదుట మందహాసం చేసి సిగ్గుతో మోము త్రిప్పుకొన్న చెలికత్తె రూపంలో మన యెదుట లేని నాయికానాయకుల సుఖపారవశ్యం మనకు ప్రత్యక్షం చేస్తుంది విమర్శ కళ. ఆ సుఖ పారవశ్యం మన ఎదుట లేదు. సౌఖ్యరస వీచికలలో తూగులాడే నాయికా నాయకులను మనం చూడదగినంతవరకు చూచాము. తరువాత కథను చెలికత్తె ముఖంలో చూడగలిగాము. విమర్శకుని కళా సృష్టి చెలికత్తె రూపానికి రూపాంతరాన్ని కల్పించి చూపింది. అయితే యీ విమర్శకళ స్వతంత్రం కాదనీ కావ్యాది కళలు లేకపోతే దీనికి ఉనికిలేదని కొంద రనవచ్చును. నిజమే కాని ఆ దృష్టితో చూస్తే కావ్యాదులుకూడా స్వతంత్రములు కావు. అవి లోకానికి సౌందర్యపరంగా చేసే వ్యాఖ్యానాల వంటివే లోకమును కళలు వ్యాఖ్యానిస్తే విమర్శ కళ ఇతర కళలను వ్యాఖ్యానిస్తుంది.

అంతేకాదు. సహృదయుడైన వ్యాఖ్యాత లేనినాడు కావ్యాదికళలు తమ సార్థక్యం కోలుపోయి మూగివి, గ్రుడ్డివి అయిపోవచ్చు. ఎందువల్లనంటే కావ్యాది కళలు స్వతఃపూర్ణములు కావు. వ్యాఖ్యానంవల్లనే వాటికి నూత్నశోభా, రామణీయకము లభిస్తవి. అది యెలాగో మనవి చేస్తాను.

ఈ లోకమందు మనం కష్ట సుఖాలను రాగద్వేషాలను పొందుతూఉంటే కవి దీని యందు రసభావాలను దర్శిస్తున్నాడు. అతనిది అతీంద్రియానుభవం కావటంవల్ల ఆ యనుభవాన్ని చెప్పటానికి అతనికి మన మాటలు చాలవు. ఇంద్రియభోగ్యమైన రూపాలను చెప్పుటకు మాత్రమే పుట్టిన శబ్దాలు అతీంద్రియమైన రసమును చెప్పలేవు. మరి యీ శబ్దాలకంటె కవులకు ఇతరోపకరణము లున్నవా అంటే, లేవు. వారు ఏమి చెప్పినా దుర్బలములు, అసమర్థములు అయిన యీ శబ్దాలద్వారానే చెప్పాలి. అందువల్ల వారు యీ శబ్దాలను ఛందోబద్ధంచేసి యమకాదులచే అలంకరిస్తారు. ఇంతచేసినా అవి లౌకికార్థాలనే కాని ఇతరమును చెప్పలేవు. కనుక కవులు తాము దర్శించిన అతిలోక సౌందర్యాన్ని ఉపమలచే, ఉత్ప్రేక్షలచే ధ్వనింపజేస్తారు.

తన యొప్పెదుట గన్న జనుల కెవ్వరికేని మలగి క్రమ్మర జూడవలయువాడు...అంటూ నకులుని సౌందర్యమెట్టిదో మనకు స్పష్టంగా చెప్పలేక, మార్గాంతరం అవలంబించి, ఆ రూపసౌభాగ్యాన్ని మన ఊహకు వదలిపెట్టాడు కవి.

విరటుని అంతఃపురంలో పరిచారికగా ఉన్న ద్రౌపది తన కష్టాలను భీమునితో చెప్పికొంటూ నిత్యం గంధం తీసి, రాణికి నలుగుపెట్టుతూ ఉండడంవల్ల...మున్నటులున్న పాణి తలముల్ బలు కాయలు గాచె చూచితే...అంటుంది. ఆ పాణితలముల పూర్వ సౌకుమార్యమును ఇప్పటి గరకుతనాన్ని యీ మాటలు మన ఊహ కందిస్తున్నవి.

ఇలా ఎన్ని ఉపాయా లవలంబించినా ఇవి యన్నీ ఆ కవుల అనుభవాన్ని ధ్వనింపచేయగలవే కాని శృంగ గ్రాహికగా మన యెదుట నిలువజాలవు.

రూపాంతరముల ద్వారా కవులు తమ సౌందర్య బోధమును మనకు అందించే ప్రయత్నంలో వారు వాడిన శబ్దములు స్ఫటికముల వంటివై తెరచిన కిటికీలు ద్వారములుగా ఉపచరిస్తవి. వ్యావహారికములైన ఈ శబ్దములు సౌందర్యమయమైన కవి భావనలో కరగి క్రొత్త వన్నెలను, రుచులను, వాసనలను అలవరచికొని కవిభావితమైన దివ్యలోకానికి తెరచిన ద్వారము లవుతవి. అలా ద్వారములు, కిటికీలు తెరచిపెట్టుటయే కళలు చేసే పని. కవులు శబ్దముల ఆవరణలను భేదించి వాటికి రెక్కలుగట్టి ఆకాశంలో వదిలితే వాటిని పట్టుకొని వానిపై ఆశీనులమై మనము కవి భావిత దివ్యసీమలకు ఎగురాలి. అంతేకాని కళలు సౌందర్యాన్ని గోరుముద్దలుచేసి మన నోటి కందీయవు. అందీయలేవు...వారు కల్పించిన అతీంద్రియ జగద్వ్యాహారం చేసే శక్తీ, అధికారమూ అందరికి ఉండదు కనుక, మనకు వాఖ్యాతతో అవసరం కలిగింది. వాఖ్యాత కవితో సమానహృదయుడు. కవి మనస్సులో ఏమి ఉందో అతను కల్పించిన శబ్దమయరూపం దేనిని ధ్వనింపచేస్తుందో అతడు పనిపట్టగలడు. అతడు కావ్యపరిశ్రమ అధికంగా చేసినవాడు. లోకానుభవం కలవాడు. సౌందర్య బోధం కలవాడు. కనుక యీ సంస్కార బలం వల్ల విమర్శకుడు మనకు కరావలంబన మిచ్చి కవి కల్పిత సుందరసీమలలోనికి నడిపించుకుపోగలడు. హార్దికజగత్తుకు హద్దులున్నవికాని అతీంద్రియ జగత్తుకు హద్దులులేవు. అసీమమైన అగాధము అయిన ఆ లోకంలో ఎవరి సంస్కారంకొద్దీ వారు విహరించ వచ్చు. సౌందర్యం నిరవధి అయినట్లే మన భావనకూడా నిరవధి. కవి తెరచిపెట్టిన కిటికీ లోనుంచి మందదృష్టులు కొంచెం దూరమే చూస్తారు. తీవ్ర దృష్టు లింకా ఎక్కువదూరం చూడగలరు. ఎంతచూచినా తరగని దాని పర సీమను కవీ చూడలేడు. విమర్శకుడూ చూడ లేడు. కనుకనే రసశబ్దవాచ్యమైన ఆ యానందము అనిర్వచనీయం. సంసార జంజాటంలో చిక్కుకొని వ్యథలపాలై ఈ లోకానికి పాలకడలివంటి ఆ యానందములో కవులు, శిల్పులు, వ్యాఖ్యాతలు ఏ లవలేశమో అందించి యీ బ్రతుకులో నించుకించుక తీపిని చిలకరిస్తున్నారు. వారికి మనం ఎంతైనా రుణపడిఉన్నాం. వారు ధన్యులు. వారి మాపుడుప్రేలు వెంట చూడగలిగితే మనమూ ధన్యుల మవుతాము.



# గ్రీష్మము - ౨

**శ్రీ వావిలాల సోమయాజులు**

ఋతు రాజ్యంలో వసంత మహారాజు పాలన కొంతకాలం సాగినతరువాత గ్రీష్ముడు సర్వ సన్నాహాలూ చేసుకొని దండెత్తి వచ్చాడు. ఆ విషయాన్ని గురించి కవి అంటున్నాడు.

వన్నె చిన్నెలు గుల్కు వనలక్ష్మి హొయసుల
కనుల జూడక మున్నె గడలు కొల్పి,
వాసంత సంసృష్టివరమహత్వము నెల్ల
పదము వెట్టితొ లేదొ చద నొనర్చి,
ఒక్క యుచ్ఛ్వాసాన యుబ్బుగంధానిలు
తావి కల్మల నెల్ల ద్రావివైచి,
కలకు చూపులతోనె చెఱుకు విల్ గలవాని
సీమాంతముల దాక చెలగి తరిమి,

విజయ గర్వాన లోకాల విరుచుకపడి
ఋతుమహావీరుడను పేర నుతికి నెక్క
విఱ్ఱవీగుచు తాపమ్ము వెంట నడువ
తరలి వచ్చితె గ్రీష్మప్రతాపమూర్తి .

దావాగ్ని మిత్రుడై తమిని నీకిచ్చె నా
జీవాళి తపియింపజేయు తీండ్ర
సాగరేశ్వరు గెల్చి సంపాదనము చేసి,
నాడవే బాడబ నాశరక్తి,
అగ్నిహోత్రుని గొల్చి యడిగితే వరముగా
దహియింప లోకాలదాహశక్తి,
త్రిపురారి సేవించి ప్రీతిగైకొంటి వే,
అలిత నేత్రానంద హాస రోచి
లేక లోకాల కేల యీ కాక భయము
తాళ జాలక భవదీయ దారుణోష్ణ
తాప సంతాపమున నిట్లు తారుమారు
పడునె యో గ్రీష్మ, యుర్విని ప్రాణికోటి....

అవదాతాంబుజ బంధువై జగతి
కత్యం తాప్త మిత్రుండు నై
భువి వెల్గొందు ప్రభాకరుండెపుడు,
ఔ పుణ్యాత్ము డాతండు ఈ
పవి కాఠిన్యము దాల్చి వెల్గునె?
కృపాంభోరాశి కాడా యతం
డవు నీ శాసనమేను కారణము
తీవ్రార్చి ష్మంతుడై యుంటకున్....

ఉదయాద్రిపై భాను డుదయించెనో లేదొ
చిత చిత పుట్టించి చెఱుచు పనుల,
నడిమింటి కెక్కెనా నుడివడు కొలిమియై
నారకాగ్నుల నింపు నాల్గు దెసల,
అస్తమించిన చూపు నద్భుత ప్రతిభ తా
పడగ వాయు విలాస వర్తనముల,
తానె రేయెండయై తప్పులై విరుగుచు
యొడలి తైలము లెల్ల నొడుచుకొనును,
నీదు తీవ్రాతప మెచట నేర్చె గ్రీష్మ
దాహకోజ్వల గుప్త విద్యారహస్య
సముదయమ్ములనే గురు సవిధమందు
చిత్ర చిత్రమ్ములగు దాని చేష్ట లరయ....

గ్రీష్మని పాలనలో భూదేవి పడరాని పరాభవాన్ని పొందింది. త్రిలోకాధిపతి యింద్రునితో మొరపెట్టుకుంటూ ఆమె పంపుతున్న జంగమ లేఖల్లా కనిపిస్తున్న వీ సుడిగాలు లంటున్నాడు కవి.

గాఢరాగము కన్న గనులు గుప్పెడి రీతి
        కొమరు మీరవుపో శకుంత తతులు,
ఉప్పొంగి నింగిదా కొయ్యారములు సూపి
        కడలిజేరదు నదీ కాంత ప్రీతి
నూత్న దంపతులేని నోరార ప్రణయంపు
        పలుకు లాడెడి చిన్నె పరలబోదు
భూదేవి దివముతో పొందు తప్పినయట్లు
        విరహమై నిలువెల్ల విహ్వలించు
జగతి కాధారమైన యీసకల రమ్య
రాగ రస మన్న నీకు పరా కదేమొ
నైష్ఠిక బ్రహ్మచారివా? శిష్టులకును
లేవె శృంగార జీవిత లీల గ్రీష్మ....

భూరి నదీ మధ్య పులిన సీమలతోడ
        బలిసె మార్గాంతర ప్రపల సమితి,
పాంథావళీ కంథభార భాగాళితో
        నెండిపోయెను బావు లిండ్ల యందు,
ఘటజల రజ్జు సంఘాతమ్ములకుతోడు
        ధీర్ఘత నొందెను దినము దినము,
చటుల దావానలచ్ఛటలు తోడులు గాగ
        గృహదాహములు హెచ్చి కెరలె నీరు,
ధనికు నిల్లాలి బుజముపై దర్ప మొదవ
తివిరి రోజెల్ల బిందియ తిష్ఠ వేసె,
పొలము పండించి పెట్టిన భుక్తి యన్న
యెడ్ల గర్వమ్ము దిగద్రావె నింటి నీరు...

మధురాయువుల నిచ్చి మనసార గ్రోలించు
        కీర్తికాంక్షను నారికేళమూర్తి,
ఫలదాతయై మైత్రిపాటించి రుచి చూపు
        సన్మిత్రు రీతి రసాల రాజు,



వాసనల్ విరజిమ్మి వరరసానందమ్ము
        తమిని నిల్పెడిని కుంద ప్రసూన
నిలువెల్ల తావులై నిండి వాసించెడి
        బంగారు బొమ్మ సంపంగి కొమ్మ
నీరు నీరాజ్య మందున లేకయున్న
ఘోర బాధల సహియించి కోరి బ్రతుక
తలచునే ప్రాణిలోకాలు ధర్మ లుప్త
బహుళ బాధాభియుక్త దుర్వార రాజ్య...

కవి ప్రసంగాన్నంతటినీ గ్రీష్ముడు విని అర్థయుక్తంగా మోము మీద ఓ చిరునవ్వు చిలకరించాడు. సామాన్య దృష్టితో చూచి నేను కూడా దొడ్డవాణ్ణి నిందిస్తున్నాను గామాలు నన్న భావం కవికి కలిగింది. పునరాలోచన చేసి గ్రీష్ముని తాపం లోకాని కవసర మంటున్నాడు.

పాపము లెన్నొ చేసి యెడబాపు కొనన్
                తమి సూక్ష్మ మార్గమౌ
కూప తటాక నిర్మితిని కొంత యొనర్చి
                వనాళి బెంచి సం
ప్రాపిత తృప్తితో మెలగు పాపుల కీ యిల
                దారి యెద్ది నీ
తాపమె లేక్కయున్న అనుతాపము తీరునె
                గ్రీష్మ వారికిన్...

ఇంతలో మల్లె వాసనలు ముంచుకొచ్చి అతణ్ణి ముట్టడించాయి. ఆనందంతో అభినందిస్తున్నాడు గ్రీష్మణ్ణీ, మల్లెలనూ...

పూవుల తావులన్నిటిని పొల్పుగ మల్లెల కిచ్చి
మెచ్చి నీ
దీవన లిచ్చి నిల్పితివి దివ్య మనోహర
పుష్పరాజ్య స
ర్వావని నేలుడంచు సిగలం, మెడలందున,
శయ్యలందు స
ర్వావయపాళి యయ్యెవియె అద్భుతముల్
గదవాని చేష్టలున్.

ప్రణయ విరోధి వని నిందించి నందుకు ప్రతిగా కవి గ్రీష్మణ్ణి నీవు మన్మథ మూర్త్యంత రాని వని ప్రశంసిస్తున్నాడు.

గుహలోన నిజసింహి కుమిలిపోవగనూచు,
కేసరచ్ఛటల మృగేంద్రరాజు
పరితాపమును జూచి బాధ కరేణువు,
పడియెలో బురదనె పైనజిమ్మ,
పగటి యెండకు నాగు బయటికి నేతేర,
చెలగి బొర్రెకులాగు జెట్టిపోతు,
వృంతంబు చేబూని విసరుచు సేవించు
తమి భర్త నేవేళ ధర్మపత్ని.

క్రొత్తక్రొత్తల చేష్టల గుస్తరించు
ప్రాణికోటుల యనురాగ పథములందు
వింత వెల్గుల జూపించి వెలయు నీవు
కేవలము రతి రాజువే గ్రీష్మ రాజ ....

నిన్ను లోకం నిందిస్తున్నదే గాని అందరి పనులూ సాగిపోతూనే ఉన్నవి. గృహస్థులు సుఖ సౌఖ్యాలను అనుభవిస్తూనే ఉన్నారు. నిన్ను నిందిస్తున్నందుకు వారిని క్షమించ వలసిందని కవి గ్రీష్మణ్ణి వేడుకొంటున్నాడు.

ఉక్కయంచును నిన్ను ఒక్కపెట్టుగ తిట్టి
ఆవకాయల మునుగు నత్తగారు,
చెమట చీకాకుతో చెడెపని యనుకొంచు
క్రొత్తరసములు గ్రోలు కొడుకుగారు,
విసుగుచు నెండంచు వేపగంధము తీయు
నాటలో మున్గె నబ్బాయిగారు,
పడదాకు సని ముందు గడపదాటక తానె
కోయుకుందమ్ముల కోడలమ్మ.

ఎవరి పని చెడిపోయెనో ఎరుకపడదు
యిన్ని సుఖముల మరగుచు నిన్ను తిట్టు
వీరి కిచ్చుచు సౌఖ్యాల కోరి నన్ని
కీర్తి వెల్గొంద జేయవే గ్రీష్మరాజ . . .



# శ్రీహర్ష శ్రీనాథుల స్వర్గ సమావేశము

డాక్టర్. కె. వి. ఆర్. నరసింహం, శ్రీ కె. జోగయ్య శర్మ.

శ్రీహ : ఒడలంతా విభూతిరేకలూ, మెడలో రుద్రాక్షతావళమూ, పట్టింజలు మడిచికట్టిన రత్నాంబరమూ, చేతులకు రత్నాల బటువులూ చెవులకు మకరకుండలాలు, శాంత శృంగారాలు మూర్తీభవించినట్లున్న యీ మహానుభావు డెవరో ఇటే వస్తున్నాడు. అడిగిచూద్దాం ఎవరు మహాత్మా మీరు... ?

శ్రీనా : నన్ను శ్రీనాథు డంటారు...

శ్రీహ : సకల విద్యా సనాథులు మీరేనా ? నైషధాంధ్రీకర్తలు.

శ్రీనా : అవును. ఆ భాగ్యం నాకే లభించింది. కాని అంత విడమరచి అడుగుతున్నారు తమ రెవరో... ?

శ్రీహ : నన్ను శ్రీహర్షు డంటారు...

శ్రీనా : నైషధీయ చరిత్ర గ్రంథకర్తలు...

శ్రీహ : అవును...

శ్రీనా : ఆహా నే డెంత సుదినం చింతామణీ మంత్రసిద్ధులు, కాశ్మీర నృప సభా కమలార్కులు, కన్యాకుబ్జ రాజాస్థాన రంగ మంగళాభరణులు, వైతండిక కమల షండ వేదండులు ఖండన కావ్యకారులు, నైషధీయ చరిత రచనా విదగ్ధులు శ్రీహర్షకవి చక్రవర్తులు తమ దర్శన భాగ్యాన్ని ప్రసాదించి నన్ను ధన్యుణ్ణి చేసేరు.

శ్రీహ : మీరు నన్ను అంతగా ప్రస్తుతించడం భావ్యంకాదు. మీరుమాత్రం సామాన్యులా త్రైయ్యంత విద్యావిధులనీ, బహుభాషాకోవిదులనీ, భాష్యాంత వైయాకరణులనీ ఉభయ మీమాంసా పారంగతులనీ, ఆంధ్రకవి సార్వభౌములనీ విన్నాం. విన్నదాది మిమ్మలను దర్శించాలనే కుతూహలాన్ని పొందాం...

శ్రీనా : అదంతా మీ అభిమానం.

శ్రీహ : కేవలం అభిమానంవల్ల ఏం ప్రయోజనం లెండి. మీరు అంతవారు కనుకనే రాజాస్థానములలో విద్యా పరీక్షాధికారులవటమూ, బహుదేశ బుధులతో భాషించటమూ జరిగింది.

శ్రీనా : అదీ ఒక పెద్ద విశేషమే అంటారా ? తత్రాపి తాము కన్యాకుబ్జాధీశ్వరుల నిండు పేరోలగంలో ఆ రాజచంద్రుని చేత తాంబూలద్వయ ఆసనాది గౌరవాలను పొందిన తమ యెదుట చెప్పుకోదగ్గ విశేషమే అంటారా ?

శ్రీహ : కాకేమండీ మీరు అంతటి సకల విద్యా సనాథులు కనుకనే ఉద్దండ పండితుడైన డిండిమభట్టుని శాస్త్రవాదంలో జయించడం, విశిష్య దక్షిణాధీశ్వరుల ముత్యాల శాలలో కనకాభిషేక గౌరవాన్ని పొందడం జరిగింది. అది సాధారణ కవికి జరిగే సన్మానమేనా...?

శ్రీనా : అదంతా మీవంటి పెద్దల ఆశీర్వాద బలమూ, ఆ బ్రాహ్మీదత్త వరప్రసాద బలమూను. అంతేగాని అందులో నా ప్రయోజకత్వమేమీ ఉందనుకోను.

శ్రీహ : నిండుకుండ ఎప్పుడూ తొణకకుండా ఉంటుందిలెండి. ఉభయ భాషలలోనూ నిశితమైన పాండిత్యమూ, ఉభయ మీమాంసల

లోనూ కూలంకషమైన పరిజ్ఞానమూ ఉన్న వారుకాబట్టే ఆంధ్ర కవి ప్రపంచంలో మీకు విశిష్టమైన ఒక ఉన్నత స్థానం లభించింది. ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో మీ పేరుమీదుగా ఒక ఘట్టమే ప్రారంభమైనట్లు విని చాలా సంతోషించేం. నే నెరిగినంతవరకూ తెనుగు కవులలో ఇంతటి విద్యావ్యాసంగాధులు లేరను కుంటాను. కనుక నే విద్వద్దౌషధమైన నా నైషధీయ చరితాన్ని ఆంధ్రీకరింప గలిగేరు. బహుశా మీ కు త ప్ప ఇంకొకరికి ఆ పని సాధ్యం కాదనికూడా నా భావన...

శ్రీనా : ఏదో అదంతా ఆ శారదాంబ కృప. ఆ తల్లి దయవల్ల పండితవాదమూ, గ్రంథ రచనమూ జయప్రదంగానే సాగినవి. రాజాస్థాన గౌరవంకూడ లభించింది. ఇంక మీ నైషధీయ చరితానువాదం సంగతి...ఆ మహా గ్రంథాను వాదంపట్ల చాలా శ్రమే పడవలసి వచ్చింది. ఖండన కావ్య గ్రంథకర్తలైన తమ ముఖతః వెలువడిన జటిల ప్రబంధాన్ని ఆంధ్ర భాషా వధూటి అడుగడుగునా కనిపెట్టి, పలుకు తోడై ప్రసన్నభావం చూపటంవల్ల కొంతలో కొంతగానైనా సరసంగా ఆంధ్రీకరించి కృతార్థుణ్ణయా ననుకుంటున్నాను.

శ్రీహ : కొంతలో కొంతగా ఏమండీ మీ ఆంధ్రీకరణ విధానం ఎంతో సరసంగా ఉంది. నేనూ చాలా భాగం చూచేను. బహు నేర్పుగా అనువాదం సాగించేరు.

శ్రీనా : నా శక్తివంచన లేకుండా సరసంగానే అనువాదం సాగించే ననుకుంటున్నాను. కానైతే నా రచనగూర్చి పండితులలో కొన్ని భేదాభిప్రాయా లున్నట్లు విన్నాను.

శ్రీహ : దానికేమి లెండి భిన్న రుచిర్హి లోకః ఏతావాతా విద్యానేవవిజానాతి విద్వజ్జన పరిశ్రమం, నా దృష్టికిమాత్రం మీఅనువాదం చాలా సరసంగా ఉంది.

శ్రీనా : ధన్యుణ్ణి. పెద్దలూ, బహుశ్రుతులూ, మూలగ్రంథకర్తలూను. మీ ఆమోదమే నాకు పరమ సంతోషదాయకం. నా పరిశ్రమ ఇప్పటికి సఫలమైనదని భావిస్తున్నాను.

శ్రీహ : తథాస్తు. అయితే మీ రచనలో అక్కడక్కడ కొన్ని సందేహాలు...

శ్రీనా : ఉన్నవా? నిస్సంకోచంగా సెలవిప్పించండి. ఓపినంతమట్టుకు సమాధానం చెబుతాను.

శ్రీహ : మంచిది. ఆంధ్రీకరణ విషయంలో మీరు అవలంబించిన విధానాన్నిగూర్చి గ్రంథాంత గద్యలో ఉద్ఘాటించిన పంక్తులు మీకు జ్ఞప్తిలో ఉన్నవనుకుంటాను.

శ్రీనా : బాగా జ్ఞప్తిలో ఉన్నవి. వినిపించమంటారా?

శ్రీహ : అక్కర్లే దక్కర్లేదు. అందులో ఔచిత్యం బాదరించియు, అనౌచిత్యంబు పరిహరించియు, అన్నారే దీన్ని మీ రెలా సమర్థిస్తారా?

శ్రీనా : ఏ సందర్భములోనైనా ఇది మీ కంటబడితే మీ మనస్సు ఏమి నొచ్చుకుంటుందో అని సందేహిస్తూనే యీ పంక్తి వ్రాసేను. అయితే అది మీ కంట పడనూ పడింది అడగవలసిన ప్రశ్నా అడిగేరు. సమాధానం మనవి చేస్తాను చిత్తగించండి. మీ గ్రంథంలో నలుని సౌందర్యానికి త్రిమూర్తుల భార్యలూ శచీదేవీ మరులుకొన్నట్లు పేర్కొన్నారు. జగన్మాతలకు చాపల్యం కలిగినట్లు వర్ణించడం ఉచితం కాదనుకుంటాను.

శ్రీహ : సరే, ఈ ఒక్కటే అలాగే కానివ్వండి. అంతమాత్రానికే అది ఉద్ఘాటించి చెప్పవలసిన విషయమా...?

శ్రీనా : ఇది ఒకటే కాదు, నా దృష్టిలో మరి కొన్ని కూడా ఉన్నవి. తమరు సావధానంగా వింటే చెబుతాను.

శ్రీహ : ఏమిటో అవి సావధానంగానే ఉన్నాను చెప్పండి.

శ్రీనా : నలదౌర్బల్యంలో దూతగా వచ్చిన నలుణ్ణి చూచీ చూడడంతోనే దమయంతి కామించి అతణ్ణుంచి తన దృష్టిని మరల్చుకో లేకపోయినట్లు వర్ణించేరు. అప్పటికి ఆ దూత నలుడని దమయంతికి తెలియదుగదా...అలాంటప్పుడు ఆమె అతణ్ణి కామించినట్లు వర్ణించడం ఉచితం కాదని నా అభిప్రాయం. ఇలాగే హంసని రతిక్లమాలస్తః అని చెప్పి తరువాతి శ్లోకంలో హంసిని నవప్రసూతిర్వ రటా తపస్వినీ అని వర్ణించేరు. యీ రెండూ ఒకే ఘట్టంలో చెప్పడం అంత సరసమైన పద్ధతి కాదనుకుంటాను.

శ్రీహ : యీ సందర్భంలో మీరు చేసిన మార్పు...

శ్రీనా : ఆ వర్ణన మార్చేను...యీ విశేషణాన్ని పరిత్యజించేను...

శ్రీహ : ఏదో కవితావేశంలో నేను ఆవిధంగా వర్ణించి ఉంటాను. యీ విషయాన్ని వర్ణించి ఉంటారనగలనా...సరే మరో విషయం చూద్దాం. సరసీః పరిశీలింతుమయా అన్న శ్లోకానికి మీరు రెండు పద్యాలు రాసినట్లుంది. ఒక పద్యం చాలదా ?

శ్రీనా : కేవలం అందులోని భావాన్నే చెప్పాలంటే ఒక పద్యం చాలు. కాని ఆ పద సంయోజనలోని వైచిత్రిని తేవాలంటే మాత్రం రెండు పద్యాలూ అవసరం.

శ్రీహ : సరే కాని ఇందులో మీరు చేసిన తెలుగేముంది ? ఎవరో అన్నట్టు డుమువులు చేర్చడంతప్ప...

శ్రీనా : మీరూ అలాగనడం భావ్యం కాదు. శబ్ద చమత్కృతికే ప్రాధాన్యమిచ్చే కావ్యంలో ఆ శబ్దాన్ని సర్వత్రా పరిహరిస్తే ఇక మిగిలేదేముంది ? మీ గ్రంథాన్ని పండితమండలి శిరసావహించడానికి కారణం అందులోని శబ్దచమత్కృతి విశేషమేగాని నలుని కథ తెలియక కాదుగదా...

శ్రీహ : అవునండీ, ఏదీమరి యీ శ్లోకాన్ని మీరెలా ఆంధ్రీకరించారో చెప్పండి...

చేతీనలం కామయతే మగీయం
నాన్యత్రికుతాపిచ సాభిలాషం...

శ్రీనా : మీరు కవిత్వం చెప్పింది దేవభాషలో. అందులో పొసగిన శబ్ద చమత్కారాలు కొన్ని తెలుగులో పొసగవు. నలం కామయతే అని న లం కాం అయతే అని, గీర్వాణ భాషలోనే విరవడానికి అవకాశం ఉంటుంది. తెల్గుభాషకు ఆశక్తిలేదు. కాబట్టి అటువంటి శ్లోకాలన్నీ జారవిడిచేను.

శ్రీహ : అయితే పంచనళీయంలోని దేవః పతిర్వి దుషి నైషధ రాజగత్యా అన్న అయిదర్థాలు గల శ్లోకాన్ని కూడా...

శ్రీనా : విడిచిపెట్టాను.

శ్రీహ : పంచనళీయంలో నా యావచ్ఛక్తినీ ధారపోసేను. ఆ ఘట్టంలోని సొగసులు కొన్నైనా తెలుగులోకి తెస్తే బాగుండును. అదలాగుండనీయండి...

శ్రీహ : నేను తం రీజయామః స్మర కేళికాలే అంటే మీరు వీడునాతని వైశాఖ వేళలందు అని అనువాదం చేసేరే. యీ మార్పులో మీ అభిప్రాయము...?

శ్రీనా : స్మరకేళికాలే అన్న మాటలో సవతిపోరు ధ్వనిస్తోంది. అది హంస ఆసించిన కార్యానికి వైరస్యం కలిగించవచ్చునని భావించి ఆ విధంగా మార్చేను.

శ్రీహ: సరే, యీ మార్పుకు సమాధానం సరిపడ్డదికాని, అన్నిటికీ మీకు సమాధానాలు లభించవనే నా నమ్మకం...

శ్రీనా: లభించనప్పుడు నమ్రతతో నా లోపాల్ని అంగీకరిస్తాను. తాము అడగదలచిందేదో అడగండి.

శ్రీహ: దమయంతీ సౌందర్య వర్ణనలో అధరం కిల బింబ నామకం అన్న శ్లోకాన్ని మీరెందు కాంధ్రీకరించలేదో బహు చమత్కారావహమైన ఆ శ్లోకం తమకు నచ్చలేదా?

శ్రీనా: కేవల శబ్ద చమత్కృతి తప్ప అందు విశేషమేమీ నా బుద్ధికి గోచరించలేదు.

శ్రీహ: దాని లోపం?

శ్రీనా: లోప మేమీ లేదుగాని పాండిత్య ప్రకర్ష తప్ప ఆ వర్ణనవల్ల దమయంతీ సౌందర్యం ఏమీ సూచితం కాదు.

శ్రీహ: అయితే కావ్యంలో పాండిత్య ప్రకర్ష ప్రదర్శించడం అనావశ్యక మంటారా?

శ్రీనా: ఎలా అనగలను కాని, అది వర్ణ్యమాన వస్తువునే ఆచ్ఛాదించగూడదుగదా, అదీగాక ఇది ఆంధ్రీకరణం మూలంలోవున్న సాహిత్య ప్రధానములైన వర్ణనలన్నీ అనువదించాలంటే యీ భాషకి బిగువు చాలదు. అలాగని అసలే విడవకుండా వీలూ ఔచిత్యమూ అవసరాలనుబట్టి చాలా వర్ణనాంశాలను అనువదించేను. కొన్నిటికి మెరుగుపెట్టేనుకూడా...

శ్రీహ: అలాగా ఏదీ నా వర్ణనమీద మెరుగు పెట్టిన భాగం ఒక్కటి చూపెట్టండి...సంతోషిస్తాను...

శ్రీనా: మనవిచేస్తాను. చూడండి. మధ్యే శ్రుతీనాం ప్రతివేశినీనాం సరస్వతీ వాసవతీ ముఖేనః అన్న శ్లోకపాదం జ్ఞప్తిలో వున్నదనుకుంటాను...

శ్రీహ: లేకేం హంస తన్ను గూర్చి దమయంతితో చెప్పేభాగం...

శ్రీనా: దాని భావం...?

శ్రీహ: ఏముంది... వేద సాహచర్యంవల్ల నా వాక్కు అసత్యంకాదని...

శ్రీనా: అంతేకద, దీనికి నా ఆంధ్రీకరణం చిత్తగించండి. భారతీదేవి ముంజేతిపలుకు జిలుక సమదగజయాన సబ్రహ్మచారి మాకు, వేద శాస్త్ర పురాణాది విద్యలెల్ల తరుణి నీ యాన ఘంటాపథంబు మాకు...

శ్రీహ: సెబాష్ కవిసార్వభౌమా, మీ ఆంధ్రీకరణం నిజంగా మూలానికి వన్నె తెచ్చింది. భారతీదేవి ముంజేతి పలుకు జిలుక సమదగజయాన సబ్రహ్మచారి మాకు...ఎంత ఉదాత్తంగా ఉంది...అద్భుతమైన కల్పన ..

శ్రీనా: ఇంకా మరికొన్ని వినిపించమని సెలవా?

శ్రీహ: అక్కర్లేదు, మీ ఆంధ్రీకరణ విధానమూ నైపుణ్యమూ నాకు అవగతమయాయి. కాని ఒక్క సందేహం...

శ్రీనా: కవి చక్రవర్తులు సందేహించడం దేనికి అడగండి...

శ్రీహ: ప్రప్రథమంలోనే వచ్చింది ప్రశ్న. నేను నైషధీయచరిత మంటే మీరు శృంగార నైషధమని మార్చేరే కారణం?

శ్రీనా: ఇది మొట్టమొదటే అడగవలసినప్రశ్న. ఇప్పుడడిగినా దీని విలువ దీని కుందను కోండి. నైషధీయ చరితంలో నిషధరాజు చరిత్రంతా మీరు చెప్పలేదు. విషాద ఘట్టాలనన్నిటినీ విడిచి అతని శృంగార జీవిత సన్నివేశాలను మాత్రమే వర్ణించారు. కాబట్టి నైషధీయ చరిత మనడంకంటె శృంగార నైషధమనడమే ఉచితంగా నాకు తోచింది.

యీ విషయంలో తామూ నాతో ఏకీభవిస్తా రనుకుంటాను.

శ్రీహ : ఈ విషయ మొక్కటే ఏం మీతో సర్వధా ఏకీభవిస్తాను. మీ ఆంధ్రీకరణం నా రచనకి చాలా చోట్ల మెరుగుపెట్టింది. మిమ్మల్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

శ్రీనా : పెద్దలు తమ ఆశీర్వాదానికి కృతజ్ఞుణ్ణి. ఏమైనా నేను ఆంధ్రీకర్తను మాత్రమే. అసలు సృష్టికర్తలు మీరు. పచ్చి బంగారాన్ని మీ రందిస్తే పై నగిషీలు నేను చెక్కేను.

శ్రీహ : అలా గనకండి. ఎవరి విలువ వారిది. మీరు నిజంగా కవిసార్వభౌములే. నా గ్రంథానికి ఆంధ్రదేశంలో ఇంత ప్రశస్తి రావడానికి మీ ఆంధ్రీకరణమే కారణమని ఇప్పుడు గ్రహించేను. మీ తోడి సల్లాప సౌఖ్యాన్ని అనుభవించేను. చాలా సంతోషం. కానైతే ఒక్క సంగతి మనం ప్రసంగం ముగించే ముందు చెప్పాలనుకున్నాను. మీరు గుర్తించారో లేదో నా రచనలో ఒక్కచోట పొరపాటు జరిగింది.

శ్రీనా : కవిచక్రవర్తులూ మహాపండితులూను... తమకుకూడా పొరపాటు...

శ్రీహ : ఎవరైతేనేం జరిగినతరవాత. అది మీ ఆంధ్రీకరణంలోనైనా సవరించేరనుకుంటాను.

శ్రీనా : అసలదేమిటో సెలవియ్యండి...వినాలని నాకూ ఆదుర్దాగానే ఉంది.

శ్రీహ : నలదమయంతుల స్వయంవరానంతరం కలి దిక్పాలుర సంభాషణలో పాంచాలీ పాండవైరివ (17 - 131) అన్నానండీ కవితావేశంలో కాల వ్యత్యాసం గమనించకుండా నలునికాలంలో అతనికి ఎన్నోతరాలు తరువాతి వారైన పాండవుల ప్రసక్తి ఎంత ప్రమాదజనితం...ఇది మీరైనా గుర్తించి సవరించే రనుకుంటాను.

శ్రీనా : ఏమన్నారు...నలుని కాలంలో పాండవ ప్రసక్తి...పాంచాలీ పాండవైరివ కానండోయ్ చాలా గొప్ప పొరపాటే ఈ సందర్భంలో నేనేం వ్రాసి ఉంటానో ఉండండి జ్ఞప్తికి తెచ్చుకుంటాను. పాకశాసనుండు పావకుండు పరేతపతి పాశహస్తుడు పంచముండునైన యేను నియ్యోవురము పాండవులు పాంచాలినింబోలె బంచుకొని యనుభవింతుము నేనూ కవితావేశంలో ఆ మాటలే అనువదించానండి. కాలవ్యత్యాసాన్ని గమనించకుండా...

శ్రీహ : మొత్తంమీద అన్ని శాస్త్రాలు చదివి అన్నేసి గ్రంథాలు వ్రాసి అంతటి కీర్తి ప్రతిష్ఠలు సంపాదించిన యిద్దరమూ యీ విషయంలో ఒక్కలాగే పొరపడ్డామన్నమాట...

శ్రీనా : అయ్యా ప్రమాదోధీమతా మపి అది మానవ సహజ మనుకుంటాను.

శ్రీహ : అవునంతే అనుకోవాలి...సరే మళ్ళీ కలుద్దాం...

శ్రీనా : సెలవు...

# శ్రవ్య దృశ్య కావ్యముల తారతమ్య పరిశీలన

## శ్రీ ఎం. శివకామయ్య.

కావ్యేషు నాటకం రమ్యం, నాటకాంతం సాహిత్యం అను లోకోక్తులు మన పండితలోకమున వాడుకలో నున్నవి. మన అలంకార శాస్త్రమునందలి రసస్వరూప నిరూపణకూడ చాలవరకు నాటకపరముగనే జరిగినది. కనుక మన ప్రాచీన సంప్రదాయమున దృశ్యకావ్యములకు ఇతర కావ్యములకన్న ఒక విశిష్ట స్థానమును ప్రత్యేక గౌరవమును ఉన్నట్లు కనిపించును. ఆంగ్ల సాహిత్య పరిజ్ఞానము కూడ ఇట్టి అభిప్రాయమునే దృఢపరచుచున్నది. ఆంగ్ల కావ్యములలోకెల్ల షేక్స్పియరు మహాకవి నాటకములే ఉత్తమోత్తమములని విద్యార్థులును, విద్వాంసులును పరిగణించు చున్నారు. పాశ్చాత్య సాహిత్యమున కవిత్వ తత్త్వ విచార రూపకమగు విమర్శనా శాస్త్రమునకు మూలగ్రంథమగు ఎరిస్టాటిల్ పండితుని పొయటిక్సులోని తత్త్వవిచారముకూడ, ప్రధానముగ నాటకపరముగ నేడున్నది. నాటకమే వివిధ కావ్యములకెల్ల పరమావధి కాబోలు ననిపించును.

కవిత్వము సంగీతము చిత్రకళ నాట్యము మొదలగు కళల నన్నింటిని అంగములుగ నుపయోగించుకొను నాటక కళ ఒక మిశ్రకళ లేక కళా సందోహ మనుట న్యాయము. అట్టి నాటకకళ బహుజనాదరణీయమగుటయు దానికి అంగభూతమగు కావ్యకళకన్న ప్రజాసామాన్యముచే అధిక గౌరవమును పొందుటయు సహజముగనే కన్పించును. కాని అందువలన నాటకమున కొక అంగముగ రంగస్థలమున ప్రదర్శనీయమగు దృశ్య కావ్యమే, కావ్యములలోకెల్ల ఉత్తమమనియు, ఏ కళవలననైనను మన మాశించు ప్రయోజనమును కావ్యకళ వలననే ప్రత్యేకముగ సాధింపవూనుకొను శ్రవ్యకావ్యముకన్న కావ్యదృష్ట్యా శ్రేష్ఠమనియు సాహిత్య పండితులు తత్త్వవేత్తలగు విమర్శకులు తలచుట వింతగ నున్నది. అట్టి అభిప్రాయమునకు వాస్తవముగ శ్రవ్య దృశ్య కావ్యముల స్వరూపములలో విధానములలో ఎంతవరకు ఆధారముకలదు? అని విచారించుట ఉచితమును, అవసరమును అగును. శ్రవ్యకావ్యములును దృశ్యకావ్యములును కావ్యము లందలి రెండురకములు. కావ్య మొక కళా కృత్యము. శ్రవ్య దృశ్య కావ్యముల తారతమ్య పరిశీలనకు దిగుటకు ముందు కళల యొక్క సామాన్య ప్రయోజనములను, అవికాక కావ్య కళ వలన ప్రత్యేకముగ నిర్వచించి పిమ్మట ఆ ప్రయోజనములను సాధించుటకై శ్రవ్య దృశ్య కావ్యములందు అవలంబింపబడు సాధనములందును పద్ధతులయందును ఎంతవరకు సామ్యముగలదో ఏ విషయములలో ఎంతవరకు భేదముగలదో గుర్తించి ఈ భిన్నములగు పద్ధతులకు లక్ష్యభూతములగు ప్రయోజనములను సాధించుటయందలి సామర్థ్యమును పోల్చి చూచి తరతమభావ నిర్ణయమునకు రావలెను.

కళ వలన మానవునకు లభ్యమగు ప్రయోజనము ఆనంద మనియు, అదియొక అలౌకికానంద మనియు (ఆస్థెటిక్ డిలైట్) అది భావనా ప్రపంచమున గలుగు అనుభూతి (ఇమేజనేటివ్ ఎక్స్పీరియన్స్) వలన లభించుననియు ప్రాచ్య

లుగాని, పాశ్చాత్యులుగాని, ప్రాచీనులుగాని, ఆధునికులుగాని ఎల్లరును అంగీకరించిన విషయము. ఇట్టి అలౌకికానందము నీయ సమర్థమగు భావనానుభూతికి కొన్ని విశిష్ట లక్షణము (ఆస్థెటిక్ క్వాలిటీస్) లుండవలెను. మన కట్టి అనుభూతి కలుగునప్పుడు మనము మన భావనయందు ఆకర్షణీయమును, సుందరమును సమగ్రమును అయి అందలి వివిధభాగములు చక్కగా సమన్వయ మగునట్లు సంఘటితమై ఐక్యతను చెందిన దృశ్యమునుగాని, దృశ్య పరంపరనుగాని ఏకాగ్రమగు మనస్సుతో ఆర్ద్రమగు హృదయంతో, నిర్లిప్తమును నిష్పాక్షికమును అగు బుద్ధితో సాక్షివలె చూచుచుందుము అని చెప్పవచ్చును. ఇట్టి లక్షణములుగల అనుభవమును మన భావనలో కలుగజేయుటయే కళాకారుని కృత్యము. అట్లు కలుగజేసినప్పుడే అతడు కృతకృత్యుడగును. మనము కృతార్థులమగుదుము.

అందుల కతడు చేయు ప్రయత్నము నిట్లు వర్ణింపవచ్చును. వాస్తవ ప్రపంచమున ఆకర్షణీయములును సుందరములును సమైక్యములును సంపూర్ణములును అగు దృశ్యములనుగాని వస్తువులనుగాని సన్నివేశములనుగాని సంఘటనలనుగాని గమనించి ఏరికొని తన భావనాశక్తిచేత ఇంకను ఈ గుణములలో అందేమైన లోపములున్న సవరించుకొని తన భావనలో నిలిపి, ఆనందించి తన ఆ అనుభవమును ఇతరులకుకూడ అందజేయ నిచ్చించి అట్లందజేయుటకై తనకు గలిగిన ఆనందమునకును భావానుభూతికిని ఆధారమగు పదార్థమునందుగాక మరియొక పదార్థము (మీడియం) నందు తన అనుభవమును అతడు వ్యక్తపరుపబూనును. తన విజ్ఞానమును, ప్రతిభను భావనాశక్తిని, మీడియం అగు పదార్థముపై తనకుగల అధికారమును వినియోగించి తన కళాసృష్టిని నేర్పుతో జరిపి తన అనుభవమును మన భావనలో స్ఫురింపజేయుటకు అతడు ఉపయోగించు పదార్థము (మెటీరియల్ ఆఫ్ మీడియం)ను బట్టి వివిధకళ లేర్పడుచున్నవి.

ఒక వస్తువువలన తనకు తన భావనయందు గలిగిన అనుభవమును, మరియొక పదార్థమునందు ఆ వస్తువు ననుకరించి అట్టి అనుకరణవలన ఇతరులకు, వారి వారి భావనల్లో స్ఫురింపజేయుట అనగా ఆ వస్తువుయొక్క విశిష్ట లక్షణములను సరిగా గమనించి ఇతరులకు చూపుట అన్నమాట. ఇట్టి అనుకరణ (ఇమిటేషన్) వలన కళ కొక నూతన ప్రయోజనముకూడ ఏర్పడును. కళాకారుడు వస్తువునందలి విశిష్ట లక్షణములపై తన భావనను కేంద్రీకరించి దాని సత్యస్వరూపమును అవగాహన చేసికొనును. అతని చేత చేయబడిన అనుకరణను భావనయందు లక్షించు సహృదయుడు తన మనస్సును వస్తువునకును అనుకరణమునకును సామాన్యములగు వస్తువుయొక్క విశిష్ట లక్షణములపై కేంద్రీకరించి వస్తువుయొక్క సత్యస్వరూపమును కళాకారునకు గోచరించునట్లుగా, స్పష్టముగా గ్రహించును. అనుకరణరూపమైన కళాకారుని కృత్యమువలన ఆనందమేకాక వస్తువుల స్వరూపజ్ఞానముకూడ కలుగును. ఆనందము ననుభవించు నుద్దేశ్యముతో, సౌందర్య తృష్ణతో, సానుభూతితో సుసంఘటితమగు దృశ్య సముదాయమున వస్తువు నిట్లు స్ఫుటముగా చూచుటయే దాని సత్య స్వరూపమును గుర్తించుట అనవచ్చును.

కావ్యకళలో ఇట్టి కళాప్రయోజనములను సాధించుటకై కవి ఉపయోగించు పదార్థము పదజాలము, భాష...ఇది మానవునకు సృష్టియందలి ఇతర జంతువులకన్న విశిష్టత నిచ్చు లక్షణములలో నొకటి యగుటయేగాక తక్కిన విశిష్ట లక్షణములగు ఆలోచన, భావన, సామాజిక జీవితము, నాగరికత మొదలగు అన్నిటికిని ఆధారమును ఆవశ్యకమును. మానవుడు తన నిత్యజీవితమున

భావ ప్రకటనకును సమాజమునందలి యితరులతో సహకారమునకును పరస్పరావగాహనకును ఉపయోగించునది. ఇట్టి సాధనము నుపయోగించునది గనుక కావ్యకళకు కళలలో ఒక విశిష్టత ఏర్పడుచున్నది. మానవ స్వభావమును, మానవ జీవితమును, చిత్రించుటకు ఇతరకళలకన్న కావ్యకళయందు అవకాశ మెక్కువ. మానవ జీవితమును అనుకరించుట, చిత్రించుట అనునది ఒక విధమగు విమర్శగా (క్రిటిసిజమ్ ఆఫ్ లైఫ్) పరిణమింపక తప్పదు. ప్రతిభ, లోకజ్ఞానము, సహృదయతగల కవి మానవజీవితము నందలి కష్టసుఖములను, రహస్యములను, సమస్యలను తనకు కనిపించినట్లు అర్థమైనట్లు తోచినట్లు చిత్రించును. అందతడు తన అభిప్రాయములకు, ఆశయములకు ప్రచారము నిచ్చుటకు ప్రయత్నించుట సహజము. కావ్యమునకు ముఖ్య ప్రయోజనమగు అలౌకిక ఆనందము కలుగజేయగల సుసంఘటితమును, సమైక్యమును, సుందరమును, సమగ్రమును అయి ఏకాగ్రచిత్తముతో ఆర్ద్ర హృదయముతో భావనలో ననుభవింపదగిన దృశ్యముగా, ఈ విమర్శ ప్రదర్శింపబడును. గనుక ఇది చాల న్యాయమైనదియు, ప్రభావము కలదియునై యుండును. విజ్ఞానమును, ఉత్తేజనమును హృదయసంస్కారమును గలిగించును. కనుకనే నైతిక సాంఘిక రాజకీయ సిద్ధాంతముల ప్రచారమునకై సంఘమునందలి నాయకులు, ప్రతిభావంతులు కావ్యకళను వినియోగించియే యున్నారు. కవి ఉద్దేశించినను ఉద్దేశించకపోయినను కావ్యకళ కి ప్రయోజనము తప్పదు. అందు దోషముగాని, ప్రమాదముగాని లేదు కూడను. ఏలనన ముఖ్య ప్రయోజనమగు అలౌకికానందమును కవి విస్మరించిన, అట్టి ఆనందమును కలుగజేయు లక్షణములు కవి సహృదయుని కందించు భావనానుభూతియందు లేకున్న, అతని విమర్శకు కళ వలన కలుగు ప్రభావముగాని ప్రచారముగాని ఉండనేరదు. అట్టి లక్షణము లుండునట్లు కావ్యమును నిర్మించిన ఆ నిర్మాణ ప్రయత్నముననే అతడు ప్రచారము చేయపూనుకొనిన సిద్ధాంతము న్యాయమగు పరిణామమును పొందును. అప్పు డతని విమర్శ సత్యదూరము కానేరదు, సంఘమునకు శ్రేయస్కరము కాకపోదు.

ఏ సాహిత్యము నందైనను ఉత్తమోత్తములని గణింపబడి చిరకాలము బహుజనాదరణను పొందిన కావ్యము లన్నియు (క్లాసిక్స్) ఒక యితివృత్తము నేల ప్రదర్శించునో యిప్పుడు విశదమగును. యీ యితివృత్తము విశిష్ట గుణములును, వ్యక్తిత్వమును కలిగి సమాజమునందలి మానవులను పోలిన కొన్ని పాత్రలకు సంబంధించియుండును. వారి స్వభావములు, పరస్పర సంబంధములు పరిస్థితులు అందువలన కలుగు రాగద్వేషములు అందువలన ప్రేరేపింపబడిన ప్రవృత్తులు సంభాషణలు చేష్టలు అందువలన నేర్పడిన సన్నివేశములు సంఘటనలు పరిణామములు, ఇతివృత్తమున మనము చూతుము. కాని కవి యీ యితివృత్తమును ఒక చరిత్రగా మన బుద్ధి కెరుకపరచి వదలడు. దానిని మన భావనలో ఒక దృశ్యముగ లేక దృశ్య పరంపరగా స్ఫురించునట్లు ప్రదర్శించును. తన ప్రతిభవలనను భావనాశక్తి వలనను, భాషపై తనకు గల ఆధిపత్యమువలనను రచనా కౌశలము వలనను మన మా యితివృత్తమునందలి పాత్రల స్వభావములను ప్రవృత్తులను సరిగా (అనగా సానుభూతితోను నిష్పాక్షికముగనుకూడ) అవగాహన చేసికొనునట్లును వారికి గలుగు కష్టసుఖములను పరిణామములను విశదముగా గమనించునట్లును మన భావనకు చూపును. ఇది యంతయు నొక యర్థవంతమును, స్ఫుటమును సుందరమును సుసంఘటితమును అగు దృశ్యముగా ఏకాగ్ర మనస్కులమయి మనము చూచుట వలన మనకు కళవలన లభించదగు అలౌకికానందము చేకూరును.

ఇతివృత్తమునందలి పాత్రలు, మన సమాజము నందలి మానవులనుబోలి, వారి ప్రవర్తనఅంతయు సహజముగను, వారి పరిస్థితులకును స్వభావము లకును ఉచితముగను ఉండుటవలన మనము ఒక ప్రత్యేక ప్రపంచమును మనః ప్రపంచమును పోలినను అంతకంటె సుందరమును అర్థవంతమును సుసమనిత్వమును అగు ప్రపంచమును స్వీయములగు తాపత్రయములను మరల మనశ్శాంతితో ఆసక్తితో అనుభవింతుము. మనయందు గలుగు భావ పరంపరా పరిణామ ప్రభావమున ఆనంద మును పొందుచు కవి తన కావ్యమున నిబంధించిన జీవిత విమర్శను గ్రహించి తదనుగుణమగు మనో వికాసమును హృదయ సంస్కారమును చెందు దుము. యీ రెండు ప్రయోజనములును మనకు చేకూరవలెనన్న కవి తన యితివృత్తమును జీవిత మున కొక నిశితమగు విమర్శ నిచ్చునదిగను, రసో త్పాదక గుణము గలదానినిగాను తన భావన యందు తీర్చికొని అట్టి యితివృత్తమును మన భావనయందు స్ఫుటముగా స్ఫురించునట్లు చేయ సమర్థము అగువిధమున కావ్యమును రచింపవలెను.

ఇట్లు ఇతివృత్తమును తీర్చికొనుటకును ప్రద ర్శించుకొనుటకును శ్రవ్య కావ్యమొక పద్ధతిని దృశ్య కావ్యమొక పద్ధతిని అవలంబించును. శ్రవ్య కావ్యమున కవియే యితివృత్తమునందలి పాత్రలను వారి స్వభావములను పరిస్థితులను ప్రవృత్తులను సన్నివేశములను పరిణామములను గద్య పద్యములలో వర్ణించి, ఆ వర్ణన వలననే పాఠకుని భావనలో స్ఫురించునట్లు చేయ ప్రయత్నించును...దృశ్యకావ్యమున కవి రంగస్థలమున పాత్రధారులగు నటులచే నటింప బడుటకు యోగ్యములగు కొన్ని సన్నివేశముల మాత్ర మేరుకొని అట్లు ప్రదర్శింపబడు నట్లిపుడు వారి చేష్టలు సంభాషణలు మొదలగువానివలననే మన భావనలో ఇతివృత్తము నంతటిని స్ఫురింప జేయ ప్రయత్నించును. యీ పద్ధతిని పరిమిత సంఖ్యగల పరిమిత కాలమున ప్రదర్శింపబడగల సన్నివేశములలో కార్యమును నిర్వహించుటకై ముఖ్యమైన ఘట్టములందలి సంభాషణాదికముల వలననే, పాత్రల స్వభావములు, ప్రవృత్తులు, అందలి పరిణామములు, ప్రదర్శింపబడని యితర సన్నివేశములు సూచించుచు, యితర వివరములను సూక్ష్మ విషయములను నటకుని భావప్రకటన శక్తికిని సహృదయుని భావనాశక్తికిని వదలవలసి యుండును. అందువలన కావ్యమున కొక కుదిం పును ఐక్యతయు స్ఫుటత్వమును ఏర్పడును. సామాన్యులగు సహృదయులకు గూడ యితి వృత్తముయొక్క స్థూలస్వరూపము స్పష్టముగ గోచరించును. ఇది దృశ్యకావ్యపద్ధతి యందలి సుగుణము. కాని యీ పద్ధతి పాత్రల సంభాష ణలద్వారా యితివృత్తము నందలి ముఖ్యములగు ఘట్టములను ప్రదర్శించి సాధ్యమగునంత కుదిం పుతో యితివృత్తమును దీర్చికొనుట దృశ్యకావ్య ముల కావశ్యకముగాని శ్రవ్యకావ్యములందును అసంభవము గాదు, సంభవమే. సంభవమేగాదు, ఎన్నికగన్న శ్రవ్యకావ్యము లన్నిటియందును అవలంబింపబడిన పద్ధతిగనే కనబడును. ప్రతిభ గల శ్రవ్య కావ్య కవులు ఇట్టి సంభాషణలను చాల నైపుణ్యంతో దృశ్యకావ్య కవులను మర పించునట్లు నిర్వహించి తమ కావ్యములకు ఔన్న త్యమును సంపాదించి యుండుట సహృదయుల కెల్లరకు విదితమే. ఉదాహరణమునకు తిక్కన విరాటోద్యోగ పర్వములందలి రసవంతములగు ఘట్టములను శ్రీనాథుని శృంగార నైషధము నందలి స్వయంవరమునకు పూర్వపు నలదమ యంతుల సంభాషణము జ్ఞప్తికి తెచ్చుకొన వచ్చును. విమర్శగా పరిశీలించిన ప్రతి ప్రబం ధమునందు గూడ ఇట్టి ఉదాహరణలు దొరకును. ఇంతేగాదు, కొన్ని సన్నివేశములు రంగస్థలమున ప్రదర్శింప ననుకూలము కానందున దృశ్యకావ్య కవి వదలివేయవలసి యుండునట్టి వానినిగూడ

శ్రవ్యకావ్యకవి సంభాషణద్వారా మన భావన కందించి కావ్యమునకు గుణము చేకూర్చుట సంభవము. మనుచరిత్రయందలి వరూధిని వలపు ప్రయత్నము, కళాపూర్ణోదయమునందలి సుగాత్రి అర్ధరాత్రి పడకటింట భర్త నుపాలంభించుట ఇట్టివి. భావన యందు ఇట్టి ఘట్టములు వెగటును పుట్టింపవు.

ఒక్కొక్కప్పుడు మనకు పాత్రల సంభాషణలు చేప్పలేగాక, వారి మనసులందు కలుగు ఆలోచనలు గూడ తెలిసికొన నవసరము ఉండవచ్చును. ఇట్టివి యితరులతో చెప్పినట్లు చూపిన అసహజముగ నుండును గనుక నాటకములందు స్వగతములుగ భాషింపబడవలసి వచ్చును. కాని అట్టి స్వగతములు అస్వాభావికములే. శ్రవ్య కావ్యమున అట్టి స్వగతములు సంభవములు, సమయోచితములును మనోహరములును అయి రసపోషణ కుపకరించును. ఉదాహరణకు తిక్కన భారతమున కీచకుడు ద్రౌపదిని గూర్చి పడిన విరహవేదన, పోతన భాగవతమునందలి కృష్ణుని రాకకై నిరీక్షించు రుక్మిణి ఆందోళన చెప్ప వచ్చును.

ఇతివృత్తమును స్పష్టముగా భావనయందు గోచరింపచేయుటకు ఒక విశిష్టమగు వాతావరణము (అట్‌మాస్ఫియర్) అవసరము కావచ్చును. అట్టి వాతావరణము దృశ్యకావ్యమున సూచించుట కష్టము. శ్రవ్యకావ్యమున వర్ణనవలన అతి సులభముగను హృద్యముగను నిర్వహింపబడదగినది యగును. ఉదాహరణకు: పినవీరభద్రుని శకుంతలా పరిణయ మందలి కణ్వాశ్రమ వర్ణనను చూడుడు.

ఇంకను ఇతివృత్తముయొక్క రసోత్పాదక శక్తి మన భావనయందు స్ఫుటముగా గోచరించుట మీద నేగాక, సుసంఘటితత్వముపైన నే గాక, ఇతివృత్తమునందు బింబితమగు జీవిత దృశ్యముయొక్క సమగ్రత్వముపైనను వైశాల్యముపైనను గూడ ఆధారపడి యుండును. దృశ్య కావ్యములందు ఇతివృత్తము సహజముగ పరిమిత ప్రమాణము గలది యగును. కావ్యమున సాధింప దగిన రెండు ప్రయోజనములును రసోత్పత్తి జీవిత విమర్శ ఒకదానిపై నొకటి ఆధారపడియుండును. జీవిత విమర్శ రసోత్పత్తివలన ప్రభావ వంత మగును. జీవిత విమర్శ సమగ్రమైన అందలి ఆసక్తి వలన మనకు ఏకాగ్రత కలిగి రసోత్పత్తికి దగిన స్థితి నందుదుము. యీ రెండు ప్రయోజనములను సాధించుటకు ఇతివృత్త మెంత విశాలమైన ఎంత సున్నితములగు వివరములతో ప్రదర్శింపబడిన... అంత అనుకూలము.

ఇట్లు వివరములతో విశాలమగు మానవ జీవిత దృశ్యమును ప్రదర్శించు ఇతివృత్తము శ్రవ్య కావ్యమున నే సాధ్యము...దృశ్య కావ్య మందలి జీవిత దృశ్యముగాని జీవిత విమర్శగాని సంకుచితముగను స్థూలముగాను ఉండక తప్పదు.

అట్టి స్థూలమగు విమర్శ యందు సమగ్రమగు న్యాయమునకుగాని సమన్వయమునకుగాని అవకాశము తక్కువ.

కనుక దృశ్యకావ్యములందలి సద్గుణములను సౌలభ్యములను గమనించి అవకాశ మున్నపుడు ఉపయోగించి ముఖ్యములగు ఘట్టములపై కేంద్రీకరించి ముఖ్య సన్నివేశములను దృశ్యకావ్య పద్ధతిని సంభాషణద్వారా నిర్వహించి రసోత్పత్తికి ఆవశ్యములగు సుసంఘటితత్వము ఐక్యత ఇతివృత్తమునకు సంపాదించి, ప్రతిభతో నిర్వహించిన శ్రవ్యకావ్యమే దాని స్వభావమువలన రసజ్ఞుల కెక్కువ ఆకర్షణీయముగ నుండగలుగుననియు, కళాభిజ్ఞులగు రసికులకు ప్రత్యేకాభిమాన పాత్రము కాదగు ననియు నా మతము. దృశ్య కావ్యము నాటకముగ ప్రదర్శింపబడి, సామాన్య ప్రజకు అధికాదరణీయ మగును గాక...



# రెండు కళ్లు

శ్రీ ఏడిద-కామేశ్వరరావు.

(సైకిల్ గంట మ్రోగుతుంది)

వెంకాం : అమ్మగోరూ...అమ్మగోరూ... తంతి వొచ్చింది తంతి.

శేషమ్మ : తంతీ...? టెలిగ్రామా యేమిటే...?

వెంకాం : అదిగదే అమ్మగోరూ....ఈ కాయితం చంతకంబెట్టి యిమ్మంటున్నాడు.

శేషమ్మ : వచ్చిందీ, టెలిగ్రామూ...? సీతా.... సీతా...ఆ వంటింట్లో వదినదగ్గర కూర్చుని యేం పుణుక్కుంటుందమ్మా....సీతా....

సీత : అమ్మా...వస్తున్నా.

శేషమ్మ : ఏం వస్తున్నా....? ఇవతల టెలిగ్రాం వచ్చికూర్చుంటేనూ...

సీత : వచ్చిందీ! నే చెప్పటంలేదు, వస్తుందనీ...

శేషమ్మ : నేనంటూనేవున్నానుకోదూ. ఆయన గారు రావడమో ... అర్జంటు టెలిగ్రాము రావడమో...యేదోవకటి జరుగుతుందనీ...

వెంకాం : మరి...అది వొచ్చిందికనక...ఆయన రారేటండి....?

శేషమ్మ : ఏడిశావులేవే .... అపశకునపుమాటలూ నువ్వూను. పండక్కి వస్తున్నట్లు ముందుగా టెలిగ్రాం యిమ్మని వ్రాసింది, అమ్మాయి. అలాగే అల్లుడుగారు టెలిగ్రాం యిచ్చాడు.

వెంకాం : అయ్‌బాబూ....గుండెలు గుబికి గుబికి మన్నాయి. తంతి అనేసరికి ... వచ్చేవోరు వొచ్చేత్తే వదిలిపొయ్యేదానికి ... అడలగొట్టే సిన్నా....

శేషమ్మ : ఇంతమాత్రానికే హడిలిపోతే, వెంకాం.... అనక ఆయన వచ్చాక అన్నీ అమర్చ వద్దటే....

వెంకాం : నాదాకా రానిత్తారేటండి...అన్నీ ఆ సీతమ్మగారే అమురుత్తారు.

శేషమ్మ : (నవ్వుతూ)అల్లుడిగారికి అన్నీ అమర్చాలని,మనసుగావుందేమిటే, వెర్రిమొహమూ...?

వెంకాం : నాకేటండోయ్ ... 'అల్లుడంటే అత్తకూ ఆశ, మల్లుడంటే మగనాలికాశ' మద్దిని నాకేటి.

శేషమ్మ : ఏడిశావులేగాని .... అమ్మాయ్ ... యెప్పుడొస్తున్నాడే....?

సీత : మధ్యాహ్నంరైల్లోనే...మరీ... (సైకిల్ బెల్ శబ్దం)

వెంకాం : ఆ కాగితం చంతకంబెట్టియ్యండమ్మగోరూ....ఆ పోట్లోయన నుంచున్నాడూ....

శేషమ్మ : అయ్యో...ఆ మాటే మరిచిపోయాం....

సీత : ఇదిగో....సంతకంచేసి యిస్తాను.

వెంకాం : ఇయ్యండి....నాను అబ్బాయిగారితో సెప్పొస్తాను. మా యెదురు చూశారు.... అబ్బాయిగోరూ.... తంతొచ్చింది; తంతి...

శ్రీనివాసు : తంతేమిటి దంతి...? దంతంటే ఏనుగు. టెలిగ్రామా? ఎవరిచ్చారే...?

వెంకాం : అల్లుడుగో గొత్తున్నారటండీ....!

శ్రీని : అల్లుడుగారా....? అయితే దంతన్నా యిబ్బందిలేదులే...

శేషమ్మ : అల్లుడు రావడమన్నా, ఐరావతం రావడమన్నా ఒకటేనే... వెంకాం....

శ్రీని ఔనౌను .... అందులోనూ మా అల్లుడు ఐరావతంగారు రావడమంటే తెల్లయేనుగు వచ్చినట్లే....

వెంకాం : అల్లుడుగారంతటోర్ని బట్టుకుని ... అలా అంటారేంటీ....? తెల్లఏనుగు, నల్ల ఏనుగూను....

శ్రీని . ఔను వెంకాం, నల్ల ఏనుగే...పొరపాటుగా అన్నాను.పండంటి పిల్లని కట్టబెట్టాం.... కాకిముక్కుకు దొండపండు కట్టినట్లు....

వెంకాం : నలుపైతేనేవండీ ... తలుకుండాలి గాని....

శేషమ్మ : బాగా చెప్పావు. అల్లుడు నలుపైతే, యిబ్బందేముందే. కోడలు నలుపైతే గోత్రమంతా నలుపవుతుందికాని...

శ్రీని : సరి సరి....అటునించి యిటు తిరిగిందీ, గాలి....?

శేషమ్మ : ఔనురా.... నువ్వో గురివింద గింజవి. ఆ నలుపు చూసుకోనే మురిసిపోతున్నావు.... సిగ్గులేకపోతేసరి, మొహానికి...

శ్రీని : సిగ్గెందుకు ... ? మా నాన్న సిగ్గుపడితే, నేనూ పడేవాణ్ణే....

శేషమ్మ . మీ నాన్నా....? ఆయన మాటెత్తుతావెందుకూ...? ఆయన బుద్ధులు అబ్బితే, యిలా యెందుకుంటావు....?

శ్రీని : అయితే, నీ బుద్ధులే అబ్బివుంటాయి !

శేషమ్మ : నా బుద్ధు లబ్బితే, బాగేపడుదువు....

శ్రీని : నేనేమీ పాడైపోలేదు.

శేషమ్మ : నువ్వనుకొంటేసరా...? చూచేవాళ్లు నలుగురూ ఛీఛీ అంటున్నారు.

శ్రీని : ఎందుకంటున్నారు...?

శేషమ్మ : ఎందుకా...? ఎలాగైతేనేం. పెళ్ళాం దొరికిందమ్మా అని .... నెత్తినెక్కించుకొని తిరుగుతుంటే, నలుగురూ నవ్వుతున్నారు...! నవ్వుతారా...నమిలి గడ్డడతారా....?

శ్రీని : నవ్వనీ....నాకేం భయం ?

శేషమ్మ . భయమేవుంటే యిలా యెందుకు బరితెగించిపోతావూ...?

శ్రీని : బరితెగించి పోవడానికి....నేనేమీ భార్యా విధేయుణ్ణికాదు...

శేషమ్మ : కాదో ... ఔనో ... తెలుస్తూనేవుంది. రాను రాను చిత్రమేస్తుంది. కంచం ముందు పెట్టుకుని....ఇటు ఆయన, అటు ఆవిడాను. ఆవిడ వడ్డించడం, ఆయన ఆరగించటమూను. ఆవిడ గుడుగుడుమంటూ యేమో చెప్పడం. ఆయన ఉఁఉఁఉఁ ... అంటూ ఆలకించడం. గడియారం ముళ్ళు కదిలిపోతున్నా, వాళ్ళిద్దరూ కదలరుకదా.

సీత : (నవ్వుతూ) గడియారం ముళ్లేనే అమ్మా ! వదిన పెద్దముల్లు, అన్నయ్య చిన్నముల్లూను....

శేషమ్మ : అలాగేవుంది, చూడ్డొస్తే. పెద్దముల్లు తిరిగి చిన్నముల్లును తిప్పినట్లు, తాను తిరిగి వాణ్ణి తిప్పుతోంది...ఆ వన్నెల విసినికర్ర...

శ్రీని · నువ్వుమాత్రం తక్కువా...? అలారం ముల్లులా అస్తమానమూ హడావిడిచేస్తూనూ.

సీత . అయితే, అన్నయ్యా - నేను సెకండ్సు ముల్లు నేమిట్రా....?

శ్రీని : చివరకు అలానేవుంది వ్యవహారం. చూడూ అమ్మమాటలు. మీ వదిన అన్నం వడ్డించడం, నేను తినడంగూడా తప్పుగానేవుంది ... చివరికి....

శేషమ్మ : అలా చెప్పు. నీమాట వింటాడుగాని, నామాట వింటాడూ....?

సత్య : అదికాదు అత్తయ్యా! ఆలోచన చెబితే, ఆయనే చేస్తారు. ఇందులో నే చెప్పినదే ముంది...మీరు చెప్పనిదేముంది...?

శేషమ్మ : ఔనమ్మా! ఆపాటి ఆలోచనలు మాకెలా తోస్తాయి....? చదువుకున్న దానివి. ఇంతకీ నిన్నసేం లాభం....? వాడి బుద్ధులు అలా వుంటేనూ...

వెంకాం : (దూరంగా) చరెలేండమ్మా. విడిచిన గుడ్డలన్నీ నూతికాడ పడుంటేనూ.... ఆరేసుకోరేటీ...?

శేషమ్మ : వస్తున్నానులేవే...మధ్యను నువ్వొహ దానివీ....

వెంకాం. అదికాదమ్మగోరూ. అబ్బాయిగారితో అత్తమానూ అలా తగువేసుకుంటారెందుకు.

శేషమ్మ : తగువంటావుకొని, వెంకాం....నువ్వు చూస్తూనే వున్నావుకదా, వాడి వరస నీకేమైనా బావుందిటే...?

వెంకాం : వరసాలేదు, వాయీలేదు, పోనిద్దురమ్మా...కుర్రతనాలూ...

శేషమ్మ: కుర్రతనాలా....? ఇవేం కుర్రతనాలే....? మీరూ కుర్రాళ్లేగా ... నీమాట చెప్పు. నీ మగడు యిలాగే వుంటాడా....?

వెంకాం : సరి సరి అనగారిమాటే అడిగారూ.... గిడసగింజ ..గట్టుమీదెడితే గెంతులు మెట్టుమీదెడితే మెంతులు.

శేషమ్మ : అదికాదే...మాటవరసకూ....

వెంకాం : అదేనమ్మగోరూ...నామాట యింటన్నట్టే అగపడతడు. తీరాజూత్తే ఆ మునలి దాని మాటకు అడుగుదాటడు.

శేషమ్మ : సరా.... నే నెరగనుటే వాణ్ణి .... మా యింట్లో పెరిగినవాడు కాదుటే....

వెంకాం : ఏమోనమ్మా....నాకయ్యన్నీ తెలవు. ఈ మొగోళ్ళమోత్తరే అంత.

శేషమ్మ : ఏం మోస్తరులేవే ... అంత పెళ్లాం బెల్లం అయితే, యిలాగ...?

వెంకాం : చామెత వుండనేవుందిగాదమ్మా ... పెళ్లాం బెల్లముకాదా, తల్లి అల్లముకాదా.

శేషమ్మ : అంతే. వెర్రిమొర్రి పాటలూ నువ్వూ.

(మేడమీదనుండి పాట వినపడుతూ వుంటుంది)

సీత : పాడగరావె, ఝుమ్,
ఝుమ్....ఝుమ్....ఝుమ్-తుమ్మెదా ||పా||
ఝుమ్మని నీవు ఝుంకారిస్తే,
తంబుర సోనలే తుమ్మెదా.... ||పా||
నీలాల రెక్కలే నీ సిరులు,
తుమ్మెద రెక్కలే నా కురులు,
కురుల సిరులతో, మరులు బరపుతూ,
ఆడరావె, నాతో, పాడరావె, తుమ్మెదా...
||పా||

కలువ రేకులే నీ యిళ్లూ,
కలువ రేకులే నా కళ్లూ,
కలువల కడలిలా, మధు కెరటాలపై,
ఆడరావె, నాతో, పాడరావె, తుమ్మెదా...
||పా||

ఏమిటే, ఆ రాగాలు,
ఎందుకే సరాగాలూ...
సంధ్యారాగము చల్లగ పాడవె,
ఆడరావె, నాతో, పాడరావె, తుమ్మెదా....
||పా||

(నవ్వులుకూడా వినవస్తుంటాయ్)
(పాట సగంలో వుండగానే)

శేషమ్మ : సత్యవతీ...సత్యవతీ....

సత్య : వస్తున్నానత్తయ్యా.... కుంపటిమీద నీళ్ళు మరుగుతున్నాయి. కాస్త కాఫీ పొడుంవేసి వస్తున్నా....

శేషమ్మ తప్పా....? తప్పన్నరా...? అన్నాలు తినేవాళ్లు అంతసేపెక్కడైనా తింటున్నారా? అన్నాలయ్యంగు ఆ గుసగుసలేమిటి....? అది వంటిల్లా....పడకటిల్లా ...?

వెంకాం పోనిద్దురమ్మా ... అబ్బాయిగారు అన్నం తినేయేలే మొదలెడతారు కయ్యం.

శేషమ్మ . కయ్యామేముండే. కంచంముందునుంచి కదులుతాడా, వాడు. నువ్వు చూస్తూనే వున్నావుగా ..రోజూ భాగోతం .

శ్రీని :అయితే, అమ్మా ....అన్నం తినొద్దంటావా ..?

శేషమ్మ : నువ్వు అన్నం తింటున్నావా....? ఆవిడగారి కబుర్లు వింటున్నావా...?

శ్రీని : ఏమో....యిలావచ్చి చూడు....

శేషమ్మ . చూస్తున్నాను ... అంతా చూస్తూనే వున్నాను. కళ్లు యింకా పోలేదు.

శ్రీని పోనీ నువ్వే పెట్టు అన్నం .... ఆ గుసగుస లేమో నీకే తెలుస్తాయి.



శేషమ్మ : నాకేమీ తెలియక్కర్లేదు నాయినా. నాకెందుకా గుడుగుళ్లు.నువ్వు వింటున్నావుగా .. చాలు చాలు.

శ్రీని : అదిగో.. అలా అంటే, యిలా అంటావు. ఇలా అంటే, అలా అంటావు. యెలా గేమ్మా చచ్చేది నీతో ?

శేషమ్మ : నువు చావడమెందుకురోయ్ .... ఆ భగవంతుడు నా మొహాన చావు రాసిపెట్ట లేదేమా అని నేను చస్తున్నాను.

సత్య : అబ్బ .... వూరుకోండురూ .... ఆవిడేదో కోపంగా అంటుంటే మీరుకూడా రెచ్చిపోతారూ...?

సీత : వూరుకోవే అమ్మా.... అనవసరం గొడవ... తీరి కూర్చుని....వాడు ఆఫీసుకు వెళ్ళనక్కర లేదా యేమిటి...? టైము అవుతుంటేను.

శేషమ్మ : ఏమో...ఆఫీసుకే వెడతాడో స్టేషనుకే వెడతాడో...యెవరి యిష్టం వాళ్ళది.

శ్రీని : స్టేషనుకా...? బావకోసమేనా...?


శేషమ్మ : ఇంకెవరికోసం....? వెళ్లనక్కరలేదనుకున్నావా...?

శ్రీని : ఇంకా అనుకోలేదు. ఆ విషయమే ఆలోచిస్తున్నాను.

శేషమ్మ : వెళ్ళనా...? వద్దా...? అనా....?

శ్రీని : ఔను .... రైలు వచ్చేది రెండుగంటలకి. అప్పుడు నాకు ఆఫీసులో రద్దిగానేవుంటుంది యెలా వెళ్ళడం....?

శేషమ్మ : ఆఫీసు రోజూవుండేదే. స్టేషనుకు వెళ్ళవలసినది యివ్వాళ ఒక్కరోజే. నాకు తెలియక అడుగుతాను....మొన్న పెళ్లాం వస్తుందని పరుగెత్తావుగా స్టేషనుకు .... అప్పుడు ఆఫీసు అడ్డురాదేమి....?



శ్రీని : ఆడమనిషి కనుక వెళ్లాను. బావగారు ఆడది కాదుగా ..?

శేషమ్మ: ఆఁ..బైలుదేరావు మగాడివి. నీ మగతనం తెలుస్తూనేవుంది. నన్ను వూరకే వాగించకు.

సత్య : అదికాదండీ ... రెండుగంటలకు....రీసెస్ టైములో వెళ్ళకూడదూ, కాస్త మీ ఆఫీసరుతో చెప్పి....

శ్రీని : అదిసరేలే స్టేషనుదాకా వచ్చిన మనిషి, నే వెళ్లకపోతే, అట్టే వుండిపోతాడా....? ఇంటికి రాడూ...? నన్ను చంపాలని కాకపోతేను.

సత్య : వెళ్ళడం మర్యాద. ఆవిడ వెళ్ళమంటూ వుంటే, కాదనడమెందుకు...?

శ్రీని : మర్యాదనే విషయం నాకు తెలియదేమిటి...? ఎలాగో అలాగ వెళ్లకుండా వుంటానా....?

శేషమ్మ : నీళ్లు మరగడందగ్గగే వున్నావులే... యే జాముకు అవనూ...?

సత్య : వారికోసం కూర్చుంటే అయిందే. అవి అలా అవుతూనేవుంటాయికొని మీరు భోజనం చెయ్యండి ... ఒంటిగంట కొవస్తుం టేనూ ....

శేషమ్మ : ఏమోనమ్మా... ఒకటైనా. రెండయినా మీరు వుండగలరుకొని, నే వుండలేను. అప్పుడే శోష వచ్చినట్లయిపోతోంది.

సత్య : అందుకే మీరు భోజనం చెయ్యండి. ఇదిగో ... యీ బజ్జీలుకూడా వేసి, మీ అబ్బాయికి టిఫిన్ పంపించాలిగా .... అదిగో.... వెంకాం కూర్చుంది, చెప్పుల్లో కాళ్లు పెట్టుకొని ....

శేషమ్మ : అన్నట్లు .. ఆమేడమీదికి కూడా పలహారం పంపించి, మరీవెళ్ళమను, దాన్ని. బైటకు వెడితే, మళ్ళీ యే జాముకు వూడి పడుతుందో ....

వెంకాం : సత్యవతమ్మగోరూ .... టిఫిన్ కారీ యిద్దురమ్మా ... ఎండ మండిపోతున్నాది.

సత్య : వెదురువుగానిలే ... ముందుగా యీ పళ్లెం మేడమీద యిచ్చిరా ....

వెంకాం . మేడమీదికా....నా నెల్లను బాబూ....

శేషమ్మ . అదేమిటేవ్ ...?

వెంకాం : ఎలా గెల్లమంటా రమ్మగోరూ .... ? అమ్మాయిగోరు పాడుతుండిరీ, ఆయన యింటుండిరీ .... మద్దెన నానేటీ....? పాణకంలో పుడకలాగ ...

సత్య : (నవ్వుతూ) యిదొక మగదలుమాడ అయిపోయింది అత్తయ్యా ....

వెంకాం . అది కాదమ్మగోరూ ... నానెత్తే, నన్నూ పాడమంటారు, అయ్యగోరు. నాకు రావంటే అమ్మాయిగారికి కోపం. నన్నాడిస్తారు. నాకు సిగ్గు బాబూ ....

సత్య : ఆడిస్తే, మహా ఆడే అందకత్తైవని.

వెంకాం : అయ్యాగోర్నే ముక్కుకి తాడేసి ఆడించగా లేంది, అమ్మాయిగోరికి నానో లెక్కా పత్రమూనా యేటండీ.

శేషమ్మ : ఏడిశావ్ .... దాన్ని వూహాలు సాగించక. దాన్ని వెళ్లని ....

వెంకాం : నానెల్తాను. ఇలా యియ్యండి ... ఆ టిఫిను. ఆలిచ్చం అయితే ఆఫీసు దగ్గర అబ్బాయిగోరు కేకలేస్తరు. నా నెల్తున్నానమ్మా ...

శేషమ్మ : వేస్తాడు కేకలు. వాటికేం లోటు. ఇంట్లో చాకిరి తెమిలేడవద్దూ ...

సీత : అమ్మా ... అన్నం తిన్నావా ... ?

శేషమ్మ : ఆఁ ... యిప్పుడే అయింది... యేం....?

సీత : మంచినీళ్ళు పట్టుకు వెడదామనీ ... ?

శేషమ్మ : ఏం ....? మేడమీద మంచినీళ్లు పెట్ట లేదేమిటి ...? రెండు చేస్తే నాలుగు మరచిపోతారు. ఏం పనులోగాని . . ఇదిగో .... వెండిగ్లాసు ... మరచెంబూను. పట్టుకెళ్ళు...

సీత : ఇలాయియ్యి - మీరే వచ్చారూ ?

చలపతి . ఆఁ .... నువ్వు మెట్లుదిగడం, యెక్కడం యెందుకని .... అనవసరం శ్రమ ఇలాతే....

సీత : అంత శ్రమలేకుండా చెయ్యడానికి .... యెంత కష్టపడిపోతున్నారో .... పాపం.

సత్య : నువ్వు బొత్తిగా ఏడు మల్లెపువ్వుల యెత్తాయిరి. పిలిచినా ప్రమాదమే. ముడిచినా ప్రమాదమే. అందుకని, మా అన్నయ్యగారు అలా అగ్గగ్గలాడి పోతున్నారు.

సీత : ఏమీ ఆడిపోవటం లేదు. నన్నో వెర్రి దాన్ని చేసి ఆడిస్తున్నారు కాని ...

సత్య : అబ్బో .... నీ వెర్రితనం మరీని. వెన్న పెడితే, మింగలేవు, వేలు పెడితే — కొరకలేవు. (చుఁయ్‌మంటున్న నూనెధ్వని)

చలపతి : వేలుకొరకలేదుకాని, బజ్జీలు కొరకడం బాగావచ్చును. వేడివేడివి రెండిచ్చిచూడు.

శేషమ్మ : ఆపీట వెయ్యవే, సీతా. కూర్చుంటారు ఆ వెండాకులో బజ్జీలు పెట్టవే, సత్యవతీ.

చలపతి : అబ్బెబ్బే ... వద్దండీ.... యిప్పుడేగా భోజనం అవుత. యింకా ఆయాసమైనా తీర లేదు.

సీత · తినండీ.... మీ కోసమేగా.... మీ చెల్లాయి గారు.... అన్నంకూడా తినకుండా వండు తోంది.

చలపతి : అదేమిటి....? అమ్మాయ్.... యింకా అన్నం తినలేదూ....?

శేషమ్మ : తింటుందిగా .... యేమంత పొద్దు పోయింది ... ?

చలపతి · రెండయితేనే.... అమ్మాయి అన్నం తినకుండా కుంపటి ముందు కూర్చోవడ మూనా.... నాలుగుసార్లు తిన్నవాళ్లు మళ్ళీ తినటమూనా....?

సత్య : ఒకళ్ళు తిని, ఆయాస పడుతూవుంటే, మరొకళ్ళు తినక నీరసపడుతూ వుంటారు. యిది లోక ధర్మమేగా....తినండిఅన్నయ్యా - చల్లారిపోతాయి.

చలపతి : చల్లారిపోయినా యిబ్బందిలేదు గాని, నువ్వు ముందు అన్నం తినమ్మా.

శేషమ్మ : తింటుందిలెండి. ముంగు మీరు ... నువ్వూ తినవేమే.... అమ్మాయ్.

చలపతి . అదిసరే.... తిన్నవాళ్లే తింటూ కూర్చోవట మేమిటి ... ? ఏదో సామెత చెప్పినట్లు.

సీత : మెరకనీరూ పల్లానికే - పల్లం నీరూ కొంత పల్లానికే అంటారుగా ...

శేషమ్మ : అత్తవారి యిల్లు యెప్పుడూ మెరక ...

సత్య : మేము పెట్టవలసిన వాళ్లము. మీరు తిన వలసిన వాళ్లూను ....

శేషమ్మ : మాకా యోగ్యతలేదని ... మేం పెట్ట డం మానేస్తామా ... ?

సీత : ఎందుకుండదూ, యోగ్యత. సాగించుకోవ డంలో వుందిగాని ....

శేషమ్మ : సాగించుకోవడం చేతగాని చవటమ్మ కనుకనే మావాడు .... వారాడింది ఆట, పాడింది పాటగావుంది. అసలు అత్తారు సాగించాలనుకున్నా...మా వాళ్లే సాగనివ్వ రుగా .... ?

చలపతి : సాగనివ్వక పోవడమంటే ... ?

శేషమ్మ : అంటే యేముంది? అమ్మ యెక్కడ అలిసిపోతుందో ... నాన్న యెక్కడ కష్టపడి పోతాడో ... ?

చలపతి అలాగని ... ?

శేషమ్మ : మొగుడుకే ముందు చెప్పిపెట్టటం.... వీడో కల్లాకపటం తెలియని కుంకమ్మగా.... కాబోలుననుకుని, వాళ్ళకంటే యెక్కువగా కళ వెళ పడిపోవడం, యేమని చెప్పను, యెంతని చెప్పను ... ?

చలపతి : అంతే లెండి,

శేషమ్మ : హుం .... అమ్మాయి వుత్తరం వ్రాయ గానే, సెలవు లేకపోయినా, వీలు చేసుకొని, పండక్కి వచ్చారంటే, యెంతో ముచ్చటగా వుంది. ఈ ముద్దు ముచ్చట మా మొహాన్ని యేవీ ... ?

చలపతి : ఔనుమరీ....

శేషమ్మ : ఔనా మరి అసలు ఆ అత్తవారే అంతంత మాత్రమైతే, మావాడో మతిలేనిమొద్దు.

సీత : అదిగో .... అన్నయ్య వస్తున్నాడు. దస్త రం పట్టించుకొని ...

శేషమ్మ . రానీ ... ఒక్కమాట చెబుతాను విను, నాయనా .... అత్తమాట విని, అల్లరి పడిన వాడూలేడు, ఆలిమాట విని, 'అల్లరి పడని వాడూ లేడు .... పదిమాట లెందుకు .... ?

చలపతి : అంతలో వుందిలెండి .... చివరికి.

శ్రీని : బావగారు వంటింటి గుమ్మంలో చేరారు, అన్నీ ఆరగించేశారా...? మాకేమైనా మిగిల్చారా... ?

చలపతి . మిగల్చడమే...అన్నీ మీ చెల్లాయే కాజేసింది.

శ్రీని : మా చెల్లాయి కాజెయ్యడమంటూ వస్తే, నినోట్లో కరక్కాయే పడేదికాని, బావా... లేచి టాయిలెట్ చేసుకోండి.

చలపతి : యేమిటి విశేషం ...?

శ్రీని : సినిమా ప్లాన్ ఒకటి వచ్చింది. అలా బజారు తిరిగి అక్కడనించి, సినిమాకు పోదాం.

చలపతి : అందుకే నేమిటి...? ముందుగా ఇంటి కొచ్చావ్ ?

శ్రీని : నువ్వు వున్నావని వచ్చాను. లేకపోతే, అలాగే వెళ్లేవాణ్ణి.

చలపతి : ఇంకా మా చెల్లాయికోసం వచ్చావను కున్నానులే ...

శ్రీని : వాళ్లకు సినిమాలు చూడటానికికూడా తీరి కెక్కడుందీ...?

చలపతి : నిజమేలే. భోజనం చెయ్యడానికే తీరిక లేదు. నువ్వుకూడా రెడీ అవ్వు.

శ్రీని : ఆఁ ... యిదిగో ... సత్తెం ... చూడూ ... నా సిల్కు కండువా ...

సత్య : ఎక్కడ పెట్టుకున్నారో చూడండి ... నేదాస్తున్నా నా... ? మాస్తున్నా నా...?

శ్రీని : అది సరిగాని,- అలా వున్నావేం...? అన్నం తినలేదా...?

సత్య : తింటానిప్పుడు....

శ్రీని : ఇంతసే పేం చేస్తున్నావ్ ...?

సత్య : ఏదో కబుర్లు చెబుతుంటే కూర్చున్నాను.

శ్రీని: అన్నం తినే కూర్చోకపోయావూ...?

సత్య : వారి భోజనాలయినాయి ... పొయ్యి పూరికే పోతుందంటే, కాఫీనీళ్లు పెట్టాను. సరే ... టిఫిన్ చేస్తే బావుంటుం దనుకొన్నాను. ఇంతలో...

శ్రీని : ఇంత టైమయింది.

సత్య : గడియారం మనకంటె ముందు పరుగెడు తోంది.

శ్రీని : అంతకంటె మా అమ్మ ముందు పరుగెత్తటం లేదూ ... చాకిరి చెబుతూను ...

సత్య : ఔను. ఆమె పరుగు అందుకోలేక, నే బోర్లా పడుతున్నాను — బొప్పిలు తింటు న్నాను.

శ్రీని : ఆ తినటం నీతో తీరిపోవటం లేదు ... అందర్నీ చుట్టుకొంటోంది. ఆ ఉసురు ...

సత్య : అలాంటి మాటలు యెందుకంటారు ... ?

శ్రీని : అనుకుంటేనైనా కాస్త బాధ అణుగుతుం దేమోనని ...

సత్య : మీరుకూడా బాధపడట మెందుకు ... ?

శ్రీని: అందరి బాధలూ పడటానికి నువ్వున్నావని ఊరుకోమంటావా... ? పొరపాటైపోయింది ... పండక్కి పంపమని మీ అక్క వ్రాసి నప్పుడు నిన్ను పంపించేసినా బాగుండి పోయేది.

సత్య : ఇప్పుడు మన బాగుకేం వొచ్చింది... ? సరిపెట్టుకోవడంలోనే వుంది సంతృప్తి.

శ్రీని : సంతృప్తికూడానా యీ జన్మకు...? నువ్వు చూడవస్తే యిటు,— అమ్మ చూడవస్తే అటు.

సత్య : అత్తయ్య యేదో అనుకుంటూ వుంటారు. ఆమె మోస్తరే అంత ... అనుకుంటే, సరి పోయేదానికి ... మనస్సు పాడుచేసుకొంటా రెందుకు ... ?

శ్రీని: పాడైన మనస్సు యింకా యేం పాడవు తుందిలే. ఛి ఛి...అందరమూ సరదాగా సిని

మాకు పోదామని త్వరగా తెములుచ్చుకొని వచ్చాను. ఇంతా వస్తే, తిండీ తిప్పలు లేకుండా నువ్వు...వండి వంటలు లేకుండా అమ్మాను...

సత్య. పోనీ...సీతను బావగార్ని తీసుకొని వెళ్ళి రండి.

శ్రీని: వస్తే యిద్దరూ రావాలి. నువ్వు లేకుండా ఆమెంగుకు...? పండగ ఎండగవుతోంది.

శేషమ్మ: వొరేయ్...శీనూ ... మీబావ నుంచు న్నారు. ఆ గదిలోంచి వూడిపడవేం...?

శ్రీని: వస్తున్నా...రా...బావా...

చలపతి: వుండూ...మీ చెల్లి మేడమీదికి పరు గెత్తింది.

శ్రీని: ఏం...? ఆమెకూడా వస్తోందా...?

చలపతి: ఏమోమరి...మీ అమ్మగారు ఆగమని సంజ్ఞ చేసింది.

శ్రీని: ఎందుకులే బావా...? అది వక్కర్తేనూ... మరోమాటు అందరమూ వెళ్లొచ్చులే.

చలపతి: ఔను. ఆమాటే నేనూ అనుకున్నాను. పదండి, వెడదాం..

శ్రీని. వెంకాం...తలుపు వేసుకో...

(తలుపు వేసిన చప్పుడు)

శేషమ్మ వెళ్లిపోయారేమిటే, వాళ్లు...?

వెంకాం ఎల్లిన్రమ్మా ... బామ్మరుదు లిద్దరూ కలిసి యెల్తుంటే ... కుట్టారుజునులు యెల్తన్నట్టే వుంది.

శేషమ్మ · ఏం పోల్చావే...? అయ్యో..రాత..

వెంకాం సూత్తే, మీకు అలాగే అనిపిత్తాది.

శేషమ్మ : అనిపించడానికి ... ఆడవాళ్ళుకూడా సుభద్రా రుక్మిణీల్లా వుంటేగా...

వెంకాం : ఎందుకుండ రమ్మగోరూ ... మీరే టేటో అనుకుంటారుగాని...

శేషమ్మ : నే ననుకోవడమేమిటే, నీ మొహం. వాడి బుద్ధులు నీకు తెలియవే. ఇప్పుడు చూచావుగా. ఆగమంటే అల్లుడు గారు ఆగాడా...? ఆ ఆగినా అయన్ను వీడు జబ్బట్టుకు లాక్కుపోయాడా...? ఇంకా యేం చెప్పాలే వాడి చుప్పనాతిగుణాలు.

వెంకాం : అదేనేటమ్మా...నాను పరకాయింప నేదూ...

శేషమ్మ : సినీమాకు వెడుతూ...చెల్లెల్ని తీసుకు వెళ్ళకూడదూ...?

వెంకాం : అల్లుడుగారు యెందుకులే అనుకున్నారేమో...

శేషమ్మ : కాదే...వీడికే యిష్టం లేదు.

వెంకాం : ఎందు కిష్టంలేకుండాపోతాదమ్మా..?

శేషమ్మ : ఔనే...ఆ గదిలో ఎదో గుస గుస లాడుతున్నారు... మొగుడూ - పెళ్లామూను. ఏం చెప్పిపెట్టిందో ... రుసరుసలాడుతూ బావగార్ని లాక్కు చక్కాపోయాడు.

వెంకాం : మరి అమ్మాయిగా రేరి...?

శేషమ్మ : అదిగో...మేడమీద గదిలో...బట్టలు వేసుకొంటోంది.

వెంకాం : అయ్యో...ఆరు యెల్లిపోయారు. ఎట్టా యెల్తారు అమ్మాయిగోరు...?

శేషమ్మ : అదో వెర్రిమొహం. మొగుడుతో చెప్పుకోరూ...తనూ వస్తాననీ...

వెంకాం : ఆరికి తెల్దేటి...? అయ్యగారికి తెల్సే ఆగారనుకున్నాను.

శేషమ్మ : తెలీక కాదులే... వెళ్ళమని నేనేడ వడం తప్పు...

వెంకాం : అయ్యో...పాపం...తెలిత్తే తీచుకెళ్లే వోరే. వొద్దనే మనిసికాదు.

శేషమ్మ : కాదుటే రత్నమాణిక్యంలాంటివాడూ అతన్ని అనుకోవడం పాపం.

వెంకాం: నిజమేనమ్మా...ఆణిముత్తెంలాంటోరు.

శేషమ్మ: కాదు లేమరి ... మొన్న అమ్మాయి రమ్మని రాయగానే రాలేదూ...? దానిమాట యెప్పుడు కాదన్నాడే. మా మొండి పీనుగు మల్లేనే వుంటారు లే...? పెళ్లాం మాటలు వినే పెయ్యామ్మల్లాగ. అయ్యో ... రాత ...

వెంకాం: నిజమేనంటారా ...? అమ్మగోరు ... అంతా అంతేనాగున్నాది.

శేషమ్మ: మవ్వో వెర్రిమొహానివి. నీతో చెప్తు న్నా నీకర్థమై యేడవదు.

వెంకాం: అరదమైందమ్మగారూ... ఈమొగోళ్లు అంతా అదోరకం. అమ్మ, ఆలీ మద్దెల ఔనంటే ఔనంటరు. కాదంటే కాదంటరు ఆళ్లు. ఔనన్నా, కాదన్నట్టే... కాదన్నా ఔనన్నట్టే...ఔను-కాదుకు అరదం వొకటే. మనం పీక్కు సావడం తప్ప...

శేషమ్మ: ఏడిశావులే ... వెర్రి వ్యాఖ్యానమూ నువ్వూను.

( ఉదయ ధ్వనులు )

శ్రీని : ఏమిటోయ్...రంగారావ్ ...రా, రా... కూర్చో... తెల్లవారేసరికి రెక్కల బొంబులా చక్కావచ్చావ్ ...

రంగా : రెక్కలొకటే తక్కువైనాయి, కాని, బావా - వుంటే నిన్ననే వచ్చి వాలేవాణ్ణి.

శ్రీని : ఏమిటి గిరాకీ.

రంగా : పండక్కి మిమ్మల్ని, మా అక్కనీ తీసుకురమ్మనమని పంపించారు నాన్నగారు.

శేషమ్మ : మీ నాన్నగారికి ఈ మధ్య జబ్బు చేసిందన్నారు ... కులాసాగా తిరుగు తున్నారా ?

రంగా . ఆఁ...మీ దయవల్ల ... అసలు యీ పండుగ చేసుకుందామనుకోలేదు. ఓనాడు బొత్తిగా చూపేలేదు ఏదో...దైవానుగ్రహం వల్ల లేచి తిరుగుతున్నారు. తిరుగుతున్నా డనడమేగాని...యేం తిరగడం...? గది లోంచి, సావిట్లోకి - సావిట్లోంచి వసారా లోకీని...

శేషమ్మ : మీరంతా అదృష్టవంతులు..యింతకి..

రంగా : అంతేనండి. అప్పట్నించీ ... అందరినీ చూడాలని యిదౌతున్నాడు. మా అక్క లిద్దరూ వస్తున్నారు. బుల్లక్కనీ, బావనీ కూడా తీసుకురమ్మని పంపించారు. రాత్రి ఒంటిగంట బండిలో దిగి, పూళ్లో మా పిన్ని వాళ్ళతో చెప్పి, యిప్పుడిలా వచ్చాను.

శ్రీని : వారంతా వస్తున్నారేమిటి...?

రంగా ' ఊఁ...ప్రయాణాలవుతున్నారు. రేపేగా...పండగ...పండగ వెళ్ళంగానే, సత్యనారాయణ వ్రతం చేసుకోవాలని తొందరపడుతున్నారు.

శ్రీని : అందరికీ పండగేగా...

రంగా : పండగే మరి ... అత్తయ్యగారూ ... ముఖ్యంగా మీతో చెప్పి...

శేషమ్మ : నాయిష్టమేముంది యోయ్...అరుగో మీ బావ యిష్టము ... అంతకంటే మీ అక్కయ్య యిష్టమూను.

రంగా : ఏం బావగారూ...లేవండి, మరి.

శ్రీని : ఏం లేవడమోయ్...చటుక్కున లేవడ మంటే మాటలా...?

రంగా : నిజమే ననుకోండి. ముందుగా అనుకో లేదు మా నాన్నగారి జబ్బుమూలాన.

శ్రీని : ముందుగా చెప్పలేదని యెందుకంటాం, ఇంతకీ మీ అక్కనికూడా...

రంగా : అడిగితే...రానంటుందా...?

శేషమ్మ : అదికాదోయ్ ... అననూ అంటుంది. మా యింట్లోకూడా సందడి కాదూ, అమ్మాయి, అల్లుడూ వచ్చారు. నాకెంత బాధ్యత వుందో - ఆమెకూ అంత వుంది.

రంగా: లేకుండా ఉంటుందా...? ఎలాగో వీలు చేసుకొని పంపమని కోరుతున్నాం కానీ, అందరూ వస్తున్నారు. కూతుళ్లు, అల్లుళ్లు. మనమలు అందర్నీ ఓసారి చూడాలని మా నాన్నగారు చాలా బెంగపడ్డారు.

శేషమ్మ: నిజమే చూడాలనే ఉంటుంది. అయితే మా యిబ్బందులు యెవరు చూస్తారు, అందు కన్నానుగాని, ... నాకెందుకు. ఆలుమగళ్ళ యిష్టం.

రంగా: అదికాదు...మీరు వెళ్ళమంటే...రానం టూడా...?

శేషమ్మ: ఇది మరీ బావుంది. నాయిష్టమేముంది .? నా మాటంటేనే వాడికి కిట్టదు.

రంగా: ఏమండీ బావా! మరిమరీ ప్రార్థిస్తున్నాను. పన్నెండు గంటల బండికే వెడదాం. వెలు గుండగా యింటికి చేరుకోవచ్చు.

శ్రీని: నువ్వు అంతగా అడగాలా బావా? మా అమ్మగారు చెప్పారుగా అసలు విషయం ... యెలా వస్తాం...?

రంగా: అలా అంటే, యేం చెప్పను...?

శ్రీని: ఇంకోమాటు వస్తాంలే. ఈ సారికి యేమీ అనుకోవద్దని చెప్పు.

రంగా: మీదయ, మా ప్రాప్తి! మరి, నే వెడ తాను. వూళ్లో...మాపిన్నీవాళ్ళు వస్తున్నారు. మరి ... సెలవండీ .... అత్తయ్యగారూ ... వెళ్లొస్తాను. అక్కా ... (కొంచెం ఆగి) అదుగో... చలపతిరావు అన్నగారూ నమ స్కారం.

చలపతి: ఏమోయ్...రంగా...యెప్పుడొచ్చావ్ ...అప్పుడే వెళ్ళిపోతున్నట్లున్నావ్.

రంగా: మరేనండి...యిప్పుడేవచ్చాను. పండక్కి తీసుకువెళదామని, కొంచెం పనుంది - వెళ తాను. సెలవ్...ఇదిగో...రిక్షా...

(భావి దగ్గర నీటి ధ్వనులు)

చలపతి: అమ్మాయ్...సత్యవతి...

సత్య: ఏమండి. . అన్నయ్యా నీళ్ళు కావాలా . .?

చలపతి: వద్దుకాని, మీ తమ్ముడు యిప్పుడేవచ్చి, అప్పుడే వెళ్లినట్లున్నాడు.

సత్య: ఔను. వూళ్లో మా పిన్నిగారున్నారుగా -

చలపతి: అంత తొందరగా వెళ్లాడేం...?

సత్య: పండక్కి వాళ్లను తీసుక వెడతాడు...

చలపతి: మరి...మీరు వెళ్ళటం లేదా...?

సత్య: ... ... ...

చలపతి: పంపమన్నారా యేమిటి...?

సత్య: అబ్బే...యిక్కడా పండగ చేసుకుంటు న్నాంగా...?

చలపతి: అయితే పుట్టింటి సరదా వేరుకాదమ్మా

సత్య : సరదాలకేం... యెక్కడిసరదా అక్కడ.

చలపతి : కాదు...అది మనస్సుకు సరిపెట్టు కోవడం అవుతుందికాని, సరదా అవదు.

సత్య : సరదా యెందుకుకాదూ...? వదినా, మీరూ వస్తే యెంత ఆనందంగా వుంది ?

చలపతి : మా యింటికి మా చెల్లీ, బావా రాలేదూ...? మరి, నే నెందుకు వచ్చేశాను?

సత్య : ఔననుకోండి ... మేము వెళ్ళకుండా వుండడంకూడా ధర్మమే.

చలపతి : నిజమే. కోర్కె తీరనప్పుడు ధర్మాల పేరు చెప్పుకొని - మనస్సును తృప్తిపరుచు కుంటాం. అన్నట్లు, మీ నాన్నగారికి చాలా జబ్బుచేసి, లేచినట్లు విన్నాను.

సత్య : ఔను...ఆ విషయం తలుచుకుంటేనే... ప్రాణం పీకుతోంది.

చలపతి : ఆఁ ... అలా కళ్ళనీళ్ళు పెడతా వెందుకు...? చూడమ్మా...యిటు

సత్య : నిం...పా...ది...గా...నే వుందిట లెండి.

చలపతి : మాసివస్తే, ఆ యన కు, నీకు కూడా తృప్తిగావుంటుందిగా...

సత్య : లేచి తిరుగుతున్నారుట ... మరొకప్పుడు చూస్తాం.

చలపతి : చూడకుండా వుంటామా ? చూడవలసి వచ్చినప్పుడు చూడాలిగాని ... అన్నట్లు వస్తానుండు...

సత్య : అన్నగారూ...

(మేడమెట్లెక్కిన ధ్వని)

సీత : స్నానానికి తువ్వాళ్ళకోసమా - పైకివస్తున్నారు...యివిగో - పట్టుకొస్తున్నాను.

చలపతి : అక్కర్లేదు. యిలా పైకి పట్టుకురా...

సీత : స్నానం చెయ్యరా...?

చలపతి : వ్యవధిలేదు.

సీత : అదేమిటి...?

చలపతి : రైలుకు వెళ్ళిపోవాలి.

సీత : యెక్కడికి...?

చలపతి : మనవూరు.

సీత : యెందుకు...?

చలపతి : తొందర పనివుంది.

సీత : అదేమిటి ... ? ఇంతలోనే యేమి వచ్చింది...?

చలపతి : వచ్చినదేదో వచ్చింది - తువ్వాళ్ళు పెట్టెలో పెట్టు...త్వరగా

సీత : రేపు పండగ పెట్టుకుని...

చలపతి : అక్కడా వుంది పండుగ...

సీత : అలాంటివారు ... యిక్కడ కెందుకు వచ్చారు...?

చలపతి: అదే, పొరపాటు చేశాను.

సీత: చేశాక, అనుకోవడమెందుకు...?

చలపతి: సరిదిద్దుకోవాలని...

సీత: సరిదిద్దుకోవడమంటే చక్కాబోవడమా..?

చలపతి: అది ఒకమార్గమె.

సీత: ఏమిటీ ధోరణి...? యెవరైనావింటే నవ్విపోతారు.

చలపతి: నవ్వుతారుకదా ... అయితే, యిబ్బంది లేదు.

సీత: లేక యేడుస్తారనుకున్నారా...?

చలపతి: అడైనా పరవాలేదు.

సీత: ఏమిటండి యిది...?

చలపతి: ఏముంది - వూరికి వెళ్లిపోవడం ... యింతకీ, నువ్వు వస్తున్నట్లా - రానట్లా...?

సీత: మీరు వెడుతుంటే - నేనెందుకిక్కడ... ?

చలపతి: యిక్కడా పండగ వున్నట్లు చెప్పావుగా...?

సీత: మీరు యెక్కడ వుంటే అక్కడే పండుగ.

చలపతి: అయితే, బైలుదేరు... పెట్టి...

సీత: సద్దేవుంది.

చలపతి: అయితే, వెంకాంను పిలిచి, జట్కాకేకెయ్యమను.

సీత: వెంకాం...ఓ జట్కా పిలు.

వెంకాం: జట్కానాండీ...? యెక్కడి కంటే యేం చెప్పనూ...?

సీత: స్టేషనుకు.

వెంకాం: టేసనుకా ... ? యెల్లిపోతున్నారేటమ్మా...

సీత: ఔను...త్వరగా పిలు...వుండండి... జట్కా రానీండి...ఆ వెట్టి వెంకాం పట్టుకొస్తుంది...

చలపతి: బైమె పోతుంటే... వారూ వీరూ అని కూర్చో. బావా ... బావా ... మేం వెడుతున్నామండి.

శేషమ్మ: వెళ్ళడమేమిటీ...? యెవరు — యెక్కడికి...?

చలపతి: మరేనండీ...? మేమే...వెడుతున్నాం.

శేషమ్మ: అదేమిటి...? రేపు పండగెట్టుకునీ ...

చలపతి: అందుకే - యివ్వాళే వెడదామనీ...

శ్రీని: నిజమా...బావా...?

చలపతి: అబద్ధంకాదోయ్...ఆఫీసులో పనుంది.

శ్రీని: ఆఫీసుకు రేపు సెలవేగా...?

చలపతి: ఔను...కేష్ పెట్టె తాళాలు నావద్దనే వుండిపోయాయి.

శేషమ్మ: పోనీ... శీను వెళ్ళి యిచ్చివస్తాడు.

చలపతి: అబ్బే...ఒకళ్ళకిచ్చి పంపించేవి కాదు.

శ్రీని: ఎంత పొరపాటైపోయింది. రేపు సెలవే గనక...అంత భయంలేదు. ఎంతో లేదుగా. రేపు భోజనంచేసి వెడుదువుగాని...యెంతో సరదాపడ్డాం బావా...

చలపతి: ఏం చేస్తాం...అందరి సరదాకూడా అలాంటిదే.

శేషమ్మ: ఇంకేంసరదా నాయనా! అంతా చట్ట బండలైతేనూ...

శ్రీని: అదికాదు బావా...ఇంతవరకూ వున్నావుగా...

శేషమ్మ: ఏమోనమ్మా ... యింతలోకే యేమొచ్చిందో...ఇంకా ఫలహారమైనా కాలేదు. యేమిటే అమ్మాయ్...?

సీత: ఏమో...నాకేం తెలుసు...? ఆ బావిదగ్గరకు వెళ్లారు - వొదినతో యేమో కబుర్లు చెబుతూనేవున్నారు. స్నానం చేస్తారేమోనని తువ్వాళ్ళు పట్టుకొని నే వెడుతూవున్నాను.

శేషమ్మ: ఔను. అప్పుడే కాదూ ... వీడు స్నానంచేసి వచ్చాడూ. వాడి పంచ పిండుతోందనుకున్నాను గాని ... యింతలో యేమో చెప్పి పెడుతుందనుకున్నానా...?

శ్రీని: ఏమిటి చెప్పిపెట్టడం ...? యెవరు...?

శేషమ్మ: ఇంకెవరురా... దానికి? కడుపులో గుబ్బుగా వుందిరా...

శ్రీని: సత్యవతికా మధ్యను...అదేం చెప్పిపెడుతుంది...? దానికేం గుబ్బు...?

శేషమ్మ ఏమోరా ... నాకేం తెలుస్తాయీ. ఏమైనా చెప్పిపెడతారు.

శ్రీని: ఏమిటమ్మా యిది...? నీకేమైనా మతి వుందా...?

శేషమ్మ: నాకేంరా? దాని మాటలు వినే మీకు మతులుపోయాయిగానీ.

శ్రీని: వూరుకో అమ్మా ... యెవరైనా వింటే, నవ్విపోతారుగానీ...

శేషమ్మ: నవ్వుబాట్లకే వచ్చిందిరా... నే చూడలేదంటావా....?

శ్రీని: ఏం చూశావు....?

శేషమ్మ: రెండుకళ్లా చూశాను.

చలపతి: అంతేకాని, రెండుచెవులా వినలేదుగా మీరు.

శేషమ్మ: ఇంకా యేం వినాలి .... చూస్తే తెలీదూ...?

చలపతి: వింటే తెలియవలసినది....చూస్తే యెలా తెలుస్తుందీ....?

శేషమ్మ: అక్కర్లేదు. చూచినా తెలుస్తుంది. చూడనిదే నే నేమీ అనను.

శ్రీని: ఏమిటి బావా యిది...?

చలపతి: ఏం చెప్పమంటావు...? ఆవిడ సరిగ్గానే చూస్తున్నా ననుకుంటున్నారు. కాని, ఆ చూపులో దోషం వుందని చెబితే, నాది తప్పుగా వుంటుంది.

సీత: ఏమిటండీ యీ గొడవ...?

చలపతి: నీకుమాత్రం తెలియదూ? తెలిసినా ... తెలియనట్లు తప్పించుకొంటున్నావు.

శేషమ్మ: ఇదేమిటండోయ్ ... అందరికి తలొక దోషం కట్టబెట్టేటట్టున్నారు చూడస్తే.

చలపతి: చూడవస్తే, అలాగే కనపడుతుంది. చూస్తే

యింకోలా కనపడుతుంది. నిజాన్ని చూడాలి గాని, చూశామనుకోకూడదు.

శ్రీని: ఏమిటో బావా... నా కేమీ అర్థమవటం లేదు. చెప్పండి...తప్పయితే, దిద్దుకొంటాం.

చలపతి: అంటున్నావు కనుక చెబుతున్నాను. నిన్ను, నీ భార్యను పంపించకుండా, నన్ను నా భార్యను పిలిపించడం ఏం బాగుంది -

శ్రీని: అదా? చూపులో దోషం అంటేనూ. ఇంకా నిన్నేమైనా తక్కువచూపు చూశామేమోనని. యిదౌతున్నాను.

చలపతి: నన్ను తక్కువగా చూచినా నేను బాధ పడను. నన్నెక్కువగాచూచి- నిన్ను తక్కువగా చూడటంలో ... నా మనస్సు గాయ పడింది.

శేషమ్మ: అదొకటికూడానా... నాయనా !

చలపతి: అది ఒకటి కాదు. అంతా అదే. కూతురు మాట వింటున్న అల్లుడు రత్నమాణిక్యంలా కనపడటము - అదే, కోడలిమాట వింటున్న కొడుకు మసిబొగ్గులా గోచరించడమూ. నా కేమీ బాగాలేదు. వచ్చినప్పటినించీ చూస్తున్నాను. చూస్తూవున్న కొద్దీ — గుండె బరువెక్కువై పోతోంది. దానికి మందు నేను వెళ్ళిపోవడమే ననుకున్నాను.

సీత: ఇదా? తాళాలు నావద్దనే వుండిపోయాయని అంటే, యింకా...

చలపతి: ఔను...భోషాణం పెట్టెలో భాగోతంలా జరుగుతోంది. తాళంతో పెట్టె తెరిస్తేనే మంచిదనిపించింది.

సీత : పెట్టె తెరిచారుగా....యిక చూడండి.

చలపతి : నేను చూస్తూనేవున్నాను. చూడవలసింది మీరే .... రెండు కళ్ళతో నూ చూడాలి.

శేషమ్మ : దీనికి...నీ గుండె...అంత గాయపడుతుందనుకోలేదు నాయినా.

చలపతి : గుండె రెండు గుండెలుగా చీలి బాధ పడుతున్నాను. నే నిక్కడ వుండలేను.

శ్రీని : బావా....నిన్ను అనవసరంగా బాధపెట్టాం. చాదస్తమేకాని, చెడ్డదికాదు...అమ్మ.

చలపతి : అమ్మ చెడ్డదెందుకవుతుంది....? అమ్మలోని అత్త...అంతకూ మూలకారణం.

సత్య : అమ్మ అత్త ఒక్కటే....మాట తేడాతో వచ్చిన అభిప్రాయభేదాలుతప్ప, యేమీ లేదు. వెళ్ళకండి అన్నయ్యా....

వెంకాం : అయ్యగోరూ జట్కాబండి మనిసి తొందరచేస్తున్నడు.

శేషమ్మ : వెంకాం...బండిలోవున్న అల్లుడిగారి పెట్టె దించి, అబ్బాయి పెట్టె పెట్టు.

వెంకాం : అదేంటమ్మగోరూ...అల్లుడు గోరు పూనేసి, అబ్బాయిగోరు యెడతారేంది ? - అత్తోరింటి...?

శేషమ్మ : ఔనే ఎవరి అత్తారింటికి వాళ్ళు.... యెవరి పుట్టింటికి వాళ్ళు.

వెంకాం : ఔనండమ్మగోరూ .... ఓరికి అత్తిల్లు, ఓరికి పుట్టిల్లూ... అవుతాది.

శేషమ్మ : ఇద్దరూ ఒకటే కాదుటే....

వెంకాం : ఇల్లుకూడా ఒక్కటే నమ్మగోరూ...

చలపతి : అదేనే భిన్నత్వంలోని యేకత్వం అంటే...ఐనా నీతో అంటూ నేమిటి... ?

# ఆంధ్రదేశమునందు ఆయుర్వేదమును అభివృద్ధిపరచు పథకములు

శ్రీ ఎ. లక్ష్మీపతి

ఆయుర్వేదము ప్రజలకు రెండువిధములుగా ఉపయోగ పడుచున్నది.

౧. సుఖముగా హితముగా నుండు దీర్ఘాయువును పొందుటకు ఆయుర్వేదము సహాయపడును. ఇట్టి ఆయువు లభించు నిమిత్తము - ప్రతి పురుషుని, స్త్రీని, బిడ్డను తయారుచేయు నిమిత్తమై కఠినమైన శిక్షను ఆయుర్వేదము లభింప జేయును.

౨. ఇట్టి సుఖజీవనమునకు అభ్యంతరముగా నుండు వ్యాధులు రాకుండ చేయుటకును, వచ్చిన వ్యాధులు కుదుర్చుటకును, ఆయుర్వేదము సహాయపడును.

ఆయుర్వేదము ఆధ్యాత్మిక శాస్త్రము- పశువు వలె అజ్ఞానియగు మానవుని, నాగరికునిగను, విజ్ఞానవంతునిగను, తుదకు వ్యాధిభయము, మరణ భయము లేని యోగిగను, ఆయుర్వేదము తయారు చేయును.

ఆయుర్వేదానుసారముగా క్రోధము,లోభము ఈర్ష్య, అహంకారము మొదలగునవి కూడ వ్యాధులే. ఈ వ్యాధులను కుదుర్చుటకు ఆయుర్వేదము సహాయపడగలదు. ఆయుర్వేదము వలన కలిగెడు తత్వజ్ఞానము చేత, మనస్సు సాత్వికమగునని, మనము భారతీయ సాంప్రదాయము అనుసరింపగలిగిన, ఆధ్యాత్మిక జ్ఞానము పెంపొందగలదని, మన రాష్ట్రపతి రాజేంద్రప్రసాదు గారు నిరంతరము మనకు జ్ఞాపకము చేయుచున్నారు.

ఇట్టి శాస్త్రమునకు ఉనికిపట్టులైన వైద్యులు, మన భారతీయ నాగరికతను కాపాడుటకు ముందంజ వేయవలెను.

౧౫౦ సంవత్సరములనుండి, విదేశరాజ్యమునకు లోబడి యుండుటచేత మనము క్రిందబడి యున్నాము - మంచిది, చెడ్డది అను విచారణ లేకయే బ్రిటిషువారిని అనుకరించి యున్నాము. ఇప్పుడు మన అదృష్టవశము చేత రాజకీయ స్వాతంత్ర్యము - దానితోగూడ భావ స్వాతంత్ర్యము, కర్మస్వాతంత్ర్యము మనకు లభించి యున్నవి. కేంద్రమునందును, ప్రదేశములందును సర్కారువారు, పాశ్చాత్య వైద్యమునందలి వ్యామోహముచేత, ఆయుర్వేదమునకు పూర్తిగ సహాయము చేయలేక యున్నారు.

కాని దేశమునకు స్వాతంత్ర్యము వచ్చిన తరువాత కొంతవరకు సానుభూతి చూపుచున్నారు. రెండవ పంచవర్ష ప్రణాళికలో, ఒక కోటి రూపాయలు ఆయుర్వేదాభివృద్ధికై కేటాయించి యున్నారు. ప్రాంతీయ రాష్ట్రములవారు కూడా క్రొత్తగా ఆయుర్వేద కళాశాలలు నెలకొల్పియు, ప్రయివేటు ఆయుర్వేద కళాశాలలకు సహాయము చేసియు కొంతవరకు, ఆయుర్వేదమునందు విశ్వాసము చూపుచున్నారు — కాని, సంస్కృతమునకు ప్రాధాన్యము ఇయ్యకపోవుట చేత ఈ సంస్థల నుండి ఆయుర్వేద ప్రవీణులు తయారగుటలేదు. ఇందులకు మనము చేయవలసినది ఏమనగా - సంస్కృత జ్ఞానము కలవారిని మాత్రమే ఆయుర్వేద కళాశాలలయందు చేర్చుకొనవలెను. ఆయు

ర్వేద విషయములను, పాశ్చాత్య విషయములను సమన్వయించి చెప్పగల ఉపాధ్యాయులనే ఆయుర్వేద కళాశాలలలో నియమింపవలయును. ఆయుర్వేద కళాశాలలయందు, దీని పరిశోధన శాలలయందు, ఉత్తీర్ణులైన ఆయుర్వేద విద్యాంసులకును, పాశ్చాత్య వైద్య నిపుణులకును ప్రత్యేకముగా హెచ్చుతరగతి విద్యాభ్యాసము లభింపజేయవలెను.

ఆయుర్వేదమును అభివృద్ధిచేయుటకు నాలుగు అంతస్థులు గలవు.

౧వ అంతస్థు: ప్రస్తుతము, ఆయుర్వేదమునందు కేంద్ర సర్కారు వారి సహాయముతో పరిశోధనలు జరుపవలెను – ఇందు నవీన శాస్త్రములయందు ప్రవీణుల సహాయము అవసరము కాన, వారు సహాయులుగా ఉండవలెను. యజమానులుగా నుండరాదు. ఎందువలననగా ఇందు జరుపు పరిశోధనలు ఆయుర్వేద సిద్ధాంతముల మూలసూత్రముల ననుసరించి యుండవలెను.

౨వ అంతస్థు: ప్రాంతీయ సర్కారుల యెత్తున ఒకటిగాని, అంతకంటె హెచ్చుగాగాని కేంద్ర ఆయుర్వేద కళాశాల లుండవలెను – ఈ కళాశాలలో నూటికి ౭౦ గంటల కంటె తక్కువ కాకుండా ఆయుర్వేద విషయములను, నూటికి ౩౦ గంటలకంటె ఎక్కువకాకుండా పాశ్చాత్య శాస్త్ర విషయములను నేర్పుట కవకాశముండవలెను, తగినంత సంస్కృత జ్ఞానమునకు ప్రాధాన్యముండవలెను.

౩వ అంతస్థు: జిల్లాస్థాయిని రెండురకముల కళాశాలలుండవచ్చును. ఒకరకము కళాశాలలలో తగిన ఉపాధ్యాయులుండి, ఆంధ్ర యూనివర్సిటీ పాఠ్యక్రమము ననుసరించి ౪ సంవత్సరముల డిప్లొమో కోర్సు ఉండవలెను. రెండవ రకము కళాశాలలు గురుకుల పద్ధతిననుసరించి, సంస్కృతమునకు ఎక్కువగా ప్రాధాన్యము ఇచ్చుచు నాలుగు సంవత్సరముల పాఠ్యక్రమము ఉండవలెను. – ఒక సంవత్సరము ప్రత్యేకముగా హాస్పిటలులో తరిఫీయదు ఉండవలెను. ప్రస్తుతము వీరికి సర్కారువారు ప్రత్యేకముగా పరీక్షలు జరుపవచ్చును గాని వీరి జ్ఞానము యొక్క పరిమితి డిప్లొమో కోర్సువారి జ్ఞానమునకు సమానముగా నుండవలెను.

౪వ అంతస్థు: నాలుగవ అంతస్థులో గ్రామవైద్యులకు ప్రత్యేకముగా ఆయుర్వేదమునందును, ఫస్ట్ ఎయిడు నందును, ప్రసూతి, శిశుసంరక్షణ యందును, గ్రామ పారిశుద్ధ్యము నందును శిక్షణ ఇయ్యవలెను. అప్పుడు, వారు ఇప్పుడు జరుగుచున్న గ్రామ పునరుద్ధరణ పథకములందు పాల్గొనుటకు వీలగును— ఈ నాలుగు అంతస్థులయందును ఆయుర్వేదమునందు పరిశోధనలు జరుపుటకు అవకాశముండవలెను.

## రోగనివారణమునందు ఆయుర్వేదమునకు గల ప్రాముఖ్యము.

మన రాష్ట్రపతి డాక్టరు రాజేంద్రప్రసాదు గారు ఆయుర్వేద పద్ధతుల ననుసరించి, ఆరోగ్య ప్రచారము జరుపుట యుక్తమని అలోపతివైద్యుల కుద్బోధించుచున్నారు. వైద్యులు రోగములు కుదుర్చుటయే ప్రధానముగా చేసుకొనక, ప్రజల ఆరోగ్యమును కాపాడుటయే తమ కర్తవ్యముగా జేసుకొనవలెనని కోరుచున్నారు. కోట్లకొలది రూపాయలు ఆరోగ్యశాఖయందు ఖర్చులగుచున్నను, దాని ఫలము గ్రామములకు జేరుటలేదు. ఏ గ్రామము చుట్టుపట్ల చూచినను అసహ్యాకరమగు దృశ్యములు కనబడుచున్నవి. మలమూత్రములు, పెంటపోగులు కంటబడుచున్నవి — ఇవి భారతీయ నాగరికతకు కళంకములుగా నున్నవి. ధర్మవిరుద్ధముగా నున్నవి. చిన్నపిల్లల పాఠ్య గ్రంథములను, క్రొత్తమార్గములలో వ్రాయించి, గ్రామములందలి ఆరోగ్యపద్ధతులను పెంపొందించవలెను.

# ఆరోగ్య యాత్ర

జాతీయారోగ్యము పళ్లు తోముకొనుటతో ప్రారంభింపనగును. ప్రారంభమగును – ఎన్ని కొత్తరకముల టూతుబ్రష్షులు వచ్చినా, అవి యెవ్వియును చక్కని రుచ్చుగల వేప పుల్లతో సరిపోవు. ఇదిగాక, వేపపుల్ల చేదు రుచివలనను, ఇతరములయిన పలుదోము పుల్లలలోనుండు తీపి, వగరు మొదలగు రుచులవలన వాతపిత్త కఫముల దోషములచే గలుగు వ్యాధుల నివారణయందుకూడ పలుదోము పుల్లలు సహాయపడగలవు. ఒక్కొక్క దేశముయొక్క శీతోష్ణస్థితినిబట్టి ప్రజల ఆరోగ్య మార్గములు ప్రత్యేకముగా నుండును. అందుచేత, భారతీయ సాంప్రదాయమునుబట్టి సంక్రాంతి వారమునందు అనగా జనవరి ౧౦వ తేదీ మొదలు, ౧౭వ తేదీవరకు ఆంధ్రప్రదేశ వ్యాప్తముగా ఆరోగ్యయాత్రను జరుపుటకు సంకల్పించుకొని యున్నారు. ఈ వారమునందు ప్రజలు సామాన్యముగా ఇండ్లు వాకిళ్లు పరిశుద్ధపరచి అలంకరించు ఆచారముగలదు. దీనిని ఆధారము చేసుకొని గ్రామముల పారిశుద్ధ్యము అభివృద్ధిపరచుటకు అవకాశముండును. నేను ప్రత్యేకముగా, పశ్చిమ గోదావరిజిల్లాయందలి దెందులూరు ఫిర్కాలో నీ ఆరోగ్యయాత్రను స్వయంగా జరుపదలచుకొన్నాను.

ఆరోగ్య యాత్రయందు ఈ క్రింది విషయములకు ప్రాముఖ్యము ఇవ్వబడును :—

౧. తన శరీరముయొక్కయు, చుట్టుపట్ల నుండు ప్రదేశములయొక్కయు పరిశుభ్రతకు ప్రాముఖ్యము ఇచ్చుట.

౨. ఇంద్రియ నిగ్రహము, ఆత్మవిశ్వాసము, స్వార్థత్యాగము, వీని మూలముగా ప్రశస్తమైన ఆరోగ్యమును సంపాదించుట,

౩. ఇందుకొరకై ప్రజలనుండి వాగ్దానములు తీసికొనుట.

౪. వైద్యులు రోగములు కుదుర్చుటయందే శ్రద్ధ వహింపక, వ్యాయామము, ఆసనములు, అభ్యంగము, స్వస్థవృత్తము, సత్ప్రవర్తనము వీని మూలముగా ప్రజల ఆరోగ్యమును కాపాడుటకు ప్రయత్నించుటకు వాగ్దానము చేయుట.

౫. మంచినీళ్ళను మలినపరచమనియు, పెంట కుప్పలను పూడ్చి యెరువు చేయుదుమనియు, ప్రజలచేత వాగ్దానము చేయించుట.


౬. ఆహారపదార్థముల నభివృద్ధిచేయుట, దేశభక్తిపూర్వకముగా చేయుటకు ప్రజలను ప్రోత్సహించుట.

౭. బాల బాలికల క్రీడలను అభివృద్ధిచేయుట.

౮. గ్రామ పారిశుద్ధ్యమునందు మార్గదర్శకులగు వారిని, సభలలో తాంబూలములిచ్చి గౌరవించుట.

౯. ప్రతి గ్రామమునందును ఒక యకరము నేల ఔషధ ఉద్యానవనముల క్రింద ప్రత్యేకపరచుట.

ఈ ప్రకారము నేర్పరచిన ఆరోగ్యయాత్ర జయప్రదముగా జరుగుటకు గ్రామవైద్యులు ఆధారము.



# మొక్కుబడులూ, ముడుపులూ

**శ్రీ పాలంకి వెంకట రామచంద్రమూర్తి.**

మనిషిపై ప్రత్యేక ఆపదలంటూ వస్తూనే ఉంటాయి. కాని దేహంమీద వుండే అభిమానం కొద్దీ, ఆ ఆపదలలోంచి తప్పించుకోడానికి ప్రతీ వ్యక్తీ ప్రయత్నిస్తూనే ఉంటాడు. ప్రాణం విసిగి, "చస్తే బాగుండును!" అని మాటవరసకు అన్న వాడు కూడా, తీరా కాలం ఆసన్నమయేసరికి, "నేను కదలను! ఇక్కడే ఉంటాను!" అంటాడు. పేదవాడైన వృద్ధుడొకడు కట్టెల మోపు నెత్తిన పెట్టుకుని అమ్ముదామని ఊరంతా తిరిగేడు. ఎవరూ దాన్ని కొనలేదు. వాడి ప్రాణం విసిగి ఆ మోపును క్రింద పారేసి, "భగవంతుడా, నాకీ నికృష్టజీవనం దేనికి? ఓ మృత్యుదేవతా, నీవు వచ్చి నన్ను తీసుకుపోరాదా?" అన్నాడు. వెంటనే మృత్యుదేవత సాక్షాత్కరించి, "ఏం తాతా! నువ్వేనా నన్ను పిలుస్తి?" అని అడిగింది. ఆమెను చూడటంతోనే అతడు నిర్ఘాంతపోయాడు! నిజంగా ఆమె తన్ను తీసుకుపోవడానికే వచ్చిందనుకుని హడలిపోయాడు. కాని తెలివైన ఘటంగనుక వెంటనే మనస్సు చిక్కబట్టుకుని, "ఔనమ్మా, నేను పిలిచాను, మరేం లేదు, ఈ రోజు మోపును కాస్త సాయంబట్టి, నా నెత్తిపైన పెడతావేమోనని!" అన్నాడు వృద్ధుడు.

"మిక్కిలి విచిత్రమైన విషయం ఏమిటీ?" అని యక్షుడు ప్రశ్నించినప్పుడు ధర్మరాజు, "చావు తప్పదని తెలిసికూడా, ఆ చావును తప్పించుకోడానికి ప్రయత్నించడమేను!" అని సమాధానమిచ్చాడు. ప్రాణమంటే అంత తీపి. దాన్ని కాపాడుకోడానికి ఎన్ని ప్రయత్నాలైనా చేస్తాం. పురుషప్రయత్నంతో బాటు, సింహాద్రి అప్పన్నకో, అన్నవరపు సత్యనారాయణ స్వామికో, ఏడుకొండల వెంకటేశ్వరునికో మ్రొక్కుతాం. నగలో, నోట్లకట్టయో, మూటగట్టి, "ఈ ఆపదలోంచి గట్టెక్కించుస్వామీ! నీ కొండకు వచ్చి, ఈ ముడుపు చెల్లించుకుంటాను." అని, దేవతార్చన మందిరంలోని పటం ముందు మోకరిల్లి వినయంగా మనవి చేసుకుంటాం.

మా స్నేహితుడొకనికి టైఫాయిడ్ జ్వరం వచ్చింది. "రిలాప్సు" వచ్చి, అందరూ నిరాశ చేసుకున్నారు. కాని బ్రతికేడు. క్రమంగా పథ్యాలు వంటబట్టి, బలంచేరి తిరగడం ప్రారంభించాడు. ఒకనాడు అతని మేనత్త "శేషూ, నీవింక తిరుపతికి పోయి, ఆ వెంకన్నతండ్రి దర్శనం చేసుకురావాలిరా," అంది. "ఏం నువ్వుగాని మ్రొక్కుకున్నావా?" "ఔను, నువ్వానాడు మూసిన కన్ను తెరవకుండా ఉండేసరికి, 'ప్రభూ, మావాణ్ణి బ్రతికించి బట్ట కట్టిస్తివా కొండనెక్కి, నీ దర్శనం చేసుకుని ముడుపు చెల్లించుకుంటాడు!' అంటూ మ్రొక్కుకున్నాను." నూటపదార్లు మూటగట్టేను. వెళ్ళి వెంకటేశ్వర్లుకో దండంపెట్టి, ఆ మూటను హుండీలో పడేసిరా," అన్నదామె.

అత్తయ్యా! నీ వెఱ్ఱిగాని, దేవుడికి లంచమివ్వడం దేనికి? ఈ నూటపదహార్లకు మెత్తబడి వెంకటేశ్వరస్వామి ఆనాడు మృత్యుదేవతను తన విధి నెరవేర్చుకోనివ్వకుండా ఆటంకపరిచాడంటావా" అన్నాడు శేషగిరి.

ఆమె నిర్ఘాంతపోయింది. భయంతో లెంపలు వేసుకుంటూ, "భగవంతుణ్ణిగూర్చి హేళనగా మాట్లాడకూడదురా, నాయనా" అంది.

"హేళన కాదత్తా, చిత్రగుప్తుని లెక్కల ప్రకారం కాలం చెల్లడంతోనే అంతా వెళ్ళవలసిందేకదా ? మొక్కులూ, ముడుపులూ చెల్లించుకుని ఆపుచేయించుకునే ప్రయాణమా అది" అన్నాడు శేషగిరి.

"నీకేం తెలుసు, మేం ఆనాడు ఎంత హడిలిపోయామో...ఆ స్వామికి ఆ మహిమ ఉంది కనుకనే, మూసినకన్ను ఇట్టే తెరిచావు. ఇంత కన్నా నిదర్శనం ఏం కావాలి ?"

"అత్తా, ఆ కన్ను తెరవడం కాకతాళీయం కావచ్చు" అన్నాడు శేషగిరి.

ఆమె నాకేసి తిరిగి, "మూర్తీ, వీడితో నేను వాదించలేనోయ్. ఆ మొక్కు చెల్లేవరకూ నా గుండెకు అదటు తప్పదు. తల్లిలేని వీణ్ణి నేనే పెంచాను" అని కంట తడిపెట్టుకుంది. నా హృదయం స్పందించింది. "శేషగిరీ, నీవు వివేకానంద స్వామికన్నా, శంకరాచార్యులకన్నా గొప్పవాడివా ?" అన్నాను.

"ఏం అలా అంటున్నావు ?" అన్నాడు శేషగిరి.

"మహా జ్ఞానియైన వివేకానందుడు కూడా తల్లి మొక్కుబడిని చెల్లించాడే కాని నీకుమల్లే తర్కంలోకి దిగలేదు. శంకరుడు సన్యసించి కూడా, తల్లి కోరుకున్న ప్రకారం, ఆమె మరణ సమయానికి వచ్చి, అంత్యక్రియలు జరిపేడు. నీకు నమ్మకమున్నా లేకపోయినా, నీ క్షేమం కోరిన మీ అత్తయ్య మొక్కును, నీవు చెల్లించవలసిందే. నువ్వు లేచి దుడ్డులా తిరుగుతోన్నా, ఈ మొక్కు చెల్లనంతకాలం, ఆమెకు అదటుగానే ఉంటుంది. ఆ అదటు పోగొట్టకపోవడం కృతఘ్నతకదా ?"

శేషగిరికి నా ఆర్గుమెంటు నచ్చింది. తిరుపతికి వెళ్లొచ్చాడు.

"మూర్తీ! తిరుపతి చూడవలసిన క్షేత్రమోయ్. దేశంలో ఎక్కడెక్కడివాళ్ళో వచ్చిపోతోంటారు. ఆ ప్రకృతి దృశ్యాలన్నీ మరువరానివి! ముఖ్యంగా ఆ పాపనాశనం ధార చెప్పదగ్గదోయ్. అక్కడ స్నానం చేసేసరికి నడిచి వెళ్ళిన శ్రమంతా చేత్తో తీసేసినట్లైంది."

"దేవదర్శనం సులభంగా ఐందా? హుండీలో నోట్లకట్ట పడేశావా" అన్నాను.

"ఆ. పడేశాను. తక్కినవాళ్ల మొక్కులు చూసేసరికి, నాదీ ఒక మొక్కేనా అనిపించింది. ఎవరో ఒక గొప్పింటి బిడ్డ. అతి సుకుమారుడు. వాళ్లంతా సొంతకారులో వచ్చారు. కారు పోవడానికి కొండపైకి రోడ్డున్నా, కిందనే వదిలేసి, ఏడుకొండలూ నడిచి ఎక్కేరు. ఆ సుకుమారుడు స్నానం చేసి, ఆ తడిబట్టలతోనే ఆలయం చుట్టూ ప్రాకారంలోపల ఏడుసార్లు ప్రదక్షిణం చేశాడు పాపం. ఎగుడు దిగుడుగా ఉన్న ఆ కడపఱాతి పలకల మీద చొక్కా లేకుండా ఏడుసార్లు దొర్లుతూ వచ్చేసరికి అతని పచ్చని కోమల శరీరం పొర కొట్టుకుపోయి రక్తం చిమ్మసాగింది. అతణ్ణి చూస్తే నాకు కళ్లమ్మట నీళ్ళు బొటబొటా రాలేయి మూర్తీ! న్యుమోనియావచ్చి బ్రతికేడుట. బ్రతికిస్తే అలా ప్రదక్షిణాలు చేయిస్తామని మొక్కుకున్నారట ఆ తలిదండ్రులు ... ... 'స్వామిని దర్శించి ఒక్క నమస్కారం పెడితే చాలదా ఇలాంటి కఠిన శిక్ష విధించారేమిటి, మీ అబ్బాయికి?' అని ఆ తండ్రిని అడిగేను. 'శిక్ష కాదు నాయనా, ఆ స్వామి దాసాను దాసులం మనమంతా; ఆయన సాన్నిధ్యంలో సాష్టాంగ పడటం, ఇలా దొర్లి ప్రదక్షిణాలు చేయడం, ఆయనముందర మన అల్పత్వాన్ని గుర్తించుకోడ

మన్నమాట మన అహంకారాన్ని చంపుకోడ మన్నమాట' అన్నాడాయన. .

* * *

"నన్ను కదిలించివేసిన సంఘటన మరొకటి జరిగింది మూర్తీ. నేను కొండపైకి వెళ్ళిన బస్సులోనే ఒకావిడా, భర్తా, పిల్లవాడూ వచ్చారు. ఆవిడకు పాతికేళ్ళకంటే ఉండవు. ఉంగరాల కురులతో ఆమె ముఖం ఎంతో సొగసుగా అందంగా కనపడింది. మళ్ళీ నేను దిగిన బస్సులోనే వాళ్ళుకూడా వచ్చారు. ఆ పిల్లవాడూ, భర్తా కూడా ఉండబట్టి కాని, లేకపోతే నేను ఆ యిల్లాలును ఆనవాలు కట్టలేకపోయే ఉందును. అంతగా మారిపోయిందా ముఖం!"

"ఏం?"

"ఆ మనోహరమైన కురులసంపదను స్వామికి అర్పించి వచ్చేసిందామె....ఆ పిల్లవాడి పురిటిలో ఆమె బ్రతకదనుకున్నారు. వేణిని ఇస్తామని మ్రొక్కుకున్నారు. ఆ సుందరి ఎంత త్యాగం చేసిందో చూడు...అన్నాడు శేషగిరి.

శేషగిరి పేర్కొన్న ఆ సుకుమారునికిమల్లే తమ మ్రొక్కులేవో తామే చెల్లించుకొని, ఆ కాయ క్లేశమేదో తామే అనుభవిస్తే, ఇతరులకు ఏమీ ఇబ్బంది ఉండదు. కొందరు అలా కాకుండా, తమకోసం మ్రొక్కుకుని అన్యప్రాణాన్ని హింసిస్తారు .... "నూకలమ్మా తల్లే, నా బిడ్డ ప్రాణం కాపాడు! నీ కొక మేకను బలిస్తాను, కోడిపెట్టను అర్పించుకుంటాను" అంటారు. వేద హరిశ్చంద్రుడు, "సంతానం కలిగితే, ఆ బిడ్డనే ఇచ్చేస్తా"నని వరుణదేవునకు వాగ్దాన మిచ్చాడట. కాని తీరా పుట్టేక ఆ బిడ్డమీద పుట్టుకొచ్చిన మమకారంకొద్దీ, మాట చెల్లించుకోలేక పోయాడు. జలోదరం వచ్చి అమితమైన బాధ పడ్డాడు. తన కొడుకు బదులు ఎవరినైనా బలిద్దామని, ఆ వయసు పిల్లవానికోసం అన్వేషించాడు. అతడు ప్రతిఫలంగా ఇస్తానన్న గో సహస్రానికి ఆశించి తన కుమారుణ్ణి బలిగా పంపడానికి సిద్ధపడ్డ దౌర్భాగ్యు డొకడు కనుపించకపోలేదు! తల్లిదండ్రులే కరుణించని ఆ నిర్భాగ్య బాలుణ్ణి ఆఖరికి వరుణుడే కరుణించాడనుకోండి. చెప్పవచ్చిందేమిటంటే, ఎవరి మ్రొక్కులు వారే చెల్లించుకోవాలిగాని ఇతరులను హింసించకూడదూ అని.

కొందరి మ్రొక్కుబడులు చాల చిత్రంగా ఉంటాయి. తన మందలోని గొఱ్ఱెలకు తెగులు బయలుదేరి ఒక్కొక్క గొఱ్ఱెయే చచ్చిపోతుంటే ఆ గొల్లవాడు వెళ్లి, అమ్మవారికి మ్రొక్కేడు. ఏమని? దుర్గమ్మ తల్లీ, నా గొఱ్ఱెల్ని ఈ ఆపద నుండి కాపాడితివా వాటి నన్నింటినీ నీకు బలి ఇచ్చేస్తాను! అని....ప్రక్కన వున్నవాడు ఇది విని "వెఱ్ఱివాడా, మ్రొక్కువల్ల నీకేం లాభంరా? బ్రతికించుకున్న అన్ని గొఱ్ఱెలనూ ఇచ్చేస్తానంటున్నావు?" అన్నాడు. ఆ గొల్లడు అమ్మవారికి కనపడకుండా ముఖానికి చేతిని తెరవాట్లు చేసుకుని, "నిజంగా బలి ఇచ్చేస్తాననే నమ్మేవా?" అన్నట్లుగా సౌంజ్ఞ చేశాట్ట! ఈ విధంగా అమ్మవారినే మోసం చేద్దామనుకునే బుద్ధిమంతులున్నారు.

ఎక్కడిదాకానో ఎందుకు? నిన్న ఉదయం నేను చక్కెరకోసం గుకాణానికి పోయేసరికి ఆ షావుకారు అప్పుడే కర్పూరం వెలిగించి దేవునికి హారతి ఇస్తున్నాడు. అరమోడ్పు కనుదోయితో చేతులు జోడించి నమస్కరిస్తోన్న అతణ్ణి చూసి, ఆ భక్తిశ్రద్ధలకు ఎంతో మెచ్చుకున్నాను. ఇంటికివెళ్ళి చక్కెరపొట్లాం ఇల్లాలికి అందించేను ఆమె ఇత్తడి డబ్బాలో దిమ్మరించీ, "ఏమండోయ్, షావుకారు దగా చేశాడు. డబ్బానిండా రావలసిన చక్కెర అంగుళం లోతుకుపోయింది." అన్నది. "హరి నీ భక్తి మండిపోను! "నా

తక్కువరాళ్లు, పిచ్చ కుంచం వర్థిల్ల జెయ్యమనా'' నువ్వు మ్రొక్కుకుంట!'' అని నిర్ఘాంతపోయాను.

చెన్నపట్టణంలో ఉన్న రోజులలో మా యింటికి పక్కనే వినాయకునిగుడి ఉండేది. బడికి పోయే పిల్లలు ఆ గుడిపక్కనే వెళ్ళేవారు కాని ఎవరూ ఉత్తి రోజుల్లో ఆ దేవుడికి ఒక్కనమస్కారం పెట్టిన పుణ్యాన పోలేదు. పరీక్ష రోజుల్లో మాత్రం; దండాలే కాకుండా, కొబ్బరి కాయలుకూడా కొట్టేవారు. పరీక్ష అయిపోయిన మర్నాడు ఒక బాలుడు దేవతావిగ్రహం ముందు కళ్ళుమూసుకుని ప్రార్థిస్తుండగా చూశాను.

''ఏమిటోయ్ ప్రార్థిస్తున్నావ్''

''నాలుగు మూళ్ళు పదకొండు అయేటట్లు చెయ్యి స్వామీ'' అని ప్రార్థిస్తున్నానండీ...వాడు లెక్కల పరీక్షల్లో అలా వ్రాసి వచ్చాట్ట. వాడు ప్యాసవాలంటే ఎక్కమే మారిపోవాలని ప్రార్థిస్తున్నాడు.

సాధారణంగా మ్రొక్కులన్నీ స్వార్థంతోనూ, అవివేకంతోనూ కూడివుంటాయి. ఈ మ్రొక్కులన్నీ దేవుడువిని మనంకోరిన వరాలన్నీ ఇవ్వడమే ప్రారంభిస్తే, లోకం తలక్రిందులై పోతుంది; ''ఆపదలోనైనా మ్రొక్కుకో రాదా?'' అంటే, ''మ్రొక్కుకోమనే అంటాను. వద్దంటేమాత్రం ఒక పట్టాన మానగలరా?''

కాని ఒక్క సంగతి, భగవంతునికి ఆపద్బాంధవుడనే బిరుదు వున్నా, ఆయన మ్రొక్కుకున్నారందరికీ ఆపదలు తప్పిస్తున్నాడు అనడానికి వీల్లేదు. వైద్యుడు అందరిరోగాలను కుదర్చలేనట్లే భగవంతుడు కూడా అందరి ఆపదలను తప్పించలేడు కాని వైద్యుణ్ణి పిలవడం మానేస్తున్నామా? అలాగే భగవంతుణ్ణికూడా సాయపడవలసిందని కోరడంలో తప్పేమీ లేదు. అదికూడా ఒక పురుష ప్రయత్నమే. ఆపద గడిచినా గడవక పోయినా ఆ సమయంలో అవసరమైన ధైర్యం మాత్రం చేకూరుతుంది.

# ఇలవేల్పు

## శ్రీ త్రిపురనేని గోపీచంద్

తన భార్యకూ, చెల్లెలికీ మనస్పర్థ రావటం, శ్యామసుందరుని మనస్సుకి, చాలా కష్టం వేసింది. అదే సర్దుకుపోతుందిలే అని, అతను కొంతవరకు ఉపేక్షించి వూరుకొన్నాడు. కాని, వారిద్దరి మధ్యా, స్పర్థ, క్రమ క్రమేణా పెరిగింది. తన చెల్లెలి కుమార్తె వివాహంనాటికి అది బ్రద్దలై, అతని మనస్సును వికలపరిచింది. తన చెల్లెలు, కుమార్తె వివాహానికి ఆహ్వానించటానికై వొక రోజు తన ఇంటికి వచ్చింది. తన భార్య "ఎందుకీ పైపై పిలుపు? మీకు మనస్సులో మేం రావాలని లేదు. రాము. మేము రాకపోతే మీ పిల్లపెళ్లి ఆగుతుందా?" అన్నది. దానికి అనేక కారణాలు చెప్పింది. ఈమధ్య శ్యామసుందరుని అత్తగారు మరణించింది. ఆమె కర్మకి వూళ్ళోకి వచ్చికూడా తన చెల్లెలు రాకపోయింది. ఇది మొదటికారణం. ఇక రెండవకారణం ఈ వివాహానికి తాను వున్న వూళ్ళోనే, ముహూర్తం పెట్టుకున్నారు. ఆరోజు ఎవరెవర్నో పిలిచారు. తన్నుమాత్రం పిలువలేదు. ఆ రోజు నిజంగా తన భార్యకు చాలా కష్టం వేసింది. "ఇంత అవమానపరుస్తారా?" అని కంట నీరు పెట్టింది. ఇవన్నీ ఆడిగింది తన భార్య అడిగి "ఆనాడు అక్కరలేనివాళ్ళం ఈనాడు ఎందుకు కావలసివొచ్చాం?" అన్నది.

దీనికి తన చెల్లెలు ఏమేమో చెప్పింది. తన కుటుంబానికి చేసిన సహాయాన్ని ఏకరువుపెట్టింది. తనకు, తన అన్నమీద వున్న ప్రేమను వెళ్లబుచ్చింది. కాని లాభంలేకపోయింది. తన భార్య "నేను రాను, పిల్లలు రారు, నీకంత ప్రేమవుంటే నీ అన్నగారిని తీసుకువెళ్లు" అన్నది.

"ఏం అన్నయ్యా? అని అడిగింది చెల్లెలు నిజంగా చాలా జాలిగా అడిగింది. శ్యామసుందరుడు సందిగ్ధావస్థలో పడ్డాడు. తనకు వొక్కగాని వొక్క చెల్లెలు. చిన్నతనంలోనే తల్లి పోవటంవల్ల ఇద్దరూ అనేక కష్టాలకు లోనై పెరిగారు. అతనికి ఆ రోజులు జ్ఞాపకం వొచ్చినై. ఆ రోజుల్లో వాళ్లిద్దరూ, ఈ విశాల ప్రపంచంలో ఏకాకులుగా వుండేవారు. అలాగే బ్రతికారు. నిజమే. కాని, తన భార్య పడే బాధకు కారణం లేకపోలేదు. మొదట్లో తన భార్యకు, తన చెల్లెలంటే చాలా ఇష్టం. ఎంతో ఆదరంగా చూసేది. తన చెల్లెలు కూడా అలాగే వుండేది. పుట్టినప్పటినుంచీ తన కొడుక్కి, అన్నకూతుర్ని తప్ప ఎవ్వరినీ చేసుకోను అనేది. తన అన్నకి ఏకష్టం వొచ్చినా తనకు వచ్చినట్లే భావించుకొనేది. కాని నెమ్మదినెమ్మదిగా పరిస్థితులు మారినై. ఎవ్వరి పరిస్థితులు వారికి తెలియకుండానే మారినై. ఎవ్వరికి వారు మారిన మనస్తత్వాలకు అనుగుణంగా ప్రవర్తించటం మొదలుపెట్టారు. చివ్వరికి, రాకపోకలే సన్నగిల్లినై. పోను పోనూ, తనను, తన చెల్లెలు చిన్నచూపు చూస్తూవుందేమో అనే అనుమానం కూడా కలిగింది. ఇవన్నీ జ్ఞాపకం వొచ్చినై అతనికి తన చెల్లెల్లోవచ్చిన మార్పుకి తన భార్య ఎంత యాతన అనుభవించిందీ అతనికి తెలుసు. తను ఆర్థికంగా ఇబ్బందులు పడటమే దీనికి కారణమేమో అనే సంశయం కలిగినప్పుడు, నిజంగా

అతని మనస్సు ఉడికిపోయేది. తన భార్యా, పిల్లలూ, ఇతరుల చిన్న మాపుకి లోనవటానికి తన అసమర్థతే కారణంగదా అనుకున్నప్పుడు, అతని మనస్సు జాలితో నిండిపోయేది. ఎంత స్వార్థ త్యాగానికి పూనుకొని అయినా సరే, తన భార్యను సుఖపెట్టటమే తన పరమావధి అనుకునే వాడు. ఆమె లోకుల బాధలను మోయలేక, కన్నీరు రాలుస్తూ నిలబడివున్న భూదేవిలాగు కనుపించేది, ఆ క్షణం, - అతనీ ఆలోచనలలో ఉండగా,

"ఏం అన్నయ్యా ? అని అడిగింది చెల్లెలు.

"నేను రానమ్మా" అన్నాడు శ్యామసుందర్.

"అన్నయ్యా !"

"అవునమ్మా ! నేను రాను"

"నేనేం చేశానని ?"

"నేను రాను"

"రావా అన్నయ్యా"

"రాను"

శ్యామసుందరుని చెల్లెలు, తన చెవులను తానే నమ్మలేకపోయింది. వొదిన ఏమన్నా, తన సహోదరుడు, తన కుమారుని వివాహానికి రానని అనే అవకాశం వుందని ఆమె ఎన్నడూ, ఊహించుకోనైనా ఊహించుకోలేదు. ఒక్క నిముషం అలాగే నిలబడిపోయింది. ఆ నిముషంలో ఆమె మనస్సులో చిన్ననాటి స్మృతులెన్ని, తిరిగినయ్యో ! కన్నులు నీటితో నిండుకున్నవి. ఇక ఆమె పెదవులు కదల్లేదు. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళిపోయింది. ఆ ఇంటిలో ఆ క్షణం నిశ్శబ్దం రాజ్యం చేసింది - అతి భయంకరమైన నిశ్శబ్దం.

శ్యామసుందరుని భార్య ఏమనుకున్నదో ఏమో కొంసేపు మౌనంగానే వుండి, చివరకి "మీరు వెళ్ళకపోతే బాగుండదు. మీరు వెళ్లండి" అన్నది.

శ్యామసుందరుడు ఆలోచించాడు. తన భార్య రాక తాను వెళ్తే, "మా అన్నయ్య మంచివాడే, అన్నీ చెరిపేది మా వొదినే," అని అనుకుంటుంది తన చెల్లెలు. లోకులుకూడా అలాగే అనుకుంటారు. ఎన్నయినా ఊహిస్తారు. తన భార్య రాకుండా తాను వెళ్ళటంలో అర్థంలేదు. తన భార్య రాదు. అందులో సందేహంలేదు. ఇక తాను వెళ్లటం జరగదు.

"నేను వెళ్లను," అన్నాడు. "వాళ్లెవరినైనా అవమానపరిస్తే, నన్ను అవమాన పరిచారు. నీవు వెళ్లదలచందీ నన్ను అవమానపరిచారనే. ఇక నేను వెళ్లటం అనే ప్రశ్న ఎలా ఉదయిస్తుంది ? మనం వెళ్ళకపోయినందువల్ల వాళ్ళకి దిగబడేది ఏమీ వుండదులే," అన్నాడు.

శ్యామసుందరుడు వివాహానికి వెళ్ళలేదు. కాని అతని మనస్సుకి శాంతిలేదు. మానవుడు చిన్న చిన్న విషయాలను పట్టించుకొని, మనస్సును చీకాకుపరచుకొని, ద్వేషాన్ని పెంచుకొని, తన్ను ఇంకొకరికి కాకుండా చేసుకోటానికి ఎందుకు సిద్ధపడతాడో అతనికి అర్థంకాలేదు. తనుమట్టుకు తనూ ఈవిధంగానే ప్రవర్తించె ! ఈ చిన్న విషయాలను, ఎందుకు పట్టించుకోవటం అనుకోలేక పోయె! పోనీ తన చెల్లెలుమాత్రం తమ మనస్సులు నొచ్చేటట్టు ప్రవర్తించటం ఎందుకు ? ఇటు తన భార్య పట్టించుకోకుండా ఊరుకుంటే పోయేది కాదూ ? ముహూర్తానికి పిలిస్తేం, పిలవకపోతేం? కర్మకు వస్తేం, రాకపోతేం ? కాని అలా జరుగదు. ఇటువంటి విషయాలు మానవుల మనస్సులను విరుగదీస్తూవుంటై. మానవుల మనస్సుల్లో విషబీజాలు నాటుతూవుంటై.

అతని మనస్సు ఈ రకం ఆలోచనలతో, వికలం అయింది. అతనికి అక్కడికి వంద మైళ్ళ దూరంలో వొక తోట వుంది. ఆ తోటలో చిన్న బంగళా వుంది. కొన్ని రోజులు అక్కడ గడిపి.

వద్దాం అనే సంకల్పం కలిగింది. భార్యతో చెప్పి అక్కడకు మరునాడే బయలుదేరాడు.

శ్యామసుందరుని తోట మామిడి తోట. అది రాకపోకల సౌకర్యానికి పెడగావున్న ఒక బస్తీని ఆనుకొని వుంది. అది అతని తండ్రి నాటించిన తోట. అతని తండ్రి, ఆ చుట్టుప్రక్కల బాగా పేరుమోసిన ప్లీడరు. ఆయన సెలవల్లో విశ్రాంతి కోసం ఈ తోట వేయించాడు. ప్రతి సెలవల్లోనూ కుటుంబముతో సహా అక్కడకు వెళ్లి, కులాసాగా కాలం గడుపుతూవుండేవాడు. కాని శ్యామసుందరుడు పెద్దవాడైంతర్వాత తన తండ్రితో కలిసి అక్కడకు వెళ్ళటం మానివేశాడు. దీనికి ప్రత్యేక కారణం ఏమీ లేదు. చదువుసంధ్యల్లో పడి అతని దృష్టి ఈ రకమైన ప్రశాంత జీవితాన్నుంచి, వేరువైపుకి మళ్లింది. పైగా తన తండ్రితో ముఖాముఖి కలిసి వుండటానికి అతను ఇబ్బందిపడడం మొదలుపెట్టేవాడు. అందుకని ఈ తోటకు రాకుండా, ఏదో వొక నెపంతో తప్పుకు తిరిగేవాడు. తన తండ్రి కాలం చేసింతర్వాత ఈ తోటకు రావటం అతనికి ఇదే మొదటిసారి...

అతని గుర్రపుబండి తోటముందు ఆగీ ఆగగానే అతని మనస్సు కొక అనిర్వచనీయమైన ప్రశాంతత చేకూరింది. ఏనాడో విడచిన ఆప్తున్ని కష్టకాలంలో అగస్మాత్తుగా చూచినట్లనిపించింది. అంతలో తోటమాలి రామయ్య ఆదరాబాదరా పరుగెత్తుకుంటూ వచ్చాడు. తన చిన్న దొర బండి దిగటం చూసేటప్పటికి, అతనికి ప్రాణాలు లేచి వచ్చినై.

"దొర వొచ్చాడే! సుందరం దొర వొచ్చాడే...రావే" అని తన భార్యని పిలిచాడు. చిటికెలో అతని భార్యా, పిల్లలూ, బిర బిరా వొచ్చి, బండిదిగిన శ్యామసుందరుని చుట్టుముట్టారు.

"బాగున్నారా రామయ్యా?" అడిగాడు శ్యామసుందరుడు.

"తమరు చల్లగా వుంటే మాకేం కొదవ బాబయ్యా?" అన్నాడు రామయ్య. తాను స్టేషన్లో కొనుక్కొచ్చిన బిస్కట్లు, రామయ్య పిల్లలకు పంచిపెట్టాడు శ్యామసుందరుడు.

"వీళ్ళకు ఎందుకు బాబూ ఇయ్యన్నీ!" అన్నాడు రామయ్య.

"అన్నిటికీ ఎగబడతారు చచ్చినోళ్ళు" అన్నది, రామయ్య భార్య.

రామయ్య కొంత సామానూ, రామయ్య భార్యా కొంత సామానూ ఎత్తుకున్నారు. శ్యామసుందరుడు బండివాడికి డబ్బిచ్చి పంపివేశాడు. అంతా లోపలకు నడిచారు.

హోటల్ నుంచి, రామయ్య టిఫిన్ క్యారియర్‌తో భోజనం తెచ్చాడు. శ్యామసుందరుడు భోజనం ముగించాడు. అంతలో రైతులు కొందరు అతన్ని చూడటానికి వొచ్చారు. వాళ్ళంతా తన తండ్రిగారిని బాగా ఎరిగినవాళ్ళు. ఆయనవల్ల అంతో ఇంతో సహాయం పొందినవారు. వాళ్లు అనేక విషయాలు అడిగారు శ్యామసుందరుని. అతడు తనకు తెలిసినంతమట్టుకు జవాబు చెప్పాడు. భూమికి గరిష్ట పరిమితి, సేద్యం చేసుకొనే రైతుకి నష్టంలేకుండా మొత్తం దేశం యొక్క అభ్యున్నతికి అనుకూలంగా, జరుగుతుందని చెప్పాడు. సహకార సేద్యంవల్ల వచ్చే లాభాలను విశదీకరించాడు. అయినా రైతులు ఇష్టంమీద జరిగేపనేగాని బలాత్కారంగా ప్రవేశపెట్టటం జరగదు అని విపులీకరించాడు. "ప్రతి భారతీయుడూ తన స్వార్థదృష్టితో కాక, దేశాభ్యుదయ దృష్టితో ప్రవర్తించవలసిన తరుణం ఇది" అని ఉద్బోధించాడు.

ఈ విధంగా కాసేపు కష్టసుఖాలు మాట్లాడుకున్న తరువాత రైతులు, వొకరి వెనుక వొకరు

సెలవు తీసుకొని, తమ తమ పనులమీద వెళ్ళి పోయారు.

శ్యామసుందరుడు వొక్క నిట్టూర్పు విడిచాడు. ఏకాంతవాసం, ఈ కొత్త వాతావరణం అతని మనస్సును చాలా ఉల్లాసపరచినై. అతను కవి కాదు. కాని మనస్సు ఉల్లాసంగా వున్నప్పుడు ఏవో గేయాలు గిలకటం అతనికి అలవాటు. అదే అలవాటు చొప్పున పరధ్యానంగా కాగితం కలం తీసుకున్నాడు. అంతలో గడప దగ్గర అడుగుల సవ్వడి వినిపించింది. ఎవ్వరో గదిలోకి వస్తున్నట్లు అనిపించింది. తిరిగి చూశాడు. ఎవరది? ఎవరా స్త్రీ మూర్తి? అతని మనస్సు,

ఎవరది?
శరత్కాలపు మేఘమాలికయా?
భువికి దిగిన దివ్యాంగనయా?
పసిపాప చిరునవ్వు వెలుగుల దొంతరయా?
ఎవరది?

అని తన్ను తానే ప్రశ్నించుకుంది. అతని మనస్సు ప్రశ్నకు ఆ స్త్రీ మూర్తే జవాబు చెప్పింది. "నాది ఈవూరే. మీరు వచ్చారని తెలిసి, చూచిపోదామని వచ్చాను."

శ్యామసుందరునికి ఏమి జవాబు చెప్పాలో తెలియలేదు. ఏం చెయ్యాలో తోచలేదు. తికమక పడుతూ, కూర్చున్నాడు. ఆమె గ్రహించిందో ఏమో, తనే అందుకుంది...'మేమిక్కడ ఒంటివాళ్ళకీ, గుడ్డివాళ్ళకీ వొక శరణాలయం నడుపుతున్నాం. మీకు వీలుంటే వొకసారి వొచ్చి చూడాలని ప్రార్థిస్తున్నాను." అన్నది.

"తప్పకుండా" అన్నాడు శ్యామసుందరుడు. అంతే మళ్ళీ మాటలు సాగలేదు. ఆమెకూడా వొక్క క్షణం అలాగే నిలబడింది. చివరికి "రేపు ఉదయం మా ఇంటికి భోజనానికి రాగలరా?" అని అడిగింది.

"వస్తాను" అన్నాడు శ్యామసుందరుడు.

"రామయ్యకు మా ఇల్లు తెలుసు" అన్నది ఆమె.

"అలాగే" అన్నాడు శ్యామసుందరుడు.

"మరి శెలవు" అన్నది. అతను అప్రయత్నంగా లేచాడు. ఆమె వెళ్ళిపోతుంటే అలాగే చూస్తూ నుంచున్నాడు. ఎవరీమె? కాసేపటికి రామయ్య వచ్చాడు. అతను చెప్పాడు.

ఆమె పేరు శ్రీలక్ష్మి. ఆ పరిసరప్రాంతాల్లో ఎవ్వరికేం కష్టంవొచ్చినా, అక్కడ ఆమె ప్రత్యక్షం అవుతుంది. ఆదుకుంటుంది. ఆమెను చిన్నవాడు మొదలుకొని, వృద్ధులవరకూ "తల్లీ" అని పిలుస్తారు. తల్లిగానే భావించుకుంటారు. ఆమె అక్కడ వొక పాఠశాలలో, పంతులమ్మగా పనిచేస్తూ వుంటుంది. దానికి తోడు రెండు మూడు శరణాలయాలు నడుపుతూ వుంది. ఆమె జీవితం అంతా బీద ప్రజల కష్టనివారణకే అంకితం అయింది. ఈమధ్య పెద్ద భూస్వాముల దగ్గరనుంచి, హరిజనులకు భూములను ఇప్పించింది. ఎకరం, ముప్పాతిక ఎకరం, అర ఎకరం వున్న రైతులను కొందరిని కలిపి, సహకార సేద్యం కూడా పెట్టించింది. ఇలా చెప్పుకుపోయాడు రామయ్య. చెప్పి చెప్పి "ఆమె ఏది చెయ్యమన్నా చెయ్యటానికి జంకేవాడు ఈ వూళ్ళో వొక్కడూ లేడు...మా పాలిట దేవత ఆమె" అన్నాడు రామయ్య.

శ్యామసుందరునికి అంతా కలగా కనిపించింది. ఆమెను గురించి ఇదమిద్ధమని ఏమీ తేల్చుకోలేక పోయాడు.ఇంకా తెలుసుకోవాలి అనిపించింది. ఎవరీమె?

* * *

ఆమె ఇంటికి మరునాడు వెళ్ళాడు శ్యామసుందరుడు - ఆమె వంట చేస్తూవుంది. బయట వసారాలో ఆమె భర్త పిల్లలను పెట్టుకొని కూర్చుని వున్నాడు. శ్యామసుందరుని చూడగానే లేచి, మర్యాదచేసి, కూర్చోపెట్టాడు.

అతని మాట విని బయటకు వచ్చిందామె. "క్షమించాలి. వంట కొంచెం ఆలస్యం అయింది" అన్నది. "వొక్క పదినిమిషాలు" అని చెప్పి మళ్ళీ లోపలకు వెళ్ళింది.

"అదే చిక్కు" అన్నాడు ఆమె భర్త. అన్నీ తనే చెయ్యాలంటుంది, చేస్తుంది. బడికి వెళ్ళింది. వచ్చి వంట మొదలుపెట్టింది. ఇలా నాలుగు మెతుకులు నోట్లో వేసుకుంటుందో లేదో శరణాలయానికి వెళ్తుంది. అక్కడనుంచీ మళ్ళీ బడి. బడి గంట కొడతారో లేదో అటునుంచి అటే వూళ్ళోకి వెళ్తుంది. రైతులకు ఇదనీ, అదనీ, సహాయం చేస్తూ కూర్చుంటుంది. అక్కడనుంచి కొస్త పెందలకడవస్తే కుట్టుమిషన్ ముందు వేసుకు కూర్చుంటుంది. పిల్లల చొక్కాలుకూడా తను కుట్టవలసిందే, ఇలా ఎన్నాళ్ళు జరుగుతుంది చెప్పండి? తన ఆరోగ్యం చూసుకోనక్కర్లేదా?"

శ్యామసుందరుడు అతను వెలిబుచ్చిన అభిప్రాయాలన్నిటితోనూ ఏకీభవించాడు. "కాని," అని మళ్ళీ మొదలుపెట్టాడు ఆమె భర్త. "ఆమె ఎంత కష్టపడినా, కష్టపడ్డట్టే కనపడదు. ఏపని చేస్తున్నా. సహజంగానే ఉంటుంది. ఎన్నో ఏళ్ళనుంచీ చేస్తున్న మనిషిగా కనుపిస్తుంది. ఈ పనులన్నీ ఆమె చెయ్యవలసిన పనులుగానే కనుపిస్తవి. ఆమెకు తెలియనిదంటూ ఏదీ లేదు. ఇప్పుడీ వంట పని వున్నది చూడండి ఏ కూరలో ఏ విటమిన్లు వున్నాయో, ఎవ్వరికి ఏది అవుసరమో, అన్నీ ఆమెకు తెలుసు. ఆ ప్రకారం అన్నీ తానే చేస్తుంది. వంటవాణ్ణి పెడదాం అంటే "నేనుండి చేసేది ఏమిటి?" అంటుంది. ఏం చెయ్యాలి?" అతను పెద్ద నిట్టూర్పు విడిచాడు. శ్యామసుందరుడు అతను చెప్పే మాటలన్నీ వింటూ కూర్చున్నాడు. ఆమె భర్తకు ఏమి జ్ఞాపకం వొచ్చిందో ఏమో లోపలకు వెళ్ళి కొన్ని పేపరు కట్టింగులు తెచ్చి, "ఇవన్నీ ఆమె వ్రాసిన వ్యాసాలే... ఒకసారి చూడండి" అన్నాడు.

శ్యామసుందరుడు కుతూహలంతో ఆ వ్యాసాలు తిరగవెయ్యటం ప్రారంభించాడు. అతనికి ఆశ్చర్యం కలిగింది. ఆ వ్యాసాలు అనేక విషయాలకు సంబంధించినవి, పైగా ప్రతి విషయం వొక విశిష్ట దృక్పథంతో పరిశీలించబడింది. ఈమెకు ఇంత సామర్థ్యం ఎలా వొచ్చింది? ఇన్ని పనులు ఎలా చెయ్యగలుగుతూవుంది. శ్యామసుందరుడికి అంతా అయోమయంగా వుంది.

భోజనాలైనై. వడ్డన అంతా ఆమే చేసింది. చివ్వరికి పళ్ళాలుకూడా ఆమే తీసింది. అంతా ఆమె భర్త చెప్పినట్లు, అతి సహజంగా జరిగిపోయింది. ఆమె ఏపని చేసినా విడ్డూరం అనిపించదు. ఎందుకనో! భోజనాలవగానే కుంటివాళ్ళకూ, గ్రుడ్డివాళ్ళకూ ఏర్పాటైన శరణాలయానికి వెళ్ళారు. ఆమె గడపలో అడుగు పెట్టిందో, లేదో గుడ్డిపిల్లలు ఆమెను ముసురుకున్నారు. "తల్లీ, తల్లీ" అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఆమెను ముట్టుకుంటేనే జన్మ తరిస్తుందన్నంత పవిత్రభావంతో మసిలారు. ఆమె వాళ్ళని తన సొంత బిడ్డలకంటే ఆప్యాయంగా చూచింది. వాళ్ళతో వున్నంతసేపూ ఆమె తన్ను తాను మరచిపోయింది. ప్రపంచాన్ని చూడలేని వాళ్ళ స్పర్శకు ఆమె కరిగి నీరయింది. రూపరహితమైంది. ఏకధారగా ఆమె కళ్ళవెంట నీరు కారింది. ఆమెకిది గమనంలో వున్నట్లులేదు. వొకరిని పలకరించింది. ఒకరిమేను నిమిరింది. ఒకరి తల సవరించింది. ఆ దృశ్యం చూచి, శ్యామసుందరుడు కన్నీరు కార్చకుండా వుండలేకపోయాడు. కన్నీరు కార్చటం సహజమే అనిపించింది. అతని మనస్సు వర్షం కురిసిన మేఘానికివలె తేలికపడింది. అక్కడనుంచి వారు మహిళా సమాజానికీ, సహకార వ్యవసాయ కేంద్రానికీ వెళ్ళారు. కొంతమంది బీదప్రజల ఇళ్ళకు వెళ్ళారు. ప్రతి చోటా ఇదే ఆప్యాయత ఇదే ఆగ్రహీత. ఆమె

ఎక్కడ అడుగు పెడితే అక్కడ వెలుగులు ప్రసారితం అయ్యేవి. ఆ వెలుగులో మానవుల అవధులు కరగిపోయేవి. మానవులు ఆమె ముందు సహజంగా తల్లిముందు పిల్లలు ఉన్నట్లుగా, ఉండటంలో ఇక ఆశ్చర్యం ఏముంది.

"వెళ్ళివస్తాను" అన్నాడు శ్యామసుందరుడు.

"మంచిది" అన్నది ఆమె.

"మళ్ళీ కలుసుకుంటాను" అన్నాడు శ్యామసుందరుడు.

"సంతోషం" అన్నది ఆమె.

శ్యామసుందరుడు అడుగులో అడుగు వేసుకుంటూ, తోటవైపు నడిచాడు.

* * *

ఆ రాత్రి శ్యామసుందరునికి నిద్రపట్టలేదు. ఆమెలో కనపడే విభిన్నశక్తులను, సమన్వయం చేసుకోటానికి ప్రయత్నించాడు. తన మనస్సులో ఆమె సమగ్ర స్వరూపం చిత్రించుకోవాలని తాపత్రయం పడ్డాడు. కాని, ఎంత ప్రయత్నించీ లాభం లేకపోయింది. రేఖలన్నీ వున్నాయి. కాని, ఏ రేఖను ఎక్కడ పొందుపరచాలో అతనికి కుదర్లేదు. ఆరాటం హెచ్చింది. కలం తీసుకొని తన మామూలు ధోరణిలో ఇలా గిలికాడు.

నీదు ధవళ కాంతుల వాహినులకు
కాళరాత్రి హృదయము గగుర్పొడిచె
గాఢతిమిరములు, వెలుగుల వెడల గ్రక్కె
అవధులు కరిగే
ఇంద్ర ధనస్సులు వెలిసె
నీదు, జయదుందుభి నినాదములకు
శంకలు సురిగి, కళంకములు సమసె
మనసులు దద్దరిల్లె,
మరణమె బ్రద్దలయ్యె!

ఇంతవరకు వ్రాసేటప్పటికి అతనిలో అతనికే తెలియని ఆనందం పొంగిపొరల నారంభించింది. ఇంకా ఇలా గిలికాడు.

మానసిక అవధులను దాట,
కానుపించె
కన్నులను మిరుమిట్లు గొలుపు
శూన్యమ్ము వెలుగు
రూపరహితమైన ఆలోచనల కాంతి
నన్ను, ముసురుకొనియె నంత
నిశ్శబ్ద గర్జనారవముల క్రాంతి,
నన్ను ముంచెత్తెనంత
నిరతిశయానందడోలికల నూగు నాకు
భువనమంతయు నీగు రూపున గోచరించి
జోలలను పాడె, సమ్మోహనముగ.

* * *

# సారస్వత ఐతిహ్యాములలో తాంబూల సేవన ప్రశంస

శ్రీ గూడూరి నమశ్శివాయ

పలుకుందొయ్యాలి మౌళికాంతి కెనయౌ
బాగాలు నయ్యింతి చె
క్కులబోలుం దెలనాకు లయ్యువిద పల్కు
ల్వంటి కప్రంపు బ
ల్కులతోఁ గూడిన వీడియం బొసగ నాకున్
బద్మనాభార్చనా
కలనా పావన హస్త కంకణ ఝణత్కారంబు
తోరంబుగన్...

అని తెనాలి రామకృష్ణ కవి పాండురంగ మాహాత్మ్యములో తాంబూలాన్ని శారదాదేవితో పోల్చి ఇట్లు హృదయంగమంగా వర్ణించారు.

కాళిదాస మహాకవి శ్యామలాదేవి స్తోత్రం చేస్తూ...ముగ్ధమందస్మితోదార వక్త్రస్ఫురత్పూగ తాంబూల కర్పూర ఖండోత్కరే ...... అని తాంబూలరాగంతో పోల్చి వర్ణించారు.

తాంబూలము కవితా సామగ్రి. కవికీ కవితకు యెట్టి అవినాభావ సంబంధమున్నదో ఆర్ష సంప్రదాయంలో తాంబూలానికి అట్టి సమవాయి సంబంధమున్నది. తాంబూల శోభలో కవిత వికసిస్తుంది. కవితాశోభలో తాంబూలము గుబాళిస్తుంది. అందు చేతనే రసపిపాసులగు సాహిత్య స్రష్టలు తాంబూలంతో గంటం పుచ్చుకొని తాంబూలసేవనతో కవితను నడిపించి తాంబూలస్వీకరణతో గ్రంథం సమాప్తి చేశారు. కళకు వెలుగునీడ వోలె వెలారిన తాంబూలం తళ్కొత్తని ఉద్గ్రంథం లేదు. సాహితీవనంలో తాంబూలవల్లి పోయిన పోకడలు యిన్నన్ని కావు. అసలు మన దేశాన్నే తాంబూలంతో వర్ణించారు.

తమలపాకు తీగలతో పెనవేసుకొనిన పోక వృక్షములు కల్గినటువంటి ఏలక తీగలతో సమాలింగితములైన, చందన తరులతో కూడినటువంటి మలయప్రదేశము అని రఘువంశంలో ఇందుమతితో చెప్పారు. ఇట్లే తాంబూల ప్రశస్తి పుంఖానుపుంఖముగ లభిస్తుంది.

సంస్కృత సాహిత్యము తరువాత ఆంధ్ర సాహిత్యంలో తాంబూలవర్ణనలేని ప్రబంధమే కన్పట్టదు. చామకూర వేంకటకవి విజయవిలాసంలో పురవర్ణన తాంబూలంతో మిళితంచేసి వర్ణించారు.

పోకమ్రాకుల మహిమ కప్పురపు టనటి
యాకుతోటల సౌభాగ్య మందె కలదు
ప్రబలు మౌక్తిక సౌధ సంపదల మహిమ
వీటి రహి మెచ్చవలయు బో, వేయునోళ్ళ

అన్నారు. అనంతామాత్యుడు భోజరాజీయంలో...ఒడలికి హితమగు తాంబూలమనుభవింపుడు మేలు కనుడు ప్రీతి అని ఉపదేశించారు.

కళాపూర్ణోదయంలో పింగళి సూరన్న గారు తాంబూలాన్ని ప్రేమ విజయసాధన ప్రక్రియగా ప్రయోగించారు. సుగాత్రికి విముఖుడుగా నున్న భర్తను వశపరచుకొనుటకు ఉపాయము బోధిస్తూ తల్లి...

గారామున తోడ్తోడన
రా రమ్మన దనుచు మగిడి రానేటికి గ
ర్పూరంబుతోడి బాగా
లీగాదో ఆకుమడిచి యీరాదో చెలీ...

అని కూతునకు ఉపదేశం చేస్తుంది. తాంబూలం ప్రేమసాధన ప్రక్రియ అనే విషయం రంభానల కూబర విలాసంలో...

విని మోద మెసగంగ వనజాక్షి తములంబు
గొని చెంత నిలుచుండి కొమరు మిగుల
తన గళంబున కిది దగునె సాటి యటంచు
ఖండము గ్లావించి క్రముకములను

తన కక్షములకిది యనయంబు తుల్యమై
వంచు కొను తమలపాకుల నొగి
దలల ద్రుంచుచు నీనియలు దీసి తుదవుచ్చి
ముక్తామణీ చూర్ణము వెలయనిడి

చంద్ర శకలల వంగముల్ చాల బెట్టి
దిట్టతనమున గట్టిగా జుట్టి మట్టు
లేని ప్రేమ నొసంగెను మేన బులక
లొదవ నత్తరి నలనికి నొప్పమీర

అను విధంగా నలకూబరుణ్ణి వశపరచుకొంటుంది.

ఇక శ్రీనాథుని చేతిలో తాంబూల వర్ణన చిత్ర జల్లులా చిగిర్చింది. భీమ పురాణంలో శ్రీకృష్ణుని స్తోత్రం చేయుచు

బాలిక మోము మత్తవనబర్హికిశోరకలాస్యలీల బై
వాలిది పచ్చ కప్పురపువాసన తోడి ముఖార
విందము తాం
బూలపు మోవి మోవిసయి మోపుట రాధకు
నిచ్చు ధూర్త గో
పాలుడు బ్రోవు గావుత ... అన్నారు, తాంబూలానికి బజారు వెళ్లి

తొలకరిమించు తీవగతితోప దుకాణము మీద
నున్న యయ్యలికుల వేణితో తమలపాకుల
బేరము లాడబోయి నే వలచుట కేమి? ...

అనారు. ఆ నాడు కూడా కిల్లీకొట్లపై జవరాండ్రు కూర్చొని తమలపాకుల బేరం చేయటం ఉండేడిది గాబోలు.

క్రీడాభిరామంలో శ్రీనాథుని తాంబూలం ఇంకా రసవత్తరంగా నడిచింది. అభిసారానికి విటులు బయలుదేరారు. పూటకూళ్ళ యింటి ముందు కరణదేశపు జారుడు ఎదురుగాగ ... వీడిదె తెల్లనాకులను వీడెము సేయుచు వీధివచ్చుచున్నాడు ... అన్నారు. అంటూ నాయకులు యింకో నెరజాణ ఇంట్లో ప్రవేసించారు.

వీడెము తెత్తునో, పసిడి వీణియ మీటుచు ప్రొద్దుపుత్తునో, అంటూ కరపద్మంబున పైడి పళ్లెరమునం గంధాక్షతల్ పచ్చికప్పురపున్ వీడెము గొంచు గ్రొత్తమడుగుం బొన్పట్టు నీరంగితో మురిపెంబొప్పగ వచ్చె అని ఆ వధూటిని వర్ణించారు.


ఇట్లు ప్రాచీన ఆంధ్ర సాహిత్యంలో తాంబూలం తలమానికమైంది. వర్ణనాధిక్యమును ప్రశంసాప్రాముఖ్యమును పొందియున్న ఘట్టాలు పరశ్శతాలుగా వున్నాయి.

తాంబూలం అనేది ఏకవచన ప్రయోగం అయినా అది బహురసరచనా సమ్మిళితమైన ఏక పదార్థం. ఆకు వక్క సున్నము కాచు మొదలైనవి ప్రధానంగా తదితర ద్రవ్యాలు రుచికి సువాసనకు క్రిమిహరమునకును ఏర్పడి ఉన్నాయి. యీ సుగంధ ద్రవ్యాలు తాంబూలానికి మాత్రమే నేస్తాలుగా రసపిపాసులు చెప్పనప్పటికి యివి దేశాలను జాతులను సంస్కృతిని కూడా మైత్రీబద్ధం చేసినటువంటి గాథలు చరిత్రలో అనేకములు న్నాయి. నేడు ఇండోనేషియా అని పిలువబడే ద్వీపసంచయం భారతేతిహాసంలో సుగంధ ద్వీపాలుగా పేర్కొనబడ్డాయి. లవంగాలు యాలకులు మొదలైనవి భారతదేశపు తమలపాకులకు జోడై భారతీయ సంస్కృతిని ఆకళింపు చేసుకొనిన ఆ ద్వీపాల చరిత్ర విన ముచ్చట కల్గుతుంది.

ఇంక మన చరిత్రలో కూడా తాంబూలం సాధించిన విజయగాథలు కొన్ని ఉన్నాయి. 13 వ శతాబ్దమధ్యమందు శ్రీ ప్రతాపరుద్ర సార్వభౌముని ఆస్థానంలో యిన్నూరుగురు ప్రబంధకవు లుండెడివారు. అందు మంగళపల్లి భాస్కరుడు అను మహాకవి ముఖ్యుడు. ఒక దినమున ప్రతాపరుద్రుడు నవరత్నఖచితమైన బంగారు పళ్లెరమున అమూల్యాభరణములను కర్పూర తాంబూలమునుంచి పిలిచిన కవు లందరిలో ఎక్కువ రసవంతంగా కవిత్వం చెప్పి ఆ తాంబూలపు పళ్ళెరమును స్వీకరించినట్లు ఒక యితిహాస మున్నది. నాటినుండీ ఆ అగ్రతాంబూలము నందిన భాస్కరుడు హళక్కి భాస్కరుడు అని పిలువబడ్డాడు. హళక్కి అనగా కన్నడమున తాంబూలమని అర్థము. ఆ నాటి అతని కవితా విజయానికి తాంబూలము బిరుదు నామమైనది.

ఇక విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలవారి పరిపాలనలో తాంబూలము ఒక పరిపాలనా శాఖ గౌరవాన్నే సంపాదించుకొన్నది. రాయలవారి పరిపాలనా శాఖలో తాంబూల సుగంధవస్తు శాఖ ఒకటి కలదట. ఆ శాఖ అడపం తిమ్మనాయణ్ణి చేతిలో నుండెడిదని ఆముక్తమాల్యద చెప్పుతోంది. అడపం అనగా వక్కలు ఆకులు మొదలైన తాంబూల ద్రవ్యాలుంచుకొనే సంచి. అడపపుగత్తె అను పేరుతో రాయలువద్ద తాంబూలమిచ్చుటకు ఒక ఉద్యోగిని ఎప్పుడూ వెంట ఉండెడిదట. తాంబూలమివ్వటానికి స్త్రీయే ఉండాలని వాత్స్యాయనం చెపుతోంది. యీ తాంబూల సుగంధ శాఖను గూర్చి ...

కొమరగిరి నృపవసంతా
గమకేళీ గంధసార కస్తూరీ కుం
కుమ కర్పూర హిమాంభ
స్సముదంచిత బహు సుగంధశాలాధ్యక్షా ...



అను పద్యం ధ్రువపరుస్తోంది. రాయలవారు **యుద్ధములకు** వెళ్ళు సైన్యాధ్యక్షులకు వీర తాంబూలం యిచ్చి పంపెడివారు. యీ విశేషమును వర్ణించుచు రాయవాచకమున యిట్లు కలదు.

పెమ్మసాని రామలింగం నాయుడు అమర నాయకంవారు, తమతెగ కమ్మదొరతనాలవారిని పిలిపించి వారలకు చెయ్యెత్తిమొక్కి ... రాయలవారు ఆకువక్క యిచ్చి పంపగా వస్తిమి, ఈ బహుమానం మీది... అనిచెప్పి దండును చేర్చుకొని యుద్ధమునకు వెళ్ళి తురుష్కులను తరిమివేసినట్లుగా అందు కలదు.

రాయలవారు కళింగదేశ విజయయాత్రకు బయలుదేరి వెళ్ళబోతుండగా ... శ్రీ తిరుమలదేవి మహారాణీ వారు ...

వరమతి సద్గుణప్రకటవైభవ నిర్జిత శారదాంబ యౌ
తిరుమలదేవి కప్పురపు దీవెన వీడె మొసంగి
పంపగా
నరవరమౌళి దివ్య శకునమ్ములు గన్పడ
భద్రదంతిపై
సరగున నెక్కి ఛత్రమును చామరముల్
మెరయంగ నెంతయున్ ...

అని దీవెన వీడెము యిచ్చి పంపినదట. రాయలనాటి కాలంలో తాంబూల రుచి చూచిన అబ్దుల్ రజాక్ అనే పారశీకపు రాయబారి, పెయాస్ అను తెల్లదొర దానిని వేనోళ్ళ పొగిడి యున్నారు.

ఇట్లు చారిత్రకమైన విశేషాలు మాత్రమే కాదు. చరిత్రలోను ప్రముఖుల ప్రముఖ సన్నివేశాలకు సంబంధించిన తాంబూల చాటువులు

అనేక మున్నాయి. విజయనగరమున శ్రీకృష్ణదేవరాయల కాలము తంజాపురి రఘునాథరాయల కాలము మధుర నాయకుల కాలమున శ్రీ విజయరంగ చొక్కనాథుని కాలము శారదాదేవికి ప్రముఖ రంగస్థలములైనవి. శ్రీ విజయరంగ చొక్కనాథుని కొలువులో శ్రీ సమ్ముఖం వేంకట కృష్ణప్పనాయకుడను మధుర కవి విజయరంగ చొక్కనాథు వర్ణించుచూ...

ఇమ్ముగ గమ్మని వీడెము
కొమ్మల, కొమ్మ నిపుడేలు కొమ్మనిశము, కో
పమ్మేరాయా చెలి నీ
సొమ్మేరా విజయరంగ చొక్క వజీరా...

అని చెప్పారు. శ్రీ రావు సర్వజ్ఞసింగ భూపాలుని ప్రతాపమును గూర్చి ఒక కవి యిలా చెప్పాడు.

తమ్మతమకెంత ప్రియమో
తమ్మకు చెయిసాచి రిపులు తలక్రిందై నీ
తమ్మపడిగాన నుందురు
బొమ్మల క్రియ రావుదాచ భూవరుసింగా...

శ్రీ బుక్కపట్నం తిరుమల తాతాచార్యుల వారని వైద్యుడు, పండితుడు, కవి ఒక రుండేవారు. వారొకరికి వైద్యము చేయగా యిచ్చెదనన్న ప్రతిఫలము యివ్వకపోయినందున ...

పచ్చడము గుప్పటాయెను
విచ్చలవిడి తులసి పత్రి విడియంబాయెన్
రచ్చల నగుబాటాయెను
అచ్చన్నా నీదు కీర్తి యట్టిట్టాయెన్...

అని చెప్పినట్లు ఒక చాటువు ప్రచారంలో నుంది. పిల్లలు పొడుపు కథలు చెప్పుకుంటారు. ఒకరు కథ పొడవగా వేరొకరు అర్థం చెప్పాలి ..

పండగ సెండిన దొక్కటి
పండక మరి పచ్చి దొకటి వడి గాలినదీ .
దిండికి రుచియై యుండును
మండలమున జనులకెల్ల మహిలో వేమా ...
ఇట్టిదే మరియొకటి ...

శిలవృక్షలతల బుట్టిన
చెలువలు మువ్వురును గూడి శుభలగ్నమునన్
తలవాకిట రమియింతురు
చెలువలరగ దీని తెలియు సుగుణులు గలరే ...

పిల్లలకు సాహిత్య పరిచయం చేయుటకు గాను యిలాంటి పద్యము లెన్నిటినో చెప్పి మన ప్రాచీనులు పిల్లలకు తెనుగుభాషమీద మక్కువ కలిగించారు. తాంబూలాన్ని అన్యాపదేశంగా పెట్టుకొని జరిగిన శృంగారరస సంభాషణ. ఒక పల్లెటూరి రసికురాలు నీలాటి రేవుకు వెడుతూంది. త్రోవలో రచ్చచెట్టు క్రింద తమలపాకులు నములుతూ నడ్డిగము వేసుకొని ఒక రసికుడు కూర్చున్నాడు. రసికు డంటాడు ...

నీలాటి రేవుకు పోయేటి నెరజాణ కన్యా
నీ కురులు కోసి ముడిచారా? కోయక ముడిచారా?

అనగా ఆ నెరజాణ సమాధానం చెపుతుంది ...

ఎండు మానుమీద కూచొని పండుటాకులు
నమిలే రాజా
నిన్ను మేస్తే కట్టారా? మేయకపోతే కట్టారా ..?

అన్నదిట. యీ సామెత యిప్పటికీ పల్లెపట్టులో చెప్పుకుంటూంటారు.

పూర్వము థగ్గుల్లు, పిండారీలు అనే దోపిడి దండ్లు గ్రామాలపైబడి యెన్నో ఘోరాలు చేస్తూండేవారు. వీరు వంచనగా ప్రజలలో తిరుగుతూ దూర ప్రయాణాలు చేస్తుండేవారు. అట్టి ప్రయాణాలలో, మార్గమధ్యమందు కొన్ని సాంకేతిక స్థలాలలో.

భాయీ తమ్మాలావో ... పాన్ లావో ... అని కేక వేసేవారు. తాంబూలం యిస్తారా అని ప్రయాణీకులు ఆశపడుతున్నంతలో నల్గురూ చుట్టుముట్టి కట్టి చిత్రవధ చేసి దోపిడి చేసెడి

# గ్రీష్మము - 3

శ్రీ కందుకూరి రామభద్రరావు.

తీరెండతాకి పృథ్వీలలామ వెలార్చు
వేడి నిట్టూర్పు టావిరులు నిండ,
శుష్కపత్రాళితో సురగాలి కంబముల్
నిలుపంగ దారు సన్నిభముకాగ,
తపన సంతాపవిదారితానన లోల
జిహ్వాలై మృగములు చెట్లగొలువ,
కనుమొగుడ్చుక యిండ్లు గర్భనివాసుల
వడగాడ్పు దాడికి బడగ బట్ట.

ఊష్మపట మెత్తి తీంద్రించి యుగ్రకరుడు
గగన ఘంటాపథా ధ్వగుం డగుచు సాగి
సాయపడ గ్రీష్మ దేతెంచి జగతి పైని
ఏలుబడి జాటుకొనె దుర్నిరీక్ష్యుడగుచు.



కాలిన భ్రాష్ట్రి మీ పుడమి గప్పిన
రీతి నభంబు దోప, సం
చాలన మేది యూష్మమున సంకటపెట్ట
సమీరణుండు, తా
పాలకు నుస్సురుస్సురని ! ప్రాణి సమూహము
లోర్వలేక ప్రా
ణాలరచేత గైకొని క్షణంబులు పుచ్చె
నిదాఘ సాంధ్యలన్ .

వేకువజామునందు బ్రభవించిన చల్లని
పిల్లగాలి తా
పాకుల మానవాళి కొక హాయిని
గూర్చినయంతలోన న
ట్టాకుల బెట్టునద్ది యుదయాద్రి సముద్గత
తిగ్మరోచులన్
గాకలుదేరి గ్రీష్మ విభు కర్కశ శాసన
పాలనంబునన్...

తనకుతానే పుట్టి దహియింప నిండ్లగ్గి,
కట్టు గుడ్డ మిగుల్ప గగనమయ్యె.
ఈ చెవి గాడుపు లాచెవికెగగొట్ట, వడ
గొట్టి ప్రాణాలు వదలుకొనిరి.
ఏమూల మూలల నివిరిపోయెనొకాని,
నోరైన తడుపంగ నీరు లేదు,
ఏటి నెన్నడిమిని ఇసుక తిప్పలలోన,
గాలిదుమ్ములు రేగి కప్పె నరుల.

# గ్రీష్మము - 3

శ్రీ కందుకూరి రామభద్రరావు.

బీరెండతాకి పృధ్వీలలామ వెలార్చు
వేడి నిట్టూర్పు టావిరులు నిండ,
శుష్కపత్రాళితో సురగాలి కంబముల్
నిలుపంగ దారు సన్నిభముకాగ,
తపన సంతాపవిదారితానన లోల
జిహ్వాలై మృగములు చెట్లగొలువ,
కనుమొగుడ్చుక యిండ్లు గర్భనివాసుల
వడగాడ్పు దాడికి బడగ బట్ట.

ఊష్మపట మెత్తి తీంత్రించి యుగ్రకరుడు
గగన ఘంటాపథా ధ్వగుం డగుచు సాగి
సాయపడ గ్రీష్మ దేతెంచి జగతి పైని
ఏలుబడి జాటుకొనె దుర్నిరీక్ష్యుడగుచు.



కాలిన భ్రాష్ట్రి మీ పుడమి గప్పిన
రీతి నభంబు దోప, సం
చాలన మేది యూష్మమున సంకటపెట్ట
సమీరణుండు, తా
పాలకు నుస్సురుస్సురని ! ప్రాణి సమూహము
లోర్వలేక ప్రా
ణాలరచేత గైకొని క్షణంబులు పుచ్చు
నిదాఘ సాంధ్యలన్. .

వేకువజామునందు ప్రభవించిన చల్లని
పిల్లగాలి తా
పాకుల మానవాళి కొక హాయిని
గూర్చినయంతలోన స
ట్టాకుల బెట్టునద్ది యుదయాద్రి సముద్గత
తిగ్మరోచులన్
గాకలుదేరి గ్రీష్మ విభు కర్కశ శాసన
పాలనంబునన్

తనకుతానే పుట్టి దహింయింప నిండ్లగ్గి,
కట్టు గుడ్డ మిగుల్ప గగనమయ్యె
ఈ చెవి గాడుపు లాచెవికెగగొట్ట, వడ
గొట్టి ప్రాణాలు వదలుకొనిరి,
ఏమూల మూలల నివిరిపోయెనొకాని,
నోరైన తడుపంగ నీరు లేదు,
ఏటి నెన్నడిమిని ఇసుక తిప్పలలోన,
గాలిదుమ్ములు రేగి కప్పె నరుల.

## గ్రీష్మము - 3

అన్న గ్రామీణ వార్తాళు లెన్నొ పుట్టి
చినుకుకోసము కన్నులు చిల్లు పడగ
నాకసము దారి వీక్షింతు రహరహంబు
మండు వేసవి తీవ్రత గ్రుగ్గి జనులు. ..

స్నాన కషాయవాసనలు గుబాళించు
క్రొమ్ముడీ మల్లెపూ గుదులు వ్రేల,
ధవళ తన్వంశుకాంతర యౌవన శ్రీల
బిగువు పొంకపు గుట్టు వెలికి దోప,

ప్రస్ఫుటాధరశీధు పరిణామ రుచులతో
ముగ్ధమోహన హాసములు నటింప,
పాణి పద్మార్పిత వ్యజన వీజనములు
కంకణానుకృతిని గదలి యాడ.

కలువ కన్నుల నోరచూపులు నిగుడ్చి
వెన్నెలబయళ్ల బాన్పుల ప్రియులతోడ
సరస మాడెడు యువతులు చాటు లేక
నంగుడీ రుచి సత్ర్ర సన్యాసికాడె ..

పగులుట కోర్చె నోర్పుమెయి పంట
పలంతి సుధామయాన్నమ
జగతికి బంచిపెట్టి పృధుసాగర నీరము
క్రాగి యావిర
గగనము నిండు దొల్కరిని గాండము
నింప నదీ నదంబు
తగ గను హ్రస్వమానసము ధాత
వినిర్మిత లోకవృత్తముల్.



# తెలుగు సాహిత్యోద్యమాలు - భావకవిత్వోద్యమము

శ్రీ తెలికిచర్ల వెంకటరత్నం.

భావ కవిత్వము ఒక మహోద్యమంగా మహోద్ధృత ప్రవాహంగా వచ్చి దేశము నలుమూలలకూ విస్తరించి ప్రజలలో సాహిత్యాభిరుచిని విస్తారంగా పెంపొందించింది. ఎందరెందరో యువకవులు, నవకవులు వివిధరీతుల కలగీతా లాలపించి సహృదయ లోకాన్ని రాగరంజితము చేశారు. సాహిత్య రంగంలో ఒక నూతనయుగము ప్రవేశపెట్టారు. ఇది యీ శతాబ్దిలోనే నేటి మన తరములో మన కళ్ళయెదుట పుట్టి పెరిగి విస్తరించినందువల్ల దీని గుణదోషాలూ దీని చరిత్రా పేర్కొనడములో కొంత కష్టము కొన్ని చిక్కులు ఎదుర్కొనడము సహజం.

భావ కవితోద్యమము గురించి ఒక్క దీని మాటే కాదు ఏ ఉద్యమము గురించి అయినా సరే... పరిశీలనగా తెలుసుకోవలెనంటే దాని పుట్టు పూర్వోత్తరాలు గమనించాలి. దాని పూర్వరంగ మెట్టిదో, దాని అవతరణానికి దారి తీసిన పరిస్థితులేవో, దాని వైతాళికు లెవరో అవగాహన చేసుకోవాలి.

సాహిత్యము ప్రవాహ గతితో సాగిపోయే జీవనది వంటిది. జీవనది కాలప్రభావాన్ననుసరించి ఒకప్పుడు వడిగల వెల్లువగాను, ఒకప్పుడు కలకదేరి ప్రశాంతంగాను ఇంకొకప్పుడు శుష్కించి నీరసంగాను ప్రవహించే రీతిగానే, సాహిత్యవాహినిలోనూ వివిధావస్థలు గోచరించినా నదీజలాలలో వలెనే దాని ప్రకృతిలో స్వభావంలో ఏకత ఉండనే వుంటుంది. ఒకప్పుడు మాత్రము కాల వైపరీత్యమువల్ల సుదూరప్రాంతాల నుంచి కొత్తనీరు పాయలు పాయలుగా తెరలు తెరలుగా వచ్చి చేరినప్పుడు నది గట్లు తెంచుకొని హద్దులు అతిక్రమించి కొత్త మర్యాదలు కూర్చుకొని గతిభేదముతో ప్రసరిస్తుంది కొత్తనీరు ఎంతగావచ్చినా సంప్రదాయ సిద్ధమైన పాత నీటితో కలిసిపోయి మేలికలయికవల్ల నూతన రుచులు వెలార్చుతుంది. ఇట్టి వైపరీత్యము సాహిత్య స్రవంతిలో తటస్థించినపుడు దాన్ని విప్లవాత్మక మహోద్యమంగా వర్ణిస్తారు.

శ్రీకృష్ణదేవరాయల కాలమువరకూ క్రమక్రమ ప్రవర్ధమానమై కొత్తరీతులూ పోకడలూ అందచందాలూ అలవర్చుకొంటూ వచ్చిన ఆంధ్ర సాహిత్యము ప్రబంధయుగము చివరిదశలో దేశస్థితిగతులతోపాటు అధమావస్థకు వచ్చింది. నాయకరాజుల కొలువులో మెరుపు మెరిసినట్లు ఒక వెలుగు వెలిగినా తిరిగీ పతనావస్థకే వచ్చింది. బ్రతుకు పరాధీనమైనప్పుడు విద్యలు కళలు సన్నగిల్లిపోవడము సహజమేకదా. స్వతంత్ర రచనలకు బదులు నిర్జీవానుకరణములూ, అనువాదములూ వ్యాఖ్యానాలూ మాత్రమే నాటి రచనలు. భారతదేశము బ్రిటిష్‌వారి అధీనములోనికి సంక్రమించి పరప్రభుత్వము నెలకొన్న నాటికి పతనము పూర్తి అయింది. విద్యలకూ, కళలకూ పూర్వము నుండీ ఉంటున్న వ్యవస్థలూ అందచందాలూ ఆశ్రయమూ నశించాయి

అయితే ౧౮౫౭ ప్రాంతములో యూనివర్సిటీ విద్య ప్రారంభము కావడంతో ఒక కొత్త వెలుగు ఒక కొత్త ఆశ అంకురించాయి. నూత్న

విజ్ఞానము పాశ్చాత్య నాగరక దేశాల సాహిత్యము చరిత్ర సంస్కృతి మొదలయినవి మనవారికి అంది వచ్చాయి. దీనికి తోడు ఉన్నత విద్యాభ్యాసానికి మనవారు పాశ్చాత్య దేశాలకు పోయి ప్రజ్ఞావంతులై అక్కడి జీవితవిధానము, సంప్రదాయాలు, పద్ధతులూ మంచివీ చెడ్డవీ కూడా దిగుమతి చేశారు. దీని ఫలితంగా ప్రయోగమూలకమయిన పరిశోధన, తత్త్వపరీక్ష సత్యాన్వేషణము ఆత్మప్రమాణబుద్ధి భావస్వాతంత్ర్యము మొదలైన లక్షణాలతో నవవికాస మారంభమయింది. రాజా రామమోహనరాయలు నవభారతాని కంకురార్పణ చేసి విశాల మానవదృష్టితో ఏకేశ్వర వాదమూ సకల మానవ సౌభ్రాత్రమూ స్థాపించి బ్రహ్మసమాజము నెలకొల్పడముతోనూ యీశ్వరచంద్ర విద్యాసాగరులు స్త్రీవిద్య స్త్రీ పునర్వివాహోద్యమము ప్రారంభించడంతోనూ సంకుచిత మనస్తత్వాలకూ, మూఢ విశ్వాసాలకూ గట్టిదెబ్బ తగిలింది. భారతజాతి స్తబ్ధతనుంచి మేలుకొన్నది.

తెలుగుదేశమును మేల్కొల్పినవాడు వీరేశలింగం పంతులు. పాశ్చాత్య సాహిత్య విద్యా విజ్ఞాన విజయాలు తన రచనలద్వారా తెలుగువారికి వెల్లడిజేసి, సంఘ దురాచారాలు ఖండించీ మూఢ విశ్వాసాలు అవహేళనచేసీ అవినీతి బయలుపెట్టీ తెలుగువారు తమ జీవితము సరిదిద్దుకొని తోటిమానవులతో తలయెత్తుకొనేవారినిగా చేశారు. బ్రహ్మసమాజ మవలంబించారు స్త్రీ జనోద్ధరణానికి పూనుకొన్నారు. వారి కృషి ఫలితంగా స్త్రీవిద్య వ్యాప్తికి వచ్చింది. స్త్రీ పునర్వివాహాలు నిరాటంకంగా సాగుతూ వచ్చాయి. స్త్రీలలో నైరాశ్యము అసహాయత అంతరించినాయి. చీకట్లు చెదిరిపోయి ఉదయకాంతులు ప్రసరించాయి. ఈ సమయంలోనే జరిగింది వంగదేశవిభజనము. దానిని ప్రతిఘటించడానికి చెలరేగిన వందేమాతరం ఉద్యమము తెలుగుదేశములోనూ వ్యాపించి విస్తారమయిన రాజకీయచైతన్యం కలిగించింది. ఇట్లు రాజకీయ సాంఘిక మత విషయాలతో నూతనోత్తేజనము కలిగి తెలుగుజాతి జాగృతమయింది. మన నవయువ యుగోదయానికది నాంది.

వీరేశలింగం పంతులుగారి కృషిఫలితంగా విస్తరించిన నవచైతన్యంవల్ల సాహిత్యములో అభిరుచి ఆసక్తీ ఏర్పడ్డవి. అంతలో తిరుపతి వెంకటకవులు శతావధాన దిగ్విజయ యాత్రలు సాగించగా కవిత్వాభిరుచి మిన్నుముట్టి పద్యము లల్లవలెననే అభిలాష బహుజన వ్యాప్తమయి బాలకవులు, వృద్ధకవులు, జంటకవులు, సోదరకవులు, అష్టావధానులు, శతావధానులు ఊరూరా బయలుదేరినారు. నాటక ప్రదర్శనాలు కూడా ఆ సమయములో ఊరేగింపులు సాగించాయి. నవలా నాటకాదుల రచన, గ్రంథమాలల ప్రచురణము, భాషాసాహిత్య విషయాలలో, వాదోపవాదములు పరిశోధనలు, వాటి ఫలితంగా ఉత్పన్నమైన సమస్యలను గూర్చి సిద్ధాంత రాద్ధాంతాలు, సభలు, సమావేశాలు, పత్రికా ప్రకటనము అదీ ఇదీ ఏమిటీ సర్వవిధములా సాహిత్యరంగంలో విస్తార సంచలము కానవచ్చినది. కట్టమంచి రామలింగారెడ్డిగారి కవిత్వతత్త్వ విచారము సాహిత్య విమర్శలో కొత్త పద్ధతులు సిద్ధాంతాలూ ప్రవేశపెట్టి దూషణ భూషణ తిరస్కారాలతో మన ప్రాచీన సాహిత్యాన్ని విమర్శించి ఒకకొత్త సాహితీదృష్టికి మార్గదర్శకమైనది. ప్రబంధాదులలో విచ్చలవిడిగా చెలరేగిన అసభ్య శృంగారముమీద నవ్యులకు హేయభావము కలిగింది. విద్యాబోధలోనూ కొత్త దృక్పథం ఏర్పడ్డది. పూర్వపద్ధతి ప్రకారము పదస్వరూపము, వ్యాకరణ నియమాలు ఛందో లక్షణాలు అలంకారాలు మొదలయిన బాహ్య విషయముల బోధనకే ప్రాధాన్యము ఉండగా కథా సంవిధానము, అంగాంగి సామరస్యము భావము రసము మొదలయిన విషయ

ములను గూర్చి స్వతంత్ర విచారము విమర్శ జ్ఞానము పెంపొందించడానికి ప్రాధాన్యము వచ్చింది. జ్ఞాపక శక్తికి బదులు మనో వికాసానికి ప్రాధాన్యము వచ్చింది.

కళాశాలా విద్యార్థుల నూతనపద్ధతులలో కావ్యవ్యాసంగం చేయడంవల్ల అటు షేక్స్పియర్, మిల్టన్, కీట్స్, షెల్లీ, బ్రౌనింగ్, వర్డ్స్‌వర్త్, టెన్నిసన్ మొదలయిన ఆంగ్ల కవులవీ, నన్నయ, తిక్కన, శ్రీనాథ, పోతన, పెద్దన, సూరన, రామకృష్ణాది ఆంధ్ర కవులవీ కావ్యాలు ఎంతో ఆప్యాయంగా సవిమర్శంగా క్రొత్తదృష్టితో చదివి ఆ యా కవులు తన అభిమాన కవులని సగర్వంగా షేగ్కొంటూ నూతన దృష్టితో, కావ్యసృష్టికి పూనుకొనేవారు.

ప్రాచీనాంధ్ర సాహిత్యానికి సంస్కృత సాహిత్యమే మాతృక. అదే ఆదర్శము. ఆ సాహిత్య లక్షణమే మనదిన్ని, కాని యీ శతాబ్దారంభంలో ఇంగ్లీషు సాహిత్యమూ, దానిద్వారా అందుబడిలోనికి వచ్చిన గ్రీకు, లాటిన్, ఫ్రెంచి, జర్మను మొదలగు అనేక పాశ్చాత్యదేశాల సాహిత్యాలున్ను ఆస్వాద్యములై ఉత్తేజను కలిగించి అనుకరణ పాత్రములైనవి. తెలుగుకవి ప్రపంచ సాహిత్యసంస్కృతులు తనకు వారసత్వముగా సంక్రమించినట్లు భావించుకొని, మానవ జాతి ఉత్తమత్వము ఉత్కృష్టతా అనంతమైన అభ్యున్నతికి గల ఆశావకాశాలూ అవగాహన చేసుకొని అపూర్వభావావేశముతో గగన పథ విహార విహంగమపతిగా సంచరించ దలచాడు. వాని పూనికకు వంగదేశములో, వచ్చిన నవ్య సాహిత్యోద్యమము మిక్కిలి ప్రోహదకారి అయింది. రవీంద్రుని రచనలు ఉత్సాహము ఉత్తేజము కలిగించాయి. వాటిలోని ఆస్తికత, ఉదాత్తత, ప్రణయపవిత్రత, సహజత్వలాలిత్యములు, గూఢత, ప్రకృతి వర్ణనము, ప్రకృతికీ మానవప్రకృతికీగల సన్నిహితత్వము మొదలయినవి ఆదర్శంగా పెట్టుకొన్నాడు.

భావకవితావతరణ కిదీ పూర్వరంగము.

జీవితములో ఇన్నిన్ని విధాలుగా ఇంతటి మార్పు వచ్చినప్పుడు గొప్ప విప్లవమువల్ల సమస్తమూ తారుమారయినంతగా సంఘము మారిపోయినప్పుడు, ఆ సంఘానికీ హృదయమూ, కంఠమూ ఉత్తమ ప్రతినిధీ అయిన కవి వినిపించే కావ్యగీతాలు క్రొత్త ధోరణిలో ఉండక ఏమవుతాయి...? క్రొత్త పద్ధతిలో భావము, వస్తువు, భాష, కూర్పు అన్నిటిలోనూ క్రొత్తదనమే క్రొత్త రచనలు సాగించినవారు అసమర్థులా...? చక్కని సంస్కారము కలవారు, హృదయం కలవారు, సంస్కృతాంధ్రాంగ్ల సాహిత్యాలలో మంచి ప్రవేశం కలవారు, చురుకైన వారు ప్రతిభావంతులు, ఇంచుమించు ఒకేసారి దేశములో అన్ని ప్రాంతాలలో ఇట్టివారు తలఎత్తి విడివిడిగా రచనలు సాగించి పత్రికలన్నిటిలోనూ ప్రముఖస్థానము ఆక్రమించగా భావకవితోద్యమము మహా ప్రవాహంగా తోసుకొని వచ్చింది.

భావకవితా రచనకు ఆద్యులూ మార్గదర్శకులూ గురజాడ అప్పారావుగారు, రాయప్రోలు సుబ్బారావుగార్లు. యీ ఉద్యమానికి వీరిద్దరిలో ఎవ రెంతవరకు మూలపురుషులు అనే విషయములో అభిప్రాయము ఏక ముఖముగా లేదు.

అప్పరాయకవి ఆంగ్ల సారస్వతంలో కూలంకష ప్రజ్ఞ ఆర్జించి దానిలోతుపాతు లెరిగి తెలుగువారికి దానిలో అభిరుచి కలిగించిన సాహిత్యాచార్యుడు. ఆంగ్లములో చక్కని పద్యరచన చేసినవాడు. ఆ సాహిత్య రీతులు తెలుగులో ప్రవేశపెట్టి కవిత చెప్పినవాడు. నవ్యాంధ్ర కవితాచార్యుడు. విప్లవమార్గము ప్రవేశపెట్టి, పూర్వకవిత్వానికి భిన్నంగా వ్రాసినవాడు. కృత్రిమముకాని పలుకుబడితోను నుడికారాని కను-

పుగా ముత్యాల సరాలనే ఛందస్సుతో హృదయానికి సూటిగా తాకి హత్తుకొనే రీతిగా ప్రబోధగీతా లాలపించారు.

'ఎల్ల లోకము ఒక్క యిల్లయి
వర్ణభేదము లెల్ల కల్లయి
వెల నెరుంగని ప్రేమబంధము
వేడుకలు కురియవలె' ... నని ...
'మరులు ప్రేమని మదిదలంచకు ...
మరులు మరలును వయసుతోడనె
మాయమర్మము లేని నేస్తము
ప్రేమ అది నిలుచు' ... నని ...
దేశమందభిమానము మొలకెత్తవలె'...నని
దేశమంటే మట్టికాదు, మనుషు'...లనీ...

కవిత్వంలో తొలిసారిగా కొత్త బాణీ వినిపించినవారు అప్పరాయకవి. ప్రకృతియే సాహిత్యోపాసకులకు ఉపాస్యదేవత అని రసగుళికల వంటి నీలగిరిపాటలో నిరూపించాడు. వీరి కవిత దేశికవితాచ్ఛాయలతో వెలసింది.

రాయప్రోలు వారి కవిత మార్గదర్శిని ఆశ్రయించి చాలావరకు పూర్వకవి సంప్రదాయసిద్ధమయిన భాష, ఛందస్సు స్వీకరించింది. భావచిత్రణములోను, రసకల్పనలోను సమకాలిక సాంఘిక సమస్యలెత్తుకొని సముచితముగా నిరూపించడములోనూ నవ్యత ప్రవేశపెట్టి తెలుగుతనము ఉట్టిపడేలాగున ఆంధ్రదేశ ఆంధ్రభాషా గౌరవమాధుర్యములు కీర్తిస్తూ కావ్యాలు వ్రాశారు. దంపతీనిష్ఠముగానో పరకీయముగానో భోగాత్మకమైన శృంగారము పూర్వులు అతిగా వర్ణించగా వియోగమాధుర్యము, అమలినాను రాగము, వాత్సల్యము మొదలుగా గల వివిధ రూపాలతో ప్రణయము చిత్రించి స్త్రీమూర్తిని గౌరవాదర పీఠమెక్కించారు. ప్రకృతిని సౌందర్యాధిదేవతగా చిత్రించి ప్రణయలీలాత్మకముగా వర్ణించారు. వీరి అభినవస్వర కల్పనలో మాధురీ దర్శనము చేసి ప్రేమమంత్ర మహోపాసనామయులయిన నవ్యులు సౌందర్యార్చన చేశారు.

పద్యకవులు రాయప్రోలువారినీ గేయకవులు గురజాడవారినీ ఒరవడిగా పెట్టుకొన్నట్లు స్థూలంగా పేర్కొనవచ్చును.

ఈ కవిత్వానికి భావకవిత్వమనే పేరు రావడానికి రాయప్రోలువారే కారకులనీ 'భావగీతమును' అనీ 'పాడుమమ్మా గీతా సఖీ భావపదము', అనీ పలుతడవలు ప్రయోగించడములో భావప్రధానమై గానయోగ్యమైన కవితగా యీ జాతి రచనలను వారు భావించారనీ కొందరు విమర్శకు లంటారు. ఈ పేరే స్థిరపడిపోయినా ఇది అంతగా సంతృప్తికలిగించక నవ్య కవిత, నవ్య సాహిత్యము అని ఇటీవల తరుచు వాడుతున్నారు. భావకవిత అంటే భావములేని అభావకవిత్వమనీ, దీని భావమేమి తిరుమలేశ అనే రీతిగా భావము తెలియరానిదో, అసలు భావమే లేనిదో అనీ...ఎదియో అపూర్వ మధుర రక్తి స్ఫురియించుగాని యర్థమ్ముగాని భావగీతమ్ము లివి...అనే కృష్ణశాస్త్రి 'ఆమె కన్నుల'లోని పంక్తులుల్లేఖించి ఇదంతా అర్థముకాని నిరర్థక కవిత్వమనీ ఈ కవిత్వాన్ని నిరసించేవారు నిర్వచించి విమర్శించారు. భావకవితోద్యమంలో ప్రధానంగా కానవచ్చే ఒక లక్షణమేమిటంటే దీనిని ఆస్వాదించి ఆమోదించి గౌరవించే అనుయాయులు ఎంత ప్రబలపక్షంగా నిలిచారో దీనిని తిరస్కరించి తిట్టిన ప్రతికూలురు కూడా అంత గట్టిగానూ నిలబడ్డారు...కవిత్వమంటే అభిరుచి ఉన్న వారి కందరికీ యీ భావకవిత ఆస్వాద్యము కాదు. దీని కవసరమైన అధికారము వేరు. దీని లక్షణమూ సంప్రదాయమూ తెలిసిన నవ్యాలోకముగలవారే దీనిని మెచ్చుకోగలరు.

భావకవిత్వానికి లక్షణము నిరూపించడానికి సంస్కృతాలంకారికులు చెప్పే లక్షణము ఏదీ

సరిపోదు. పాశ్చాత్య సాహిత్యాల సిద్ధాంతాలూ సంప్రదాయాలూ కూడా పరిశీలించాలి.

కవి తన హృదయములో ప్రగాఢముగా అలముకొని ఉద్వేగము కలిగించిన భావములను హృదయభారము తీరేటందుకు మనసారా పాడుకొన్న పాటలే భావగీతములు. ఎందుకు పాడవలెనంటారా ...

మావిగున్న కొమ్మను మధుమాస వేళ
బల్లవము మెక్కి కోయిల పాడు టేల ... ?
పరుల దనియించుటకొ? తన బాగు కొరకొ ?
గాన మొనరింపకె బ్రదుకు గడవబోకొ ?
అన్లే కవిన్ని.

ఒక్కొక్క పాట ఒక్కొక్క చిత్తవృత్తిని చిత్రిస్తుంది. వలపో, వలవనిచో ఖేదమో, మోదమో రాగమో ద్వేషమో ఏదో ఒక హృద్గత వికారమును పాతకునే తన ఆంతరంగిక మిత్రునిగా ఎంచుకొని వాని సమక్షాన కవి మర్మము విడిచి హృదయము వెళ్ళబోసుకొన్నట్టుగా సూటిగా పలకడమే ఉంటుందిగాని ఏదో కథ అల్లి పాత్రలు సృష్టించి వాటిద్వారా భావము ఆవిష్కరించినట్లు ఉండదు. సన్నివేశమూ సందర్భమూ సహృదయుడు ఊహించుకొని రసానుభూతి పొందవలసినదే. కాని వాటిని పేర్కొనడు ... కావ్యపరిమితి సాధారణంగా అల్పాల్పముగా వుంటుంది. వీటిని ఖండకావ్యాలన్నారు మన అలంకారికులు. ముక్తకాలతో చాటువులతో పోల్చినారు. భావ కవులు బంధ, గర్భ, చిత్ర శ్లేష కవిత్వాల జోలికిపోరు. తలతిక్క కల్పనలు చేయరు. ద్వ్యర్థి, త్ర్యర్థి రచనలవంటి సాము గరిడీలు వారికి కిట్టవు. వారి కవితా సామగ్రి ఉత్తమకవితా సంప్రదాయ సిద్ధంగా వాడుకలో ఉన్న కపురంపుంబలుకుల్ తుషార జలముల్ కల్వల్ పికధ్వాన మచ్చపు బంగారము పూవు దేనియలు జ్యోత్స్నల్ చల్లగాలుల్ మొదలయినవి.

భావకవులను ప్రకృతి పలుకరిస్తుంది. పులకరిస్తుంది. ప్రకృతిలో హృదయము లీనముచేసి ప్రకృతి రాగముతో హృదయరాగమును మేళవించి గానము చేస్తారు. ఒక కవి అన్నాడు.

భావనా బలమున్నది ప్రకృతియున్న
దిష్టముండిన పదముల కేమి కొరత...
అని. పదములు వాటంతట అవే వచ్చివాలుతవి.

ప్రకృతిశోభకు పరవశుడైనాడు కవి. భావమానంద భరితమైనది. చిత్తము ప్రేమసంసిక్తమైనది.

వర మనోహర పంచమ స్వరము నెత్తి
మధురముగ మార్దవంబుగా మంజులముగ
మానసానందకరముగా మంగళముగ
పాడవేమమ్మ కోకిలా పాడవేమె...

అని తన పాటతో కలిపి పాడడానికి కోకిలమ్మను ఆహ్వానిస్తున్నాడు. తారకలను చూస్తే కవి హృదయములో భావనక్షత్రకాంతులు ప్రసరిస్తాయి. భావకవికి ప్రకృతి సహచరుడు...ఆప్తమిత్రము...సర్వమూను.

మహోజ్వలంగా నడచిన భావకవిత్వము దేశమందంతటా సభావేదికలమీదా సాహిత్యోత్సవాలతోనూ గౌరవాదరాలు పొందింది.

కనులు విచ్చి మనసు నిచ్చి
కొంచ గలుగు
వారు తలలూచి మెచ్చు
చున్నారు దాని...



# కృష్ణవేణి మణిమేఖల

శ్రీ వింజమూరి శివరామరావు

అదిగో! అదిగదిగో!
కృష్ణవేణి మణిమేఖల ... అదిగో ...

మానవశక్తికి చిహ్నము -
మానవజాతికి భాగ్యము .... అదిగో ....

ఉత్తర దక్షిణ పథాల
కుత్తమమౌ సేతువూ -
కర్షకాంధ్ర లోకానికి
హర్ష హేతువూ .... .... అదిగో ....

భారత సౌభాగ్య భాగ్య
కారణమౌ సేతువూ -
సర్వశిల్ప వేత్తలకూ
గర్వహేతువూ .... .... అదిగో ...



# ఆంధ్ర రచయితలు - కొంపెల్ల జనార్దనరావు

## శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు

కొంపెల్ల జనార్దనరావుతో నాకు మొట్టమొదటి సారి ౧౯౨౮ వ సంవత్సరం మద్రాసులో తంబు చెట్టి వీధిలో పరిచయమైంది. ఆయేడే కొత్తగా నేను చదువుకోసం మద్రాసులో అడుగు పెట్టాను. మా నాన్న క్రిస్టియన్ కాలేజీలో నాకు బి. ఏ., జూనియర్ తరగతిలో సీటు సంపాదించి తంబు చెట్టి వీధిలోని ఫస్ట్ స్టూడెంట్సు హోమ్‌లో నన్ను ప్రవేశపెట్టి విశాఖపట్నం వెళ్ళిపోయాడు. హాస్టలులో అందరూ నాకు కొత్త. అసలు మద్రాసు నగరమే ఒక మహా సముద్రంలాగ కనిపించేది. అప్పుడు నా వయస్సు ౧౮ ఏళ్ళు, నాకంటె జనార్దనరావు ఒకటో, రెండో ఏళ్ళు పెద్ద. తంబుడు-కాదు అన్నే కాబోలు అని ఒక ఉత్తరం ముగించి సంతకం చేశాడు. వస్తున్నా. అప్పటికింకా జనార్దనరావుని ముఖస్థంగా కలుసుకోలేదు. అంతకుముందు ఒకటి రెండుసార్లతని పద్యాలు చదివాను. ఇప్పటికీ తంబుచెట్టివీధిలో ఉంటున్న ఒక సుప్రసిద్ధ మాసపత్రికలో అప్పుడే పేరుతో నాకొకానొక భావ బాంధవ్యం ఏర్పడింది. జనార్దనరావు నాకన్న బాగా పద్యాలు రాయగలడని; నాలో నేనే రహస్యంగా అంగీకరించాను. కాని నేనుకూడా అతనికేమీ తీసిపోనని నాలోని స్వాతిశయం నన్ను హెచ్చరించేది. అవి భావ కవిత్వపు రోజులు. సాహిత్య లోకంలో సాహితీ సమితి నాయకత్వమూ అందులో మళ్లీ చీలికలూ, తిరుగుబాట్లూ కొంతమంది తప్పుకోవడమూ ఇవీ ఆనాటి హెడ్‌లైన్ న్యూస్.

అంటే సాహిత్యం కోసమే ప్రత్యేకించిన దిన పత్రికలుంటేమాట! ఆనాటి సాహిత్యధోరణులన్నింటికీ స్థానం ఇస్తున్న ఒకే ఒక 'పత్రిక ఇందాకా నేను చెప్పిన పత్రిక. అందులో నీ పద్యం పడిందంటే కవిగా నీకు సాహిత్య లోకంలో జాగా దొరికిందన్న మాట. కథ పడిందంటే కథకుడుగా నిన్ను లోకం గుర్తించిందన్నమాట. విమర్శ వ్యాసం రాశావంటే, నీ అభిప్రాయాలు విలువయినవన్నమాట. నీ పుస్తకాన్ని ఆ పత్రిక మెచ్చుకున్నదంటే, నువ్వు గొప్ప రచయితవి. అటువంటి ఆ పత్రికలోనే జనార్దనరావు సబ్ ఎడిటరుగా పనిచేస్తున్నాడు. ఉండండి, ఆసంగతి నాకప్పుడే తెలియడంలేదు. ఎలా తెలిసిందో ఇప్పుడే చెప్పబోతున్నాను.

నేనూ ఈ మాసపత్రికా ఒకే వీధిలో ఉన్నాం కాబట్టి మద్రాసు రాగానే నేను చేసిన మొదటి పనుల్లో మొదటిది ఈ పత్రికా కార్యాలయంలో అడుగు పెట్టడం. అక్కడ గన్నవరపు సుబ్బరామయ్యగారిని కలుసుకున్నాను. ఎడంగా ఒక కుర్చీమీద ఇంకో కుర్రాడు కూర్చున్నాడు. గంటో గంటన్నరో ఉన్నాను. అవీ ఇవీ మాట్లాడాను సుబ్బరామయ్యగారితో, నా పద్యాలు కూడ ప్రచురణార్థం ఇచ్చానేమో ఇప్పుడు సరిగా జ్ఞాపకం లేదు. తర్వాత నడుచుకుంటూ వచ్చేశాను ఇవతలికి. వీధికొసకి వచ్చేదాకా వెనక్కి తిరిగి చూడలేదు. నా వెనకాతలే వచ్చాడు ఇందాకటి కుర్రాడు. శ్రీనివాసరావుగారూ అని పలకరించాడు. ఒకసారి అతణ్ణి ఎగాదిగా చూశాను

బక్కపలచగా ఉన్నాడు. ఖద్దరు లుంగీ, ఖద్దరు చొక్కా వేసుకున్నాడు. ఎర్రటి పొళ్లు, సూది ముక్కు, సూదుల్లాంటి కళ్లు. పత్రికా కార్యాలయంలో చూసిందితణ్ణే. మనకెందుకులే అని అప్పుడు మాట్లాడలేదు. కాని ఎందుకో ఇప్పుడితనే కొంపెల్ల జనార్దనరావయి ఉంటాడనిపించింది. మీరు కొంపెల్ల జనార్దనరావుగా రనుకుంటాను... అని పుస్తకంలో అచ్చయిన పూర్తి పేరు చదువుతున్నట్లు అనేశాను. ... ఔను అతనే. అతని రచనల్లోని... గానము విపంచికను మీటే... పద్యపాదాలు మనస్సులో సందడిచేశాయి. ప్రథమ పరిచయం. పక్కనే లింగిచెట్టివీధిలో ఉంటున్నానని అడ్రెస్ ఇచ్చాడు. తర్వాత ఎన్నోసార్లు అతణ్ణి ఇంటివద్దా పత్రికా కార్యాలయంలోనూ చూశాను. ఎప్పుడూ అతను మా హాస్టలుకి వచ్చినట్లు జ్ఞాపకం లేదు. నేను ఆహ్వానించకపోవడం వల్లనో ఏమో అనిపించుతుందిప్పుడు. అటువంటి సాంఘిక మర్యాదలను పాటించడం అప్పుడూ ఇప్పుడూకూడా నాకు తెలియదు. నేను పిలిచి ఉంటే వచ్చేవాడేమో... పిలవకపోవడం నా తప్పేమో? ఎందుకూ ఎక్కడైతేనేం విధిగా ప్రతి రోజూ మేం కలుసుకుంటూనే ఉండేవాళ్ళం. రెండేళ్ళు ఇలాగడిచాయి. మళ్లీ మేము దూరం అయిపోయాం. తరచు ఉత్తర ప్రత్యుత్తరాలు మాత్రం సాగించేవాళ్ళం. ప్రపంచాన్ని భయానక బీభత్స రసాల్లో ముంచెత్తిన ౧౯౩౦ వ దశాబ్దపు రోజులు. దరిద్రపురోజులు. ఆపదిసంవత్సరాలూ నేను బంతిలాగ ఉన్నచోట ఉండకుండా గెంతాను. ఆ పదేళ్లలోనే నా మహాప్రస్థానం గీతాలన్నీ - అన్నీ కాకపోయినా ఆల్మోస్టు అన్నీ రాశాను. ఆ పదేళ్ళు అంతం కాకముందే జనార్దనరావు మరణించాడు. అతనికే నామహాప్రస్థానం అంకితం ఇచ్చాను. అది వేరే సంగతి.

ఒక మనిషికి ముప్ఫయి యేళ్ళు వచ్చాయంటే మనిషిగా అతని జీవితం ప్రారంభం అవుతోందన్న మాట. పాపం జనార్దనరావు జీవితం ప్రారంభించక ముందే మరణించాడు. ఎంతోమంది కొతని పేరు తెలియదు. ఎలా తెలుస్తుంది. ఎందుకు తెలియాలి: అతను బతికున్నంతకాలం అతనిరాత లెవరికీ అర్థంకావని ఒకపేగోల. పద్యాలమాట సరే సరి. వచనం కూడ అందరికీ కొరకరాని కొయ్యే. ఒక ఉదాహరణ. వైశాఖి సంచికలో జనార్దనరావు తన కవిత్వంమీద వ్రాసినవ్యాసాన్ని కృష్ణశాస్త్రిగారు ఆసాంతం చదివి, ఆఖరుకి...అయితే ఏమిటయ్యా ఇతనంటాడు? ఇందులో నన్ను పొగడినట్టా, తిట్టినట్టా? అన్నాడు. ఒకప్రముఖ వారపత్రిక ఆనాటి సాహిత్యకులందరికీ సరదా బిరుదులిస్తూ ఉండేది. జనార్దనరావుని చండప్రచండగండ శిలాభినవకొక్కొండ...అని అభివర్ణించింది. మరినన్నో... కవిమహోత్పణావర్త ... అని కాబోలు అంది. కాబోలేమిటి ... ఔను. జనార్దనరావు మాత్రం తన బిరుదులోని శబ్దగమనం అనుకరిస్తూ నన్ను, దండి పద పదండి మండితాభినవదండి...అన్నాడు. సరదాగానే ఉందిగాని ఈవర్ణన నాకు సరిపోయిందని ఆనాడు అనుకోనూ లేదు. ఈనాడు అంగీకరింపనూ లేదు. జనార్దనరావూ నేనూ ఎప్పుడూ వాదించుకొనేవాళ్ళం కాం కాబట్టి, అతని వర్ణనని నేను చిరునవ్వుతో స్వీకరించాను. నాకిచ్చిన బిరుదును జనార్దనరావు తమాషాగా వ్యాఖ్యానించాడు. తొలిదండి తెలుగు పదమనీ, చివరిదండి సంస్కృత పదమనీ వివరించేవాడు, చెప్పొద్దూ. జనార్దనరావులోఉన్న ఒక గొప్పసుగుణం ఏమిటంటే, తన అభిప్రాయాలను ఎవరిమీదా బలవంతంగా రుద్దేవాడు కాదు. ఎన్నో పర్యాయాలు మేం ఎన్నో విషయాలమీద మాట్లాడుకునేవాళ్లం. ఎప్పుడూమాటమీదమాట అనుకున్నట్లుగాని ఎన్నడూ గొంతు హెచ్చించి కొట్లాడుకున్నట్టుగాని నాకు జ్ఞాపకం లేదు. జనార్దనరావు

మొగంమీద నే నెప్పుడూ కోపం అనేది చూడ లేదు. నిస్పృహ చూశాను. నిరాశ చూశాను. అందులోనే ఒక అజేయమైన పట్టుదలకూడా చూశాను. బాధపడడం చూశాను. ఆఖరాఖరి రోజుల్లో ఒక మూడురోజులు కాబోలు జనార్దన రావు మా యింట మంచంపట్టాడు. ఎంత బాధ పడ్డాడని. నేను నిస్సహాయంగా అతనితో అన్నాను,...జనార్దనరావుగారూ, ఆరోగ్యంగా ఉండి కూడా నేను మీ రెంత బాధపడు తున్నారో అంత బాధా పడుతున్నానంటే నమ్మండి...అని. కేథలిక్కు ప్రేమనుగురించి చెబుతారులెండి. నువ్వు ప్రేమించిన వ్యక్తికి కుడి కాలు నొప్పిగాఉంటే నీ కుడికాలికి కూడ ఆ నొప్పి ఉంటుందని. జనార్దనరావు విషయంలో సరిగా ఈ అనుభవం నాకు కలిగింది...ప్రపంచ బాధ శ్రీ శ్రీ బాధ...అని నాగురించి చలంగారు రాసిన అభిమానంతోకూడిన అతిశయోక్తికి ఇదే అర్థం అనుకుంటాను. ఎంచేతంటే ప్రపంచంలో ఎంత బాధ ఉందో ఎవ్వరూ కొలవలేరు. అదంతా ఏ ఒక్క మనిషీ తన ఒక్కడిలోనే అనుభవించగలగడం అసాధ్యం. బుద్ధుడైనాసరే, జీసస్‌అయినాసరే, గాంధీఅయినాసరే, ... మన కంటే మరికొన్ని రెట్లు ఎక్కువ అనుభవిస్తారు. అంతే మనిషికంటే ప్రపంచం గొప్పది. మనిషి కంటె మనుషులు గొప్పవారు అంతే. సరే ఈ వేదాంతాలకేంకాని జనార్దనరావుగురించి చెప్పు కుందాం మళ్ళీ. జనార్దనరావంటే ఉదయిని. ఉదయిని అంటే సాహిత్య స్వరూపాన్ని తీర్చి దిద్దడానికి ప్రతిజ్ఞపట్టిన పత్రిక. ఆ పత్రిక కోసమే బలైపోయాడు జనార్దనరావు.

...ఎవరికి కావాలి నేస్తం నువ్వు
కౌగిలంమీద ఒక ఊహకు బలి అయితే
కనబడని ఊహ నిన్ను కబళిస్తే
అందని రెక్క నిన్ను మంత్రిస్తె, నిమంత్రిస్తే ...

అని జనార్దనరావుకి నా...మహాప్రస్థానం... అంకితంచేసిన గీతంలో రాశాను.

... ఉదయం ... పత్రిక ప్రారంభించడానికి తహ తహ పడుతున్న రోజుల్లో జనార్దనరావు నాకు చాలా ఉత్తరాలు రాశాడు. అంగులో ఒకటి పూర్తిగా చదువుతాను. కొంచెం దీర్ఘమైన ఉత్తరమే. కాస్త ఓపికగా వినండని ప్రార్థన.

మద్రాసు, 26-6-33

డియర్ శ్రీ శ్రీ

మీ జాబువల్ల నాకు కలిగిన ధైర్యము ఇంతా అంతా కాదు. నాకు సహజముగా అధీరత ఉంది. దానికి సాయము బాహ్య పరిసరాలు జడిపిస్తే మరీ ఇదిగా ఉంటుంది. ఒకవేళ ఆ సున్నితమైన మనస్థితిచేతనే కొంచెము అనుకూలమైన వాయువు వీచినా ఎక్కువ పారవశ్యముపొందే వెర్రిఉంటే ఉండవచ్చును. కాని ఇట్టి నేను ఒక కేంద్ర ములో నాతపోమయమైన వాతావృతి చుట్టుకొని సర్వమూ పరికిస్తూ ఉంటానన్నది నాకు తెలిసిన సత్యము. దానినిబట్టి నాలో మిగిలిన మూలగతము లైన సంకల్ప వికల్పాలు నన్ను బోధించుతాయి. అక్కడ తాకింది మీ ఆనుకూల్యము, నా సంకల్ప ములో ఒక మెరుగు చొచ్చింది. అయితే అది మళ్ళీ మీరు అనే ఒక మూర్తిలో నిలుపుకొని నాకు సాయము చేయండి...నాకు వ్యాసము పంపండి అని ఉద్భావించుకుంటూనే ఉంటాను.

నా మనసులో మీరు రేపిన తేజము వికసించిన రేకులు నేను చూచినంతగా మీకు చూపలేక పోతున్నాను. నేనట పత్రిక నడుపుతానట. ఏమోమరి నడుపుతానటకూడాను. ఎల్లాగో చూచు కొందాములే. నా తేజము నేను చూచుకోవడము తోనే అందరికీ చూపుతాను కాబోలు. నేడు ఉపవసిస్తున్నాను నేనంటే జనార్దనరావు అనే కాశ్యపావత్సార నైధ్రువత్రయార్షేయ ప్రవరా న్వితుడని మాత్రం గ్రుద్దుక కూర్చోకండేం **మన**

స్సులో. సరే ఈ వేదాంతాలకేంలెండి. నేనూ మీకు సమాధానము వ్రాద్దామనుకుంటుంటే అప్పలస్వామిగారి ఉత్తరము వచ్చింది. ఇప్పుడే. ఉత్సవ ప్రయత్నాలకు ఉత్సవం పాటించారు. మీరు ఇక్కడకు వచ్చే ఏర్పాటుమాట వెంటనే తెలియజేయండి. మీరు ఇక్కడుంటే చాలా బాగుండును. కాని యెక్కడ వున్నా ఇక్కడ ఉన్నట్లే వర్తించాలి. ఊరుకుంటే వల్లకాదు ప్రార్థిస్తే కోపపడుతారని నేనే కోపపడుతున్నాను. వెంటనే ఒక సహాయం - వ్యాసాలు శుభ్రమైనవి పంపించేయండి. నేను చూచుకొని పొంగుతూఉంటాను. స్టాండర్డు విషయంలో చాలా శ్రద్ధ తీసుకుందాము. నాకూ అదే పెద్ద తాత్పర్యము. నిజానికి డబ్బువిషయంలో కంటె కూడా స్టాండర్డు కంట్రిబ్యూషన్సు వచ్చే అవకాశం విషయంలో ఎక్కువ తలంపు నిలబెట్టాము మొదటినుంచీని. పత్రిక ఉన్నత వీధులలో నడపడానికి సర్వశః ప్రయత్నిద్దాము. నడపగలమని నాకు ధైర్యము కల్గుతూంది. ఈ పత్రిక మన యువలోకమునకు ప్రతినిధులముగా మన కనుబంధించి ఒక దివ్యమైన సాధన అని అనుకుందామని ఉంది నాకు. ఇది నెగ్గిందంటే సారస్వత చరిత్ర మెరుగు తిరిగిందన్నమాట అని మనలను మనమైనా మనస్సులో పొగడుకుందామని ఉంది. ఆహావిస్సు ఆరగించి నా సిగ్గు తొలగిస్తూంది. కాని నా మౌనమూ నిలుపుతుంది స్తుతిపాఠమంతా సిగ్గులు మూటకట్టిస్తూ.

ఎంతెంత రహస్యాలు చెప్పాననుకొన్నారు మీకు? ఆస్థానములో వైరుధ్యము కోటలుకట్టే బలశాలులు ఇవి. ఇది మీకు ప్రశంసగా ఇస్తున్నాను. మీ మానవత్వానికిన్ని! మీరు చాలా గొప్పవారు అని నా నమ్మిక. నిజముగా భాషా దేవి సేవచేయడానికి, దేవలోకమంతా కదిలిపోయే వినీత దీక్ష ప్రజ్వరిల్లిన మానసము మీది మీకు తెలుసునా?

మన సోదరులకు నమస్సులివ్వండి. పత్రిక విషయమై సలహాలు ఇవ్వండి. చాలామంది యువమిత్రులు అభయము చూపుతున్నారు. వారంతట వారే నన్ను పత్రిక పెట్టమన్నవారు కూడా ఉన్నారు.

అయితే నా ప్రజ్ఞ విషయములో నాకు చాలా భయము వేస్తున్నమాట వాస్తవము. నేనే గొప్ప రచనలు వ్రాసిపెట్టుకోవలసి ఉన్నది. ఇంకా తగినంత సిద్ధముకాలేదు. ప్రయత్నములో ఉన్నాను. నాకు నేనుగాకూడా ఎంతో సలహాలు ఇవ్వండి.

తంబుడు, కాదు,
అన్నే కాబోలు
జనార్దనరావు.

ఇప్పుడు చదవండి జనార్దనరావు గీతాలు. ఎందుకు అర్థం కావో చూదాం. కాని అవన్నీ ఎక్కడున్నాయి? గ్రంథరూపంలో ఎప్పుడుబయట పడతాయి? ఈ లోపున నాకు నచ్చిన, నాకు కంఠస్తంగా వచ్చిన ఒకటి రెండు గీతాలు చదువుతాను. ఒక గీతం ...

నాభావి పథము పంచల నెంచు నొగుడుచు
వేచియుందువొ కాలవిభు చోదనము లెంచి
అవతరింపుమి దేవి ఆవహింపుమి నను
నాగుండె విరియు ఈనాడె ఆ శుభవేళ
ఓ విజయలక్ష్మీ.

ఆకళింతలు మెలగి ఆవేశమయిపొంగి
నీ క్రమపద తపోనిరతి పెంపు వెలింగి
ఏననంత పథాలకే దాగికొని నిల్చి
అల దివ్యవాణి ఆజ్ఞలు మీటుకున్నాను
అవతరింపుమి.

వింతయూ నొక స్వప్న వీథి విహాయస
ప్రాభవశ్రీలో శంపలు లోన నిలబోసి

ఇటు మేలుకొల్పి జాగృతినే హరింపవు
విశ్వమ్ము నాస్వప్న విజయమే వరియించు
అవతరింపుమి.

విశ్వయాత్రికు లాత్మవిభు స్వప్న కలశముల్
నీ తేజమున కడంగిరి జ్యోతిపాకృతుల్
నామాధురీ ధురీణము భావజగతిని
పోహణింపుమి నీప్రభూత లావణ్యముల్
అవతరింపుమి.

నా మహేచ్ఛా ప్రభావము నాకె ఐక్యమై
విశ్వవారిజము స్వావృతమహా సౌందర్య
పరిధి అంచులు తాక విరిసి భౌతిక భూతి
విరిసిపో, నాలోన విస్తృతి గుణించుకో
అవతరింపుమి.

నే రవిత్వము వెలింగిన రాపిళుల్ వడి
ప్రకృతి హృత్ప్రణయ వైభవము సెద కుంచించి
పరిమితుల్ వలదు తత్పరవృత్తి తెరవిచ్చి
ప్రళయగర్వ పథాన కరదృష్టి మలచుకో
అవతరింపుమి దేవి ఆవహింపుమి నను
నా గుండెలవియు ఈనాడె ఆ శుభ వేళ
ఓ విజయలక్ష్మి.

ఇంకొక గీతి, ఉపేక్షితము.

## ఉ పే క్షి త ము

ఒక ముసలి దోనె యిది పడియున్న దిచట
ఊడిగము సేఁత సత్తువలుడిగి యుడిగి
తనకు దా మృతస్మృతులు కల్పనము సేసి
కొనుచు తనపయిఁదా జాలిగొనుచు నిట్లు.

అఖిల జనవాత్సల్య సహార్థియగుట
తలపడు స్వకీయ సౌఖ్యసంధాయియగుటె
అరయడు నరుండు - కట్టికొన్నాడు, తరువు
నరికి, కంకాళమయ మొక నావ తనకు.

కుపిత జలరాశి ప్రకృతి సంకుల విఘట్ట
నముల దనకంగరక్షగా నవయజేసె
స్వార్థసంపాదనములకై యడచిదీని
చూచి యోర్వడు చూడనే చూడడిపుడు.

నిరతయాత్రామిళత్కాల చరణబహుళ
చిహ్నజీర్ణిత సత్త్వమీ సికతరేణు
సముదయమున గాయార్థ దఘ్నముగ నిలిచి
నేర్చుచున్నది యిది ధ్యాన నిరతి తాల్చి.

వాయువులు దీనగుప్త భావములు చదువ
గొడగుచున్నవి చెడిన గూడిసొదలు
పోసికొని యేడ్చుచున్నదీ పులుగు జలము
లశ్రువులు బిందుకెలన చిరానురక్తి.

గతకథా గళసారి గాద్గదిక మాధు
రీగరిమలో నడచుకొన్న పృథులశాంతి
అణువణువునంగు నాల్క విప్పారి, స్వాగ
తను విరాలించియడుగు, దైన్యమువరించి.

జనార్దనరావు బతికుంటే యెలా పరిణమించే వాడని ఊహాగానాలు చెయ్యడం వ్యర్థమైన పని. కాని ఒకటి మాత్రం నిశ్చయం. అతడు కమ్యూ నిజాన్ని హర్షించలేడు. అర్థంచేసుకోగలడు. కాని ఆచరణలో అతణ్ణి అనుష్ఠించనీయకుండా ఆటంకపరిచే ఒక ఎరిస్టోక్రాటిక్ తత్వం అతనిలో ఆనాడే నేను పసికట్టాను. కరడుకట్టిన కాన్సర్వేటివ్ గా పరిణమించేవాడా? అదీ సందేహం. ఎంచేతనంటే ఛాందసంలోని చాదస్తాలన్నిటినీ అతను అవహేళన జేసేవాడు. విశాలంగా విప్పారిన మనస్సతనిది. సంకుచితత్వాని కక్కడ జాగా లేదు.

మా యిద్దరిమధ్యా సమానధర్మా లేమిటి. ఒకొక్కటే చెప్పుకొస్తాను.

౧. ఇద్దరం యించుమించు సమవయస్కులం.
౨. ఇద్దరికీ ఆడంబరం అంటే ఇష్టంలేదు.

౩ ఆ రోజుల్లో ఇద్దరం సాహిత్యం అంటే పడి చచ్చేవాళ్లం.

౪. విశ్వనాథ సత్యనారాయణ కవిత్వం అంటే ఇద్దరికీ ఎడతెగని మోజు

౫. సాహిత్యానికొక సాధికారమైన వేదిక ఉండాలనీ, అది పత్రికారూపంలో ఉండాలని ఇద్దరం దృఢంగా విశ్వసించాం

౬. పత్రికల నిర్వహణలో పెట్టుబడిదారీ విధానం ప్రత్యక్షంగా పనిచేస్తోందని అతను లోపల నుంచీ, నేను పైనుంచీ(ఆరోజుల్లో)గ్రహించాం

౭. డబ్బులేని పత్రికలు బతకవని ఇద్దరికీ తెలుసు కాని ఆ డబ్బు ఎలా ఆర్జించాలో ఇద్దరికీ తెలియదు (ఇరవైయేళ్ళ తర్వాత ఇప్పుడిప్పుడే నాకు ఈ టెక్నిక్ తెలుస్తోంది )

౮ ఇద్దరి జీవితాలని సాహిత్యానికే అంకితం చెయ్యాలని అనుకున్నాం

౯ ఇద్దరిలోను మితవాదతత్వం లేగు ఏ యెండ కాగాడుగు పట్టడం అంటే ఇద్దరికె అసహ్యం

మరి వైరుధ్యాలమాట.

౧ అతనికున్నంత క్లాసికల్ లెర్నింగ్ నాకు లేదని నా దిగులు నాకున్న కాలేజి ఎడ్యుకేషన్ తనకు లేదని అతని బెంగ. కాని స్వయం కృషితో అతను ఆంగ్ల సాహిత్యాన్ని అధ్యయనం చేశాడు సంస్కృతంతో సరాసరి పరిచయం లేకపోయినా మన సంస్కృతిని నేను ఒంటపట్టించుకున్నాను.

౨ అతను చచ్చిపోయీ బతికున్నాడు నేను బతికుండీ చచ్చినట్టు పడిఉన్నాను అతను చెయ్యదలచుకున్నంతా చెయ్యలేకపోయాడు నేను కొంతలో కొంతైనా చేశాను ఇంకా చేస్తాననే ధైర్యమూ ఉంది ఈ ధైర్యమే ఇంకా నేను బ్రతికుండడానికి కారణం

జనార్దనరావు గురించి నేను చెప్పిందీ చెప్పగలిగిందీ ఇంకేముంది ఈ ప్రసంగం ఎలాముగించడం? ఏమీ తోచలేదు కీట్సు చనిపోయినప్పుడు షెల్లీ వ్రాసిన మాటల్లో ముగిస్తా ..

ఐ లివ్ ఫర్ ఎడోనిస్ .



THE PUBLICATIONS DIVISION
Ministry of Information and Broadcasting
Government of India